
'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 189

శనివారం 25-3-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

రాహుల్ గాంధీపై అనర్హత వేటు



పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష ఖరారైన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపై లోక్‌సభ సభ్యుడిగా అనర్హత వేటు పడింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. శిక్ష ఖరారైన తేదీ ఈ నెల 23 నుంచే ఈ అనర్హత వేటు అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. జైలు శిక్షపై ఉన్నత న్యాయస్థానంలో స్టే లభించకపోతే మరో ఎనిమిదేళ్లపాటు ఎన్నికల్లో పోటీచేసేందుకు రాహుల్ అనర్హుడవుతారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

చివరి రోజూ అదే తీరు



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరి రోజూ టీడీపీ తన అరాచక బుద్ధిని ప్రదర్శించింది. శుక్రవారం ప్రశ్నోత్తరాలు మొదలవగానే వాయిదా తీర్మానానికి పట్టుబట్టింది. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని స్పీకర్ వారించడంతో టీడీపీ సభ్యులు రెచ్చిపోయారు. తమను దగ్గరుండి కొట్టించడంతో పాటు.. ఎమ్మెల్యేపైనే స్పీకర్ దాడి చేశారంటూ ఆరోపించారు.

వివరాలు 5 ▸

ద్రవ్యలోటు తగ్గింది



2021–22లో.. అంతకుముందు ఆర్థిక ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం 1.46 శాతం తగ్గిందని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. 2022 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ ఇచ్చిన నివేదికను ఆర్థిక మంత్రి బుగ్గన అసెంబ్లీకి సమర్పించారు. రాష్ట్ర బడ్జెట్ లోపల అప్పులు, బడ్జెట్ బయట అప్పుల వివరాలను కాగ్ విశ్లేషించింది.

వివరాలు 3 ▸

అది దొంగల రాజ్యం

చంద్రబాబు మరో భారీ దోపిడీ.. ఆధారాలతో సహా బట్టబయలు

శాసనసభలో వివరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- అమరావతి నిర్మాణాల్లో యథేచ్ఛగా అవినీతి.. కాంట్రాక్టు కంపెనీలను బెదిరించి భారీ వసూళ్లు
- బోగస్ కంపెనీల ద్వారా నిధులు కొల్లగొట్టారు
- చంద్రబాబు పీఏ, రామోజీ కుమారుడి వియ్యంకుడే పాత్రధారులు
- అవినీతి దందా సూత్రధారి చంద్రబాబే
- ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో వెల్లడైన వాస్తవం
- బాబు ఆదేశాలతోనే నిధుల మళ్లింపు
- ఐటీ అధికారులకు నిర్మాణ కంపెనీల ప్రతినిధుల వాంగ్మూలం
- అందుకే చంద్రబాబుకు ఐటీ నోటీసులు

2లో



బోగస్ కంపెనీలను సృష్టించడం.. డబ్బులు తీసుకోవడం.. వాటిని చంద్రబాబుకు చేర్చడం.. వీటన్నింటిపై ఆధారాలతో సహా ఐటీ శాఖ అధికారులకు దొరికిపోయారు. ఇంత దారుణంగా ప్రజల డబ్బును బాబు దోచేశారు. ఈ అవినీతిలో ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్‌వీఆర్ రఘు పాత్రధారి. అంటే ఒక పద్ధతి ప్రకారం ఈ దొంగల ముఠా దోచుకో.. పంచుకో.. తినుకో.. అనే దోపిడీలో భాగస్వామ్యమైందని ఆధారాలతో వెల్లడైంది. ఇవన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉంది కాబట్టే ఈ సభ ద్వారా చెబుతున్నాం.

- సీఎం వైఎస్ జగన్

ఆ నలుగురు.. ఔట్

- వైఎస్సార్‌సీపీ నుంచి కోటంరెడ్డి, ఆనం, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి సస్పెన్షన్
- క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించుకున్నాకే చర్యలు తీసుకున్నాం.. అసంతృప్తివాదులుంటే సరిదిద్దుకోవచ్చు.. అమ్ముడుపోయే ద్రోహులను ఉపేక్షించలేం
- ప్రలోభాలు, డబ్బులు ఎరవేయడం చంద్రబాబుకు ఆది నుంచి అలవాటే.. ఇప్పుడు ఒక్కొక్కరికి రూ. 10–15 కోట్లు ఆశ చూపిన బాబు
- చివరిదాకా నాన్చుడు ధోరణి, నమ్మక ద్రోహం సీఎం జగన్‌కు తెలియవు.. ప్రజాదరణలో వెనుకబడ్డ వారికి టిక్కెట్‌పై ముందుగానే స్పష్టత ఇచ్చారు
- గతంలో 23 మంది టీడీపీకి అమ్ముడుపోయినప్పుడూ ఇలాగే వ్యవహరించాం.. భవిష్యత్తులోనూ పారదర్శకమైన రాజకీయాలే చేస్తాం: సజ్జల

5లో

ఎస్టీ జాబితాలో బోయ, వాల్మీకి!

- ఏజెన్సీలోని ఎస్టీల హక్కులకు ఏమాత్రం భంగం కలగదు
- విద్య, ఉద్యోగాల విషయంలో ఎలాంటి ప్రభావం ఉండదు
- జోనింగ్, ఇతర నిబంధనలు ఏజెన్సీలోని ఎస్టీలకు రక్షణగా ఉంటాయి.. వారిని జీవితాంతం గుండెల్లో పెట్టుకుంటా.. ఇసుమంతైనా అన్యాయం జరగనివ్వం
- బోయ, వాల్మీకిలు ఎక్కువగా ఉండే రాయలసీమ ఇతర జోన్‌లో ఉంటుంది.. ఏకసభ్య కమిషన్ సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటున్నాం
- దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా.. ఆర్థిక, సామాజిక న్యాయం కోసమే.. అన్యాయానికి గురైన వారికి సాధ్యమైనంత వరకు మంచి చేద్దాం
- కేంద్రానికి ఈ 2 తీర్మానాలు పంపుతున్నాం: సీఎం జగన్

2లో

పోలీసులకు ఆర్థిక భరోసా

బకాయిల చెల్లింపుతో ఊరట



ఏలూరు టౌన్: పోలీసులకు ఇవ్వాల్సిన అలవెన్సు బకాయిలు మంజూరు చేయటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు జీతాల విషయంలో పెద్దగా ఇబ్బంది లేకున్నా.. అలవెన్సుల బకాయిలు పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడంతో పోలీసులకు ఆర్థిక భరోసా లభించింది. బకాయిల చెల్లింపులతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలన గాడిలో పెట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు చెల్లింపులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

పోలీసులకు ఊరట

ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి పశ్చిమలో సుమారు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, హెచ్‌సీ, కానిస్టేబుల్ వరకూ అలవెన్సుల బకాయిలు మంజూరవుతున్నాయి. సుమారు 11 నెలలుగా పేరుకుపోయిన ట్రావెలింగ్ అలవెన్సు బకాయిలు ఒకేసారి విడుదల చేయటంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఆర్‌ఏ, ఏపీజీఎల్‌ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం మంజూరు చేయటంతో పోలీసులు సంతోషంగా ఉన్నారు. ఇక సరెండర్ లీవ్స్, అదనపు సరెండర్ లీవ్స్ బకాయిలు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయని, అవికూడ త్వరలోనే మంజూరు చేస్తారని అంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసింది. రెండు జిల్లాల్లోనూ సుమారు ఆయా బకాయిల చెల్లింపులు రూ.8 కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. ఒక్క టీఏ అలవెన్సు బకాయిలు మాత్రమే సుమారుగా రూ. 3.82 కోట్ల నుంచి రూ.4.12 కోట్ల వరకూ ఉందని అధికారులు అంటున్నారు. వీటితోపాటు హెచ్‌ఆర్‌ఏ, ఇతర బకాయిలు చూస్తే రెండు జిల్లాలోనూ పోలీసుల శాఖకు రూ.8 కోట్ల వరకూ బకాయిలు చెల్లింపులు చేసినట్లు తెలుస్తోంది. ఏపీజీఎల్‌ఐ, జీపీఎఫ్ రుణాలు సైతం విడుదల కావటంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీస్ శాఖలో సీఐలు– 30 , సబ్ ఇన్‌స్పెక్టర్లు –120, ఏఎస్‌ఐ –150, హెడ్ కానిస్టేబుల్స్ – 450 , కానిస్టేబుల్స్ – 1850 మంది ఉన్నారు. మొత్తంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2600 మంది వరకూ పోలీస్ సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట

పోలీస్ శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. సిబ్బంది అనారోగ్యంతో మరణిస్తే సంక్షేమ నిధి నుంచి ఆర్థికంగా ఆదుకుంటున్నాం. తాజాగా ప్రభుత్వం అలవెన్సు బకాయిలు విడుదల చేసింది. టీఏ అలవెన్సులు, హెల్త్, హెచ్‌ఆర్‌ఏ ఇలా అన్నీ మంజూరు చేశారు.

–రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఎస్పీ

బకాయిల చెల్లింపులు హర్షణీయం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీస్ సిబ్బందికి చాలా కాలంగా చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించడం హర్షణీయం. సిబ్బందికి ఏ సమస్య వచ్చినా పోలీస్ అధికారుల సంఘం వారికి అండగా ఉంటుంది. పోలీస్ సిబ్బందికి 11 నెలల టీఏ అలవెన్సులతోపాటు, ఏపీజీఎల్‌ఐ, జీపీఎఫ్, హెల్త్ అలవెన్సులు సైతం విడుదల చేశారు. సిబ్బందికి అలవెన్సులు మంజూరు చేయాలని కోరుకుంటున్నాం.

– ఆర్.నాగేశ్వరరావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏలూరు

అతివల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'!



స్వయం సహాయక సంఘాల మహిళలకు వరంగా 'వైఎస్సార్ ఆసరా' పథకం	స్వశక్తితో ఎదిగేందుకు భరోసా
	చిరు వ్యాపారాలతో కుటుంబానికి అండ
	ఇప్పటికే రెండు విడతల్లో లబ్ధి
	నేడు మూడో విడత పంపిణీకి ఏర్పాట్లు

సాక్షి, రాజమహేంద్రవరం: స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించేలా ప్రోత్సహించేందుకు 'వైఎస్సార్ ఆసరా' పథకానికి రూపకల్పన చేశారు. సంఘాల్లో మహిళలు తీసుకున్న రుణాలను విడతల వారీగా మాఫీకి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ. 485 కోట్లు అక్కచెల్లెమ్మలకు అందజేశారు. తాజాగా శనివారం మూడో విడతలో రూ.242.85 కోట్లు రుణమాఫీ చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను డీఆర్‌డీఏ అధికారులు పూర్తి చేశారు. ఆదివారం నుంచి ఆసరా సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

ఉద్దేశం ఇదీ..

సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సమయంలో తాను అధికారంలోకి వస్తే దశల వారీగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 11, 2019 నాటికి వారు తీసుకున్న రుణాలను ఎంతైతే అప్పు నిల్వ మిగిలి ఉంటుందో వాటిని నాలుగు విడతలుగా ఆయా సంఘాలకు చెల్లించేందుకు ఆసరా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే ఆచరణలోకి తీసుకొచ్చారు.



తూర్పు గోదావరిలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల పరిధిలో 19 మండలాలున్నాయి. తొలి దశలో 27,297 సంఘాలకు రూ.241.98 కోట్లు, రెండో దశలో 27,417 సంఘాలకు రూ.244.04 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరింది. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా శనివారం మూడో విడత కింద జిల్లాలో 27,413 స్వయం సహాయక సంఘాలకు లబ్ధి చేకూరనుంది. రూ.242.85 కోట్ల నగదు మహిళల ఖాతాల్లో జమ కానుంది. సీఎం జగన్ నేరుగా బటన్ నొక్కి ప్రక్రియ ప్రారంభిస్తారు. పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం, అధికార యంత్రాంగం కృషి చేసింది. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా జాబితా రూపకల్పన చేశారు. సచివాలయాల వద్ద జాబితాను అందుబాటులో ఉంచారు. సభ్యులు చనిపోయినా నామినీ వివరాలు అధికారులకు అందజేస్తే పరిష్కరించి సొమ్ము అందజేసేలా చర్యలు తీసుకుంటారు.

రేపటి నుంచి వారోత్సవాలు

ఆదివారం నుంచి వాడవాడలా ఆసరా సంబరాలు నిర్వహించేందుకు డీఆర్‌డీఏ సన్నద్ధం చేస్తోంది. గ్రామం, మండల కేంద్రం, పట్టణం, నగరం మొదలు అన్ని ప్రాంతాల్లో 'గడప గడపకు ఆసరా' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 25 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు ప్రజలకు, మహిళలకు వివరించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున మహిళలకు చేస్తున్న ఆర్థిక సాయంపై అవగాహన కల్పించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశారు.

టీడీపీ హయాంలో మోసం

టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని ప్రకటించారు. దీంతో మహిళలు రుణాలు చెల్లించలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన బాబు హామీ ఊసే ఎత్తలేదు. చేసేది లేక మహిళలు చేసిన అప్పుకు వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి తలెత్తింది. అప్పుకోసం బ్యాంకర్ల ద్వారా వేధింపులకు గురయ్యారు. తిరిగి 2019 ఎన్నికల సమయంలో మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు బాబు కొత్త పన్నాగం పన్నారు. ఎన్నికల సమయంలో తాయిలాలుగా పసుపూకుంకుమ కింద నగదు అందజేసి చేతులు దులుపుకున్నారు. గ్రహించిన డ్వాక్రా మహిళలు ఎన్నికల్లో బాబును దూరం పెట్టారు. వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెట్టారు.

స్వయం ఉపాధి దిశగా అడుగులు

ప్రభుత్వం అంజేస్తున్న ఆసరా సొమ్ముతో మహిళలు స్వయం ఉపాధి దిశగా దృష్టి సారిస్తున్నారు. దీంతో పాటు స్త్రీనిధి ద్వారా వచ్చిన సొమ్మును జమ చేసుకుని పాడి పశువుల పెంపకం, కిరాణా దుకాణం, గుడ్లు విక్రయించడం, టెంట్లు అద్దెకు ఇస్తూ వచ్చిన డబ్బుతో కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.

జీవన ప్రమాణాల మెరుగునకు కృషి

మహిళల జీవన ప్రమాణాలు, ఆర్థిక ప్రగతి సాధించేందుకు ఆసరా పథకం ఎంతగానో దోహదం చేస్తుంది. రుణమాఫీ ద్వారా వచ్చే నగదుతో పాడి పరిశ్రమ, చిరు వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాం. స్వయం ఉపాధి పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. ఫలితంగా మహిళలు కుటుంబ పోషణకు భర్తకు చేదోడుగా నిలుస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో ఆసరా నిధులు విడుదలయ్యాయి. ఆసరా వారోత్సవాల సందర్భంగా అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రతి గ్రామంలో వివరిస్తాం.

–ఎస్.సుభాషిణి, పీడీ డీఆర్‌డీఏ

విడతల వారీగా సంఘాలకు నిధుల (రూ.కోట్లలో) విడుదల ఇలా..

నియోజకవర్గం	మొదటివిడత	నిధులు	రెండోవిడత	నిధులు	మూడోవిడత	నిధులు
అనపర్తి	3,984	35.25	4,000	35.55	3,999	35.38
గోపాలపురం	4,546	40.77	4,550	40.90	4,549	40.80
జగ్గంపేట	1,441	13.25	1,465	13.63	1,465	13.42
కొవ్వూరు	3,672	32.06	3,676	32.18	3,676	32.10
నిడదవోలు	4,269	42.06	4,269	42.05	4,269	42.04
రాజమండ్రి రూరల్	4,128	33.53	4,170	34.16	4,170	33.81
రాజానగరం	5,257	45.05	5,287	45.58	5,285	45.29

ఎస్టీ జాబితాలో బోయ, వాల్మీకి!

సాక్షి, అమరావతి: పాదయాత్ర, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. 70 ఏళ్లుగా ఎస్టీ హోదా కోసం పోరాడుతున్న ఆ రెండు కులాలకు న్యాయం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అదే సమయంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్టీలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. జోనల్ వ్యవస్థ వారికి రక్షణగా ఉంటుందని, చదువులు, ఉద్యోగాల విషయంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్టీలపై ఎటువంటి ప్రభావం ఉండదని తెలిపారు. బోయ, వాల్మీకి సామాజిక వర్గం అధికంగా నివసించే రాయలసీమ ప్రాంతం ఇతర జోన్‌లో ఉంటుందని వివరించారు. ఇక దళిత క్రైస్తవులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేసేందుకు వారికి ఎస్సీ హోదా నిరాకరించకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మతం మారినంత మాత్రాన దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక పరిస్థితిలో ఎలాంటి మార్పు రాదని చెప్పారు. అందుకే దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరించకూడదనే తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నామన్నారు. ఈ మేరకు శాసనసభ శుక్రవారం విడివిడిగా రెండు తీర్మానాలను ఆమోదించింది. ఈ సందర్భంగా చర్చలో ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..



శాసన సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

మాట మేరకు వాల్మీకి, బోయలకు న్యాయం

నా సుదీర్ఘ పాదయాత్ర సమయంలో బోయ, వాల్మీకి సామాజిక వర్గాల వారు నన్ను కలిసి 70 ఏళ్లుగా ఎస్టీ హోదా కోసం పోరాడుతున్నట్లు వాపోయారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో తమవారికి ఎస్టీ హోదా ఉందని, పక్కనే ఉన్న బళ్లారి జిల్లాలోనూ తమ కులస్తులకు ఎస్టీ హోదా ఉందని చెప్పారు. కానీ రాయలసీమ జిల్లాల్లో ఉన్న తమకు ఎస్టీ హోదా ఇవ్వకపోవడంతో దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎస్టీలలో చేర్చాలని బోయ, వాల్మీకి కులాల వారు కోరడంతో అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చా. అయితే ఎస్టీ హోదా ఇవ్వడం రాష్ట్ర పరిధిలోని అంశం కాదు. అది కేంద్ర ప్రభుత్వం చేయాల్సింది. కానీ చేతనైనంత సాయం చేయాల్సిన బాధ్యత, మానవత్వం మనలో ఉండాలి. ఆ మానవత్వంతోనే వారికి ఎస్టీ హోదా కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చాం. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బోయ, వాల్మీకి కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వారి చరిత్ర, స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించాం. ఆ సామాజిక వర్గం ఎక్కువగా ఉండే రాయలసీమ జిల్లాల్లో కమిషన్ విస్తృతంగా పర్యటించి అధ్యయనం చేసింది. వారి జీవన ప్రమాణాలు, ఆర్థిక, సామాజిక స్థితిగతులు, గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక సమర్పించింది. బోయ, వాల్మీకి సహా అనుబంధ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఏకసభ్య కమిషన్ సిఫార్సులను పరిగణలోకి తీసుకుని వాల్మీకి, బోయ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి తీర్మానాన్ని పంపుతున్నాం.

ఏజెన్సీలో ఎస్టీలకు అన్యాయం జరగదు

బోయ, వాల్మీకి కులాలకు ఎస్టీ హోదా కల్పించాలన్న సిఫారసులపై కొందరు షెడ్యూల్(ఏజెన్సీ) ప్రాంతాల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. వాటిని నమ్మొద్దు. ఈ విషయంపై కమిషన్ కూడా ఒక నివేదిక ఇచ్చింది. ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్టీలకు భరోసా కలిగిస్తూ వారికి కొన్ని విషయాలు చెప్పాల్సిన బాధ్యత ఈ సభ మీద ఉంది. కమిషన్ నివేదికలో కూడా ఈ విషయాలు పొందుపరిచారు. కమిషన్ చెప్పినట్లుగా మన రాష్ట్రంలో సిక్స్ పాయింట్ ఫార్ములా, జోనల్ వ్యవస్థ ఉన్నాయి. దీంతో చదువులు, ఉద్యోగాల విషయంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్టీలపై ఎటువంటి ప్రభావం ఉండదు. కారణం.. ఏజెన్సీ ప్రాంతాలన్నీ వేరే జోన్‌లోకి వస్తాయి కాబట్టి. రాయలసీమ ప్రాంతం వేరే జోన్‌లో ఉంటుంది. బోయ, వాల్మీకిలను ఎస్టీలలో చేర్చడం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్టీల చదువులు, ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. వారి ఉద్యోగాలు వారికే ఉంటాయి. నాన్ జోనింగ్ ఉద్యోగాల మీదే అంతో ఇంతో ప్రభావం ఉంటుంది. కేవలం గ్రూప్–1 ఉద్యోగాలే నాన్ జోనింగ్ పరిధిలోకి వస్తాయి. గత పదేళ్లలో రాష్ట్రంలో కేవలం 386 గ్రూప్–1 ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో ఆరు శాతం ఎస్టీ రిజర్వేషన్ అంటే కేవలం 22 ఉద్యోగాల మీదే పోటీ ఉంటుంది. మిగిలినవి అన్నీ జిల్లాలకు సంబంధించిన ఉద్యోగాలు. అవన్నీ జోన్‌లకు సంబంధించినవే. మొత్తం ఉద్యోగాల్లో ఇవే 99 శాతం వరకూ ఉంటాయి. కాబట్టి ఏజన్సీ ప్రాంతాల్లోని ఎస్టీలకు ఎలాంటి అన్యాయం జరగదు. ఇవన్నీ ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్టీ సోదర సోదరీ మణులకు తెలియజేయాల్సిన బాధ్యత నాపై ఉంది. గిట్టనివారు ఓట్ల కోసం చేసే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరుతున్నా. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు, ఆదివాసీల హక్కులు, ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదని మీ జగనన్నగా మాట ఇస్తున్నా. ఒకరికి న్యాయం చేస్తున్నామంటే.. మరొకరికి అన్యాయం చేస్తున్నట్టు కాదు. అన్యాయం చేయాలనే అభిప్రాయంగానీ, ఉద్దేశంగానీ వైఎస్సార్‌సీపీకి మరీ ముఖ్యంగా మీ జగనన్నకు ఏమాత్రం లేదు. నా రాజకీయ ప్రయాణం మొదలైన తరువాత ఎస్టీలు నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. నా జీవితం చివరి వరకు కూడా వారిని అలానే గుండెల్లో పెట్టుకుంటా. వారికి ఇసుమంతైనా అన్యాయం చేయనని హామీ ఇస్తున్నా.

దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక న్యాయం కోసమే ఎస్సీ హోదా

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా నిరాకరించకూడదని రెండో తీర్మానం చేశాం. నాన్న (వైఎస్సార్) ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇలా తీర్మానం చేశారు. మళ్లీ ఈ రోజు చట్టసభలో ఇదే తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తున్నాం. ఈ విషయంపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. ఇందులో ఏపీ తరపున ఇంప్లీడ్ అయ్యి మన వాదన విని పిస్తున్నాం. ఎందుకు ఇంత గట్టిగా చెబుతున్నామంటే దళితులు ఇంతకు ముందు ఆచరిస్తున్న మతాన్ని విడిచి మరో మతంలోకి వెళ్లినంత మాత్రాన వారి సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాదని అందరికీ తెలుసు. మతం అన్నది నాలుగు గోడల మధ్య ఆ మనిషికి, దేవుడికి మధ్య ఉన్న సంబంధం. ఒక మనిషి మరో మతంలోకి వెళ్తే ఎవరికీ అన్యాయం జరగదు. కేవలం మత మార్పిడి వల్లే వీరికి రావాల్సిన ఎస్సీ హక్కులు రాకుండా పోవడం అన్యాయమని కచ్చితంగా నమ్ముతూ సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తున్నాం.

వాయిస్ ఆఫ్ ది వాయిస్‌లెస్..

ఈ రెండు తీర్మానాలతో ఆ సామాజిక వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని మనం సరిదిద్దినట్లు అవుతుంది. మనమంతా పాలకులం. మనం వాయిస్ ఆఫ్ ద వాయిస్‌లెస్ (గొంతులేని వారికి గొంతుకగా) ఉండాల్సిన అవసరం ఉంది. అలా చేయనప్పుడు మనం ఈ స్థానాల్లో ఉండటం కూడా వృథా అని నేను నమ్ముతున్నా. ఈ రెండు విషయాల్లో ఇంతకంటే మనం చేయగలిగేదేమీ లేదని కూడా నాకు తెలుసు. అయినప్పటికీ అన్యాయానికి గురైన వారికి సాధ్యమైనంతవరకు మంచి చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. అందుకే వాల్మీకి, బోయ కులాలు, దళిత క్రైస్తవులకు న్యాయం చేసేందుకు ఈ చట్ట సభ ద్వారా తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్నాం.

డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యం

- దక్షిణాది రాష్ట్రాల సదస్సులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా





సదస్సులో పాల్గొన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, వెలగపూడిలోని సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్న సీఎం జగన్

సాక్షి బెంగళూరు/అమరావతి: డ్రగ్స్ రహిత దేశమే లక్ష్యమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. జాతీయ భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రాంతీయ సదస్సు శుక్రవారం బెంగళూరులోని ఒక ప్రైవేటు హోటల్‌లో జరిగింది. అమిత్ షా నేతృత్వంలో జరిగిన ఈ సదస్సుకు ఐదు దక్షిణాది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణ ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారిందన్నారు. సమాజానికి ప్రమాదకరంగా మారిన ఈ డ్రగ్స్ మాఫియాకు అడ్డుకట్టవేయాలని.. ఇందుకు అన్ని రాష్ట్రాలు, ప్రజలు సహకరించాలని కోరారు. కేంద్రం డ్రగ్స్ నియంత్రణకు కదం తొక్కుతోందన్నారు. గత ప్రభుత్వాలు డ్రగ్స్ నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాయని.. అందువల్లే ప్రస్తుతం అవి విస్తరించాయని ఆరోపించారు. మన పిల్లలను డ్రగ్స్ మహమ్మారి నుంచి రక్షించుకోవాల్సి ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు కఠిన చట్టాలు, శిక్షలు ఉండాలని చెప్పారు. అలాగే ఎన్‌డీపీఎస్ చట్టాన్ని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం కేంద్రం గతేడాది జూన్ 1 నుంచి 75 రోజుల పాటు దేశవ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించిందని గుర్తు చేశారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయనే విషయంపై దర్యాప్తు జరగాలన్నారు. ఇప్పటివరకు రూ.22 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చాలావరకు ఇవి పాకిస్తాన్ నుంచి సరఫరా అవుతున్నాయన్నారు. సుమారు 60–70 శాతం మాదకద్రవ్యాలు సముద్ర మార్గాల ద్వారా తరలి వెళుతున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో దేశ సముద్ర తీరాలను పటిష్టం చేయాలన్నారు. 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారడంతో పాటు 2025 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ మారే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాలను చేరుకోవాలంటే డ్రగ్స్ రహిత సమాజం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, హోం మంత్రి అరగ జ్ఞానేంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందితా శర్మ, డీజీపీ ప్రవీణ్ సూద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటాం: సీఎం వైఎస్ జగన్

జాతీయ భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై బెంగళూరులో జరుగుతున్న ప్రాంతీయ సదస్సులో తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం వైఎస్ జగన్ ఈ సదస్సులో పాల్గొన్నారు. శాసనసభలో ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించాల్సి ఉండటంతో సదస్సుకు హాజరుకాలేకపోయానని సీఎం చెప్పారు. అందుకే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్నానన్నారు. తమ ప్రభుత్వం తరపున డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ సమావేశానికి హాజరయ్యారని తెలిపారు. కాగా, ఈ సదస్సుకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యారు.

స్పెషల్ సీఎస్ పూనంపై హైకోర్టు ఆగ్రహం

- వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంపై మండిపాటు
- తదుపరి విచారణ 31కి వాయిదా

సాక్షి, అమరావతి: సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కార కేసులో తమ ముందు హాజరు కావాలన్న ఆదేశాలను బేఖాతరు చేయడంపై మండిపడింది. ఓ దశలో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసేందుకు సైతం హైకోర్టు సిద్ధమైంది. శాసనసభ సమావేశాల వల్ల అత్యవసర పని ఉండటంతో కోర్టు ముందు పూనం మాలకొండయ్య హాజరుకాలేకపోయారని, తదుపరి విచారణకు తప్పక హాజరవుతారని ప్రభుత్వ న్యాయవాది నివేదించడంతో హైకోర్టు మెత్తబడింది. తదుపరి విచారణను ఈ నెల 31కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ మంతోజు గంగారావు, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనకు కొన్నేళ్లుగా జీతం చెల్లించకపోవడంపై విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.సుజాత 2018లో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం అప్పటి వైద్య విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య విద్య అప్పటి డైరెక్టర్ బాబ్జీ, ప్రభుత్వ దంత వైద్య కళాశాల అప్పటి ప్రిన్సిపల్ మురళీమోహన్‌లను స్వయంగా తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు మురళీమోహన్ ఒక్కరే శుక్రవారం కోర్టు ముందు హాజరయ్యారు. పూనం మాలకొండయ్య, బాబ్జీ హాజరు కాలేదు. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ బాబ్జీ పదవీ విరమణ చేసి ప్రస్తుతం ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీగా వ్యవహరిస్తున్నారని, ఆయనకు హైకోర్టు జారీ చేసిన నోటీసే అందలేదన్నారు. తదుపరి విచారణకు ఆయన కూడా హాజరవుతారని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ పిటిషనర్‌కు జీతం చెల్లించాలన్న తమ ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని అధికారులను ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలంటే లెక్క లేదా? అంటూ నిలదీసింది. జీతం చెల్లించండి.. అంటూ మిమ్మల్ని యాచించాలా? 2018 నుంచి పిటిషనర్‌కు జీతం చెల్లించకుంటే బతికేది ఎలా? అంటూ ప్రశ్నలు సంధించింది. ఈ వ్యవహారంలో అవసరమైతే ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు అకౌంటెంట్ జనరల్ హాజరుకు ఆదేశాలిస్తామంది.

అది దొంగల రాజ్యం

చంద్రబాబు మరో భారీ దోపిడీ ఆధారాలతో సహా బట్టబయలు

శాసనసభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: 'అమరావతిలో సచివాలయం, శాసనసభ, న్యాయస్థానం భవన నిర్మాణాల్లో చంద్రబాబు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారు. కాంట్రాక్టు సంస్థలను బెదిరించి మరీ భారీ వసూళ్లు చేశారు. తన మనుషుల ద్వారా బోగస్ కంపెనీలు సృష్టించి సబ్ కాంట్రాక్టుల రూపంలో నిధులు కొల్లగొట్టారు' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'ఇది మనం చెబుతోంది కాదు. ఆదాయ పన్ను శాఖ అధికారుల సోదాల్లో బట్టబయలైన అవినీతి బాగోతం. ఐటీ శాఖ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడించిన వాస్తవం' అని వెల్లడించారు. 'అమరావతిలో భవన నిర్మాణ కాంట్రాక్టు కంపెనీలపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తే ఈ అవినీతి బండారం బయట పడింది. అందుకే చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసులు ఇచ్చింది' అని తెలిపారు. అమరావతి నిర్మాణాల విషయంలో చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన అంశంపై శాసనసభలో శుక్రవారం నిర్వహించిన చర్చలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. 'చంద్రబాబు తమను బెదిరించడంతోనే ఆయన చెప్పిన బోగస్ కంపెనీలకు నిధులు మళ్లించామని షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధులు ఐటీ శాఖకు ఇచ్చిన వాంగ్మూలంలో అంగీకరించారు. మరో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి తామే నిధులు వసూలు చేసి, చంద్రబాబుకు అందించామని వెల్లడించార'ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో చంద్రబాబు నిధులను కొల్లగొట్టిన తీరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇలా వివరించారు.



చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులు

ఐటీ దాడులతో వెలుగులోకి..

- మొట్టమొదటగా ఆదాయ పన్ను శాఖ (ఐటీ శాఖ) అధికారులు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ నివాసంలో 2019 నవంబర్‌లో సోదాలు నిర్వహించారు. అక్కడ మొత్తం సమాచారం లభించింది. ఆ తర్వాత 2020 ఫిబ్రవరిలో చంద్రబాబు పీఏ శ్రీనివాస్ నివాసంలో సోదాలు చేశారు. దాంతో మరింత సమాచారం లభించింది.
- ఆదాయ పన్ను శాఖ పరిశోధన విభాగం ఆ మొత్తం సమాచారాన్ని క్రోడీకరించి ఆదాయ పన్ను అప్రైజల్ రిపోర్ట్‌ను తయారు చేసింది. తాము నిర్వహించిన దాడుల్లో లభించిన ఆధారాల ప్రకారం సంబంధిత వ్యక్తులను పిలిపించారు. తాము సేకరించిన ఆధారాలను ఆ వ్యక్తులకు చూపించి వారి వాంగ్మూలాలు నమోదు చేశారు. ఆ వాంగ్మూలాలపై వారు సంతకాలు కూడా పెట్టారు. వాటన్నింటి ఆధారంగా ఐటీ అధికారులు చంద్రబాబుకు ఇప్పుడు నోటీసులు పంపారు.

చంద్రబాబు అవినీతి బాగోతం ఇలా..

- అమరావతిలో నిర్మాణాల కాంట్రాక్టుల్లో చంద్రబాబు భారీగా అవినీతికి పాల్పడ్డారు. అందుకోసం పక్కాగా స్కెచ్ వేశారు. 2019 జనవరి, ఫిబ్రవరిలో చంద్రబాబు షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్‌ను పిలిపించుకుని తన పీఏ శ్రీనివాస్‌ను కలవమని చెప్పారు. దాంతో మనోజ్.. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌ను కలిశారు.
- షాపూర్జీ పల్లోంజీ కంపెనీ కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమగోదావరిల్లో టిడ్కో ఇళ్లు, అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణంతో పాటు రాజధానిలో ఇతర నిర్మాణ పనులను కలిపి 2018 నాటికి రూ.8 వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్ట్ పనులు చేసింది. అందులో తన కమీషన్లు వసూలు చేసేందుకు బాబు.. శ్రీనివాస్‌ను రంగంలోకి దింపారు. వినయ్ నంగల్లా, విక్కీ జైన్ అనే ఇద్దరిని మనోజ్‌కు శ్రీనివాస్ అటాచ్ చేశారు. వీరిలో వినయ్ నంగల్లా మూడు కంపెనీలు, విక్కీ జైన్ రెండు కంపెనీలు సృష్టించారు. ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇవ్వమన్నారు. వాళ్ల నుంచి తాము డబ్బులు తీసుకుంటామని చంద్రబాబు పీఏ శ్రీనివాస్ మనోజ్‌తో చెప్పారు.
- దాంతో వినయ్ నంగల్లా హయగ్రీవమ్, అన్నై షలాఖా అనే కంపెనీలను మనోజ్‌కు అటాచ్ చేశారు. విక్కీ జైన్.. నయోలిన్, ఎవరెట్ అనే రెండు కంపెనీలను అటాచ్ చేశారు. మనోజ్‌కు వాళ్లెవరో కూడా తెలియదు. తాము ఇలా డబ్బులు ఇవ్వలేమని, కావాలంటే పార్టీకి ఫండ్ ఇస్తామని షాపూర్జీ పల్లోంజీ కంపెనీ చెప్పింది. తాము చెప్పినట్లు ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని మనోజ్‌ను శ్రీనివాస్ బెదిరించారు. ఆ విషయాన్ని మనోజ్ ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో కూడా వెల్లడించారు. ఆ వాంగ్మూలం కాపీలు కూడా ఉన్నాయి.
- ఆ కంపెనీలకు బోగస్ సబ్ కాంట్రాక్టుల కింద డబ్బులు ఇచ్చిన తర్వాత వాటిని వసూలు చేసి చంద్రబాబుకు అప్పగించే బాధ్యతను ఆర్వీఆర్ రఘు, కృష్ణ, నారాయణ్, శ్రీకాంత్, అనికేత్ బలోటాలకు అప్పగించారు. ఇదీ ఈ మోడస్ ఆఫ్ ఆపరెండీ. ఐటీ అధికారులు ఈ సమాచారాన్ని అంతా ఆ కంపెనీల ప్రతినిధుల నుంచి వాంగ్మూలంగా తీసుకుని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ తయారు చేశారు. దాన్ని చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు చూపించారు. అదంతా వాస్తవమేనని శ్రీనివాస్ అంగీకరించి సంతకాలు కూడా చేశారు.
- శ్రీనివాస్‌తోపాటు రఘు, మిగిలిన వారిని కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. వాళ్లు కూడా అదంతా వాస్తవమేనని అంగీకరించి సంతకాలు కూడా చేశారని ఐటీ అప్రైజల్ రిపోర్ట్ వెల్లడిస్తోంది.
- చంద్రబాబుకు దుబాయిలో కూడా రూ.15.14 కోట్లను దినార్ల రూపంలో క్యాష్‌గా ఇచ్చినట్టు ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో మనోజ్ అంగీకరించారు. దాంతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో కూడా చంద్రబాబుకు ఇలానే మూడు నెలల్లో రూ.371 కోట్లు అందాయి. ఆ కుంభకోణంలో చంద్రబాబుకు డబ్బులు చేర్చిన యోగేశ్ గుప్తానే ఈ వ్యవహారంలో కూడా ఉన్నారు.

కోట్ల మళ్లింపునకు కోడ్ భాష

- ఆర్వీఆర్ రఘు వాట్సాప్ చాట్‌లను ఐటీ అధికారులు పరిశీలించగా.. ఈ అక్రమ ఆర్థిక లావాదేవీలు వెలుగులోకి వచ్చాయి. మనోజ్ వాసుదేవ్ సన్నిహితుడు యోగేశ్ గుప్తా నివాసంపై కూడా ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. చంద్రబాబు ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో నిధుల మళ్లింపులో కూడా యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. బోగస్ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో ఆయనదే ప్రధాన భూమిక.
- ఈ అక్రమ లావాదేవీలను మనోజ్ కోడ్ భాషలో తన ఈ–మెయిల్ ఐడీకే మెయిల్ చేసుకుని భద్రపరిచినట్టుగా ఐటీ అధికారులు గుర్తించారు. ఎవరెవరికి ఎంతెంత మొత్తం చెల్లించింది కోడ్ భాష 'టన్నుల' రూపంలో పేర్కొన్నట్టుగా పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. హైదరాబాద్‌కు 3 టన్నులు, ఢిల్లీకి 3 టన్నులు, ముంబాయికి 3.5 టన్నులు.. ఇలా భారీగా నిధులను మళ్లించిన గుట్టును ఐటీ అధికారులు ఛేదించారు.

ఈడీ పట్టుకోదనే కేడీ చంద్రబాబు ధీమా



ఇంతగా ప్రజాధనాన్ని కొల్లగొట్టినా, తనను ఏ ఈడీ కూడా పట్టుకోదనే ఈ కేడీ చంద్రబాబు ధీమా. సీమెన్స్ కేసులో రూ.371 కోట్లు దోచేసిన చంద్రబాబు ఈ కేసులో రూ.172.44 కోట్లు దోపిడీ చేసినట్లు ఇప్పటిదాకా తేలింది. అమరావతి పేరిట ఏదో చేస్తున్నానని ప్రజలను మభ్యపెడుతూ ఇక్కడ చేసింది గోరంత.. కొట్టేసింది కొండంత. దోపిడీ ఆధారాలతో బయటకు వచ్చింది. ఇప్పుడు ప్రజలకు ముఖం ఎలా చూపిస్తావ్ చంద్రబాబూ.. అసెంబ్లీ, సచివాలయం తాత్కాలిక భవనాల నిర్మాణానికి చ.అడుగుకు రూ.12 వేలు చొప్పున దోచి పెట్టారు. ఇలా దోచేసిన డబ్బును ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పనులను చంద్రబాబు ఖర్చు చేస్తున్నారు. ఆ రోజు అధికారాన్ని అడ్డుపెట్టుకుని మా ఎమ్మెల్యేలు 23 మందిని కొన్నారు. నేడు మరో నలుగురిని ప్రలోభాల ద్వారా లాక్కున్నారు. బాబు దోపిడీలో దోచుకో పంచుకో తినుకో(డీపీటీ) బ్యాచ్‌లోని రామోజీరావుకూ వాటాలు అందాయి. అందుకే చంద్రబాబు ఎంత అవినీతికి పాల్పడినా ఈనాడు పత్రికలో రామోజీ రాయరు. ఈటీవీలో చూపరు. చంద్రబాబు, రామోజీరావు తోడు దొంగలు.

– గుడివాడ అమర్‌నాథ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి


ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్

- ఇంతకు ముందు కూడా ఇదే రాష్ట్రం.. ఇదే బడ్జెట్. అప్పటి ప్రభుత్వం కన్నా అప్పుల గ్రోత్ రేటు ఇప్పుడు తక్కువ. ఇదే బడ్జెట్‌తో మన ప్రభుత్వం నేరుగా బటన్ నొక్కి డీబీటీ ద్వారా ప్రతి అక్క, చెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు జమ చేసి ప్రయోజనం కలిగిస్తోంది. నాలుగేళ్లు పూర్తికాక ముందే మన ప్రభుత్వం ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేసింది. ఎక్కడా లంచాలు, వివక్షకు తావు లేకుండా బటన్ నొక్కిన వెంటనే అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి డబ్బులు వెళ్తున్నాయి.
- ఇంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వంలో కూడా ఇదే బడ్జెట్. అయినప్పటికీ ఎందుకు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి, వారి కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు వెళ్లలేదు? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ స్కీం ఎలా చేశారో మొన్న కూడా చెప్పాం. ఈ రోజు మళ్లీ చెబుతున్నాం. గత ప్రభుత్వం ఎలా ఉండేది.. మనందరి ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఎంత మంచి జరుగుతోందో రాష్ట్ర ప్రజలందరూ ఆలోచించాలి.

ఇది రూ.2 వేల కోట్ల దోపిడీ

- ఐటీ అధికారులు విశాఖపట్నం, విజయవాడ, కడప, ఢిల్లీ, పూణేల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై జరిపిన దాడుల్లో లెక్కల్లో చూపని రూ.రెండు వేల కోట్లు దొరికినట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ 2020 ఫిబ్రవరి 13న ఒక ప్రకటనలో వెల్లడించింది. 40 చోట్ల జరిపిన తనిఖీల్లో బోగస్ సబ్ కాంట్రాక్ట్ కంపెనీలు, ఇన్వాయిసులు, బిల్లులు ఇతర ఆధారాలు లభించాయని చెప్పింది.
- రెండో దశ దర్యాప్తులో భాగంగా ఐటీ అధికారులు 2022 సెప్టెంబర్ 28న చంద్రబాబుకు నోటీస్ ఇచ్చారు. ఈ కేసును డీసీఏసీ–సెంట్రల్ సర్కిల్‌కు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసులో త్వరలో చంద్రబాబును కూడా విచారణకు పిలవనున్నారు.
- 2019లో అర్జంటుగా డబ్బులు ఇవ్వాలని మనోజ్ వాసుదేవ్‌కు చంద్రబాబు చెప్పారు. హయగ్రీవా, అన్నై షలాఖా అనే సంస్థలకు రూ.52.50 కోట్లు.. నవోలిన్, ఎవరెట్ కంపెనీలకు రూ.62.90 కోట్లు చొప్పున మనోజ్ చెల్లించారు. చంద్రబాబు ఆదేశాలతో మనోజ్.. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి కూడా డబ్బులు వసూలు చేసి ఇప్పించారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులు అతుల్ సోని, బాల వెంకటేశ్ ఫినిక్స్ ఇన్‌ఫ్రా, ఫోర్ ట్రేడింగ్, లక్ స్టోన్ అండ్ కో బోగస్ కంపెనీల ఖాతాల్లో రూ.41.90 కోట్లు జమ చేశారు. మొత్తం రూ.157.3 కోట్లు మళ్లించారు.
- ఈనాడు రామోజీరావు కుమారుడు కిరణ్ వియ్యంకుడు ఆర్వీఆర్ రఘుతోపాటు కృష్ణ, నారాయణ, శ్రీకాంత్, అనికెత్ బల్దోటాలకు ఈ రూ.157.3 కోట్లు చేరాయి. వారు ఆ నిధులను నేరుగా చంద్రబాబుకు చేర్చారు. ఈ వ్యవహారంలో నారా లోకేశ్ పీఏ రాజేశ్ కిలారి కీలక పాత్ర పోషించారు.

చంద్రబాబుకు ముడుపులు ఎవరెవరి ద్వారా ఎలా అందాయంటే...



సాగునీటి ప్రాజెక్టు పనులు ఆపండి

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ఫిబ్రవరి 17న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వుల ప్రకారం.. పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల్లో సాగునీటి విభాగం పనులు తక్షణమే ఆపేయాలని తెలంగాణ సర్కార్‌ను కృష్ణా బోర్డు ఆదేశించింది. తాగునీటి కోసం 7.15 టీఎంసీలను వాడుకోవడానికి.. అవసరమైన పనులు చేపట్టడానికి సుప్రీంకోర్టు అనుమతిచ్చిన నేపథ్యంలో.. ఆ రెండు ప్రాజెక్టుల్లో తాగునీటి విభాగం పనులు ఎక్కడ చేపడతారో చెప్పాలని కోరింది. ఈనెల 29లోగా వివరాలతోపాటు డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను అందజేస్తే.. వాటిని పరిశీలించి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తామని స్పష్టంచేసింది. ఈ మేరకు తెలంగాణ ఈఎన్‌సీ మురళీధర్‌కు కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే శుక్రవారం లేఖ రాశారు.

ఆహారభద్రత కమిషనర్‌కు ఆ అధికారం లేదు

- పొగాకు, పొగాకు ఉత్పత్తులు ఆహార నిర్వచనం పరిధిలోకి రావు
- వాటిని నిషేధించే అధికారం, పరిధి ఆహారభద్రత కమిషనర్‌కు లేవు
- అందువల్ల కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొట్టేస్తున్నాం
- హైకోర్టు ధర్మాసనం తీర్పు

సాక్షి, అమరావతి: ఆహారభద్రత, ప్రమాణాల చట్టం (ఎఫ్ఎస్ఎస్ఏ) కింద గుట్కా, పాన్‌మసాలా తదితర పొగాకు ఉత్పత్తుల తయారీ, నిల్వ, విక్రయం, సరఫరా, పంపిణీ తదితరాలను నిషేధించే అధికారం ఆహారభద్రత కమిషనర్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. పొగాకు, పొగాకు ఉత్పత్తులు 'ఆహారం' నిర్వచన పరిధిలోకి రావని చెప్పింది. అందువల్ల ఆహారభద్రత ప్రమాణాల చట్టం కింద పొగాకు ఉత్పతుల తయారీ, విక్రయం, సరఫరా తదితరాలను నిషేధించే పరిధి కమిషనర్‌కు లేదని తెలిపింది. కమిషనర్ ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొట్టేసింది. ఎఫ్ఎస్ఎస్ఏ కింద పొగాకు ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు తదితరాలను నియంత్రించే అధికారం మాత్రమే కమిషనర్‌కు ఉందని, నిషేధం విధించే అధికారం లేదని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం శుక్రవారం తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పొగాకు ఉత్పత్తులు కేంద్రప్రభుత్వ చట్టపరిధిలోకి వస్తాయని, అందువల్ల ఆహారభద్రత కమిషనర్ జారీచేసిన నోటిఫికేషన్ చట్టవిరుద్ధమంటూ పలువురు వ్యాపారులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పొగాకు, పాన్‌మసాలా, గుట్కా తదితర పొగాకు ఆధార ఉత్పత్తుల సేవనం ఆహార నిర్వచన పరిధిలోకి వస్తుందా? రాదా? అన్న అంశాన్ని సింగిల్ జడ్జి ధర్మాసనానికి నివేదించారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై సీజే ధర్మాసనం విచారించి తీర్పు చెప్పింది. పొగాకు లేదా నికోటిన్ ఉంటే పొగాకు ఉత్పత్తులు స్వతఃసిద్ధంగా మానవ వినియోగానికి హానికరమని పార్లమెంట్ భావించి ఉంటే, వాటి నియంత్రణకు బదులు నిషేధానికి చట్టం తెచ్చి ఉండేదని పేర్కొంది. పొగాకు, పొగాకు ఉత్పత్తులను నిషేధించేందుకు పార్లమెంట్ ప్రత్యక్ష చట్టం ఏదీ తీసుకురాలేదని, అలాంటప్పుడు అదేపనిని ఎఫ్ఎస్ఎస్ఏ కింద పరోక్షంగా చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. పిటిషనర్ల రోజువారీ చట్టబద్ధ కార్యకలాపాల్లో ఏ రకంగానూ జోక్యం చేసుకోవద్దని, ఎఫ్ఎస్ఎస్ఏ కింద జప్తుచేసిన సరుకును తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. లైసెన్స్ తీసుకుని వ్యాపారం చేసేవారిపై ఎఫ్ఎస్ఎస్ఏ కింద ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దని పేర్కొంది.

విశ్వసనీయతే సాక్షి పునాది..

వై.ఎస్.భారతీరెడ్డి

- జనహితంగా కథనాలు ఉండాలి
- పాత్రికేయ ప్రమాణాలు పాటించాలి

ఘనంగా 'సాక్షి'15వ వార్షిక వేడుకలు

సాక్షి, హైదరాబాద్: నాణేనికి మరో కోణాన్ని చూపించి, 'సత్యమేవ జయతే' నానుడిని సాకారం చేయాలనే లక్ష్యంతో విశ్వసనీయత పునాదిగా పుట్టిన 'సాక్షి'.. అదే బాటలో తన ప్రస్థానం కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ సతీమణి వై.ఎస్. భారతీరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో సాక్షి దినపత్రిక 15వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా భారతీరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతాన్ని విశ్లేషించుకోవడానికి, భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి వార్షికోత్సవాలు వేదిక కావాలన్నారు. కచ్చితత్వంతో కూడిన సమాచారం ఆధారంగా కథనాలు అందించేటప్పుడు తప్పనిసరిగా అవతలి వ్యక్తుల వివరణ తీసుకోవడం వంటి స్వచ్ఛతతో కూడిన పాత్రికేయ ప్రమాణాలు పాటించాలని సూచించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో వెనుకంజ వేయనవసరం లేదన్నారు. పాఠకులకు సులభంగా చేరేలా, జనహితంగా కథనాలు సాగాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ వర్ధెల్లి మురళి, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీఈఓ అనురాగ్ అగర్వాల్, డైరెక్టర్లు రాణిరెడ్డి, వైఈపీ రెడ్డి, కేఆర్‌పీ రెడ్డి, ఏఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధిత చిన్నారులతో..

'సాక్షి' వార్షిక వేడుకల్లో భాగంగా వై.ఎస్.భారతీరెడ్డి కేన్సర్ బాధిత చిన్నారులను కలసి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా తమ బాధలను మరచిపోయిన చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. బంజారాహిల్స్‌లోని సెయింట్ జ్యూడ్ ఇండియా చైల్డ్‌కేర్ సెంటర్ ద్వారా కేన్సర్‌కు ఉచితంగా చికిత్స పొందుతున్న చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేన్సర్ బాధిత చిన్నారితో మాట్లాడుతున్న భారతీరెడ్డి



15వ వార్షికోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న వైఎస్ భారతీరెడ్డి. చిత్రంలో ఎడిటర్ వర్ధెల్లి మురళి, సీఈఓ అనురాగ్ అగర్వాల్, డైరెక్టర్లు కేఆర్‌పీ రెడ్డి, ఏఎల్ఎన్ రెడ్డి, రాణిరెడ్డి, వైఈపీ రెడ్డి



విజయవాడ సాక్షి కార్యాలయంలో సహోద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సాక్షి డైరెక్టర్ పి.వి.కె.ప్రసాద్, ఏపీ రెసిడెంట్ ఎడిటర్ రమణమూర్తి

రాష్ట్రంలో అత్యధిక వృద్ధి రేటు

2021-22లో 18.47 శాతం జీఎస్‌డీపీ నమోదు

- గత ఐదేళ్లలో ఇదే అత్యధికం
- వ్యవసాయంలో 14.50 శాతం.. సేవా రంగంలో 18.91 శాతం..
- పరిశ్రమల రంగంలో 25.58 % పెరుగుదల
- 2020–21లో తగ్గుదలకు కోవిడ్ మహమ్మారే కారణం
- 2021–22 ఆర్థిక ఏడాదికి సంబంధించి కాగ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి : గత ఆర్థిక సంవత్సరం (2021–22)లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యధిక వృద్ధి రేటు నమోదు చేసినట్లు భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. 2022 మార్చి 31 నాటికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదికను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం అసెంబ్లీకి సమర్పించారు. 2021–22లో ప్రస్తుత ధరల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 18.47 శాతం మేర వృద్ధి సాధించినట్లు కాగ్ వెల్లడించింది. గత ఐదేళ్లలో ఇదే అత్యధిక వృద్ధి రేటుగా తెలిపింది. 2020–21లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు తగ్గడానికి కోవిడ్ మహమ్మారివల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభమే ప్రధాన కారణమని పేర్కొంది. అయితే, దేశ జీడీపీతో పోలిస్తే ఆ ఏడాది రాష్ట్రంలో జీఎస్‌డీపీ 5 శాతం వృద్ధి నమోదైనట్లు వివరించింది. అలాగే, ఆ ఏడాది దేశ జీడీపీ వృద్ధి రేటు 1.36 శాతం క్షీణించిందని కాగ్ తెలిపింది.

ఈ రంగాల్లో అత్యధిక వృద్ధి..

ఇక 2021–22 విషయానికొస్తే.. రాష్ట్రంలో వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగంలో అత్యధిక వృద్ధి నమోదైనట్లు కాగ్ పేర్కొంది.

- ▲ అంతకుముందు ఏడాదితో పోలిస్తే అత్యధికంగా పారిశ్రామిక రంగంలో 25.58 శాతం వృద్ధిని సాధించినట్లు కాగ్ తెలిపింది. అలాగే..
- ▲ కోవిడ్ తర్వాత నిర్మాణ రంగం, తయారీ రంగం కోలుకున్నాయి. ఫలితంగా నిర్మాణ రంగం 27%, తయారీ రంగం 25 శాతం పెరిగింది.
- ▲ వ్యవసాయ రంగంలో ప్రధానంగా చేపలు, ఆక్వాకల్చర్, పంటలు, పశు సంపద కార్యకలాపాలు పెరగడంతో వ్యవసాయ రంగం వృద్ధి సాధించింది.
- ▲ చేపల పెంపకం, ఆక్వాకల్చర్ 26%, పంటలు, పశుసంపదలో 11 శాతం పెరుగుదల ఉంది.
- ▲ ప్రధానంగా వాణిజ్యం, మరమ్మతులు, హోటళ్లు, రెస్టారెంట్లు 23 శాతం, రవాణా, నిల్వల, ప్రసార, సమాచార సేవలు 21 శాతం, స్థిరాస్తి రంగం 15 శాతం పెరగడంతో సేవలం రంగంలో భారీ వృద్ధి నమోదైంది.

2019-20 నుంచి 2021-22 వరకు జీఎస్‌డీపీ పెరుగుదల రేటు ఇలా.. (రూ.కోట్లలో)

2019-20	శాతం	2020-21	శాతం	2021-22	శాతం
9,66,099	10.57	10,14,374	5.00	12,01,736	18.47

2019-20 నుంచి 2021-22 వరకు రంగాల వారీగా జీఎస్‌డీపీ పెరుగుదల.. (రూ.కోట్లలో)

రంగం	2019-20	2020-21	2021-22
వ్యవసాయం	3,10,946.98	3,43,243.35	3,93,014.11
పరిశ్రమలు	1,96,825.04	97,610,01	2,48,159.42
సేవలు	3,75,447.09	3,92,659.35	4,66,911.99



26న పనిచేయనున్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

51 ఎస్‌బీఐ బ్రాంచిల్లో చలానాలు కట్టే అవకాశం

సాక్షి, అమరావతి : ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఆదివారం కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తాయని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ రామకృష్ణ తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారి సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల ఛార్జీలు, ఇతర ఫీజులకు సంబంధించిన చలానాలను ఆ రోజు రాష్ట్రంలోని 51 ఎస్‌బీఐ బ్రాంచిల్లో కట్టవచ్చని తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ బ్రాంచిలు కేవలం రిజిస్ట్రేషన్ల చలానాలు స్వీకరించేందుకు మాత్రమే పనిచేస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈబ్రాంచిలవివరాలుంటాయని రామకృష్ణ తెలిపారు.

లైబ్రరీ సైన్స్‌లో సర్టిఫిట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: లైబ్రరీ సైన్స్‌లో 5 నెలల సర్టిఫికెట్ కోర్సు, శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ఎంఆర్.ప్రసన్న కుమార్ శుక్రవారం తెలిపారు. విజయవాడలోని పీఎస్ స్కూల్ ఆఫ్ సైన్స్, కడపలో రాయలసీమ ఇన్‌స్టిట్యూట్, గుంటూరు సంస్థల్లో ఈ కోర్సుల్లో ఇంగ్లిష్ మీడియంలో 120, తెలుగు మాధ్యమంలో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత ఉన్నవారు ఏప్రిల్ 1 నుండి 21 మధ్య సంబంధిత సంస్థ ప్రిన్సిపాల్స్ నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఇందులో ప్రవేశాలకు ఇంటర్ ఉత్తీర్ణుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కోర్సుల్లోకి ఒకేషనల్ ఇంటర్ విద్యార్థులకు ప్రవేశం లేదన్నారు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగిన వారికి 10 మార్కులు అదనంగా పరిగణిస్తామని, రిజర్వేషన్ వర్తింపు ఉంటుందని చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థల్లో విధులు నిర్వహించే వారికి 10% ప్రత్యేక కేటాయింపు ఉంటుందన్నారు. దరఖాస్తు కోసం సంబంధిత సంస్థ ప్రిన్సిపల్ పేరిట రూ.2 విలువగల పోస్టల్ ఆర్డర్, స్వీయ చిరునామా కలిగిన 10X24 సెం.మీ సైజు కవరును జత చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు పోస్టు ద్వారా కానీ, నేరుగా కానీ ఏప్రిల్ 29న సంబంధిత ప్రిన్సిపల్స్‌కు సాయంత్రం 5 గంటల్లోగా చేరేలా పంపాలని తెలిపారు.

ద్రవ్యలోటు తగ్గింది

2021–22లో 2.08 శాతమే..

- ఆ ఏడాది రాష్ట్ర మొత్తం రుణ బకాయిలు జీఎస్‌డీపీ లక్ష్యంలోపే ఉన్నాయి
- జీఎస్‌డీపీలో రుణాలు 31 శాతానికి పరిమితం
- 2021–22 నాటికి రాష్ట్ర అప్పులు రూ.3,72,503 కోట్లు
- బడ్జెటేతర అప్పులు రూ.1,18,393 కోట్లు
- 2020–21తో పోలిస్తే 2021–22లో తీసుకున్న రుణం 1.46 % తగ్గింది
- 2021–22 ఆర్థిక ఏడాదికి సంబంధించి కాగ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: గత ఆర్థికసంవత్సరం (2021–22)లో.. అంతకుముందు ఆర్థిక ఏడాదితో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రుణం 1.46 శాతం తగ్గిందని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక వెల్లడించింది. 2022 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ ఇచ్చిన నివేదికను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం అసెంబ్లీకి సమర్పించారు. రాష్ట్ర బడ్జెట్ లోపల అప్పులు, బడ్జెట్ బయట అప్పుల వివరాలను కాగ్ నివేదికలో విశ్లేషించింది. 2021–22 బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్న దానికన్నా ద్రవ్యలోటు గణనీయంగా తగ్గిందని, దీంతో తీసుకున్న రుణాలు కూడా తగ్గినట్లు పేర్కొంది. 2021–22 నాటికి రాష్ట్ర మొత్తం రుణబకాయిలు జీఎస్‌డీపీ లక్ష్యంలోపలే ఉన్నాయని తెలిపింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల మేరకు 2021–22 నాటికి రాష్ట్ర రుణబకాయిలు జీఎస్‌డీపీలో 35.60 శాతం ఉండాల్సి ఉండగా అంతకన్నా తక్కువగా 31 శాతమే ఉన్నాయని పేర్కొంది. అప్పటికి రాష్ట్ర రుణాలు రూ.3,72,503 కోట్లుగా ఉన్నాయి. ఇక 2020–21లో జీఎస్‌డీపీలో రుణాలు 34.35 శాతం ఉండగా 2021–22లో రుణాలు జీఎస్‌డీపీలో 31 శాతానికి తగ్గినట్లు కాగ్ తెలిపింది. 2021–22లో బడ్జెట్ ప్రతిపాదించిన అంచనాలకన్నా వాస్తవ పరిస్థితులు వచ్చేనాటికి ద్రవ్యలోటు, రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గినట్లు కాగ్ పేర్కొంది. ద్రవ్యలోటు రూ.38,224 కోట్లు ఉంటుందని అంచనా వేయగా దానిని రూ.25,013 కోట్లకే పరిమితం చేసినట్లు కాగ్ పేర్కొంది. ఇలా ద్రవ్యలోటు 2.08 శాతానికే పరిమితమైంది. బడ్జెట్‌లో రెవెన్యూ లోటు రూ.19,546 కోట్లు ఉంటుందని ప్రతిపాదించగా వాస్తవంగా రెవెన్యూ లోటు రూ 8,611 కోట్లకు పరిమితం చేశారు. ఇక 2021–22లో రెవెన్యూ రాబడులు 28.53 శాతం పెరిగాయని, దీని ఫలితంగా 2021–22లో రెవెన్యూ, ద్రవ్యలోటు గణనీయంగా మెరుగుపడినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని కాగ్ వివరించింది. మరోవైపు.. 2021–22 నాటికి బడ్జెటేతర రుణాలు రూ.1,18,393.81 కోట్లు ఉన్నాయి. ఈ రుణాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్ర మొత్తం రుణాలు జీఎస్‌డీపీలో 40.85 శాతంగా ఉంటుందని పేర్కొంది. అశాస్త్రీయ రాష్ట్ర విభజన కారణంగా ఆర్థికవ్యవస్థ నిర్మాణాత్మక లోటును ఎదుర్కొంటోందని రాష్ట్ర ప్రభుత్వం సమాధానమిచ్చినట్లు కాగ్ తెలిపింది. భౌగోళిక ప్రాతిపదికన ఏపీ తెలంగాణకు ఆస్తులను కోల్పోయిందని, కానీ.. జనాభా ప్రాతిపదికన చెల్లింపుల బాధ్యతను పొందిందని, బకాయిలు తీర్చడానికి ఏపీకి వనరులు కూడా లేవని ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కేటగిరి హోదా, 2014–15 రెవెన్యూ లోటుగ్రాంట్ వంటి విభజన హామీల అమలుకు కేంద్రంతో నిరంతరాయంగా ప్రయత్నిస్తోందని.. కోవిడ్ మహమ్మారి ఆర్థికపరమైన ఒత్తిడిని మరింత పెంచిందని తెలిపింది. ఈ కారణంగా రుణంగా తీసుకున్న నిధులలో కొంతభాగాన్ని లోటు ఫైనాన్సింగ్ కోసం, బాకీలను తీర్చేందుకు ఉపయోగించుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని కాగ్ వెల్లడించింది.

2019-20 నుంచి 2021-22 వరకు రుణ సామర్థ్యం ఇలా..

అప్పులను భరించే సామర్థ్య సూచికలు	2019-20	2020-21	2021-22
చెల్లించాల్సి ఉన్న బకాయిలు (రూ.కోట్లలో)	3,01,802	3,48,246	3,72,503
చెల్లించాల్సిన రుణంలో పెరుగుదల రేటు (శాతం)	17.20	15.39	6.97
జీఎస్‌డీపీ (కోట్లలో)	9,66,099	10,14,374	12,00,736
జీఎస్‌డీపీ పెరుగుదల రేటు (శాతం)	10.57	5.00	18.47
జీఎస్‌డీపీలో రుణం (శాతం)	31.24	34.33	31.00
చెల్లించాల్సిన రుణంపై వడ్డీ రేటు (శాతం)	6.31	6.16	6.15
రెవెన్యూ రాబడితో పోలిస్తే చెల్లింపుల శాతం	15.90	17.09	14.72
తీసుకున్న రుణంతో పోలిస్తే చెల్లించిన రుణాల శాతం	71.71	77.12	83.40
రాష్ట్రానికి నికరంగా అందుబాటులో ఉన్న రుణం (రూ.కోట్లలో)	27,009	28,736	5,364
తీసుకున్న రుణంతో పోల్చితే నికరంగా అందుబాటులో ఉన్న రుణ శాతం	17.11	13.49	1.97

రాష్ట్ర రుణాల చెల్లింపు సమయ సూచిక..

చెల్లింపుల సమయం (సంవత్సరాలు)	చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)	రుణం శాతం
0-1	14,500.54	4.77
2-3	39,825.03	13.10
4-5	42,493.39	13.97
5-7	32,998.04	10.80
8 సంవత్సరాలు ఆపైన	1,63,258.55	53.69
ఇతరులు	11,017.63	3.62
మొత్తం	3,04,093.18	------



2022 మార్చి 31 నాటికి వివిధ ప్రాజెక్టుల కింద చెల్లించాల్సిన బకాయిలు ఇలా..

వివరాలు	ప్రాజెక్టులు/పనుల సంఖ్య	బకాయిలు (రూ.కోట్లలో)
నీటి సరఫరా పథకాలు	37	136.35
విద్యుత్ రంగం	03	17,168.76
నీటిపారుదల	09	499.09
మొత్తం	49	17,804.20



వెదురు సోయగం

- జీ–20కి వెదురుతో ఆకృతులు
- మైదుకూరులో రూపుదిద్దుకున్న బాస్కెట్లు, పోల్స్, తబలాలు
- ఇప్పటికే నగరానికి చేరుకున్న బ్యాంబూ ఉత్పత్తులు
- వీటిపై పూణే, కడియంల నుంచి రప్పిస్తున్న పూలమొక్కలు
- విశాఖ రోడ్లకిరువైపులా విరబూయనున్న అందాలు
- ఈ తరహా రాష్ట్రంలో ఇదే తొలిసారి



వెదురు బాస్కెట్లపై అమర్చిన పూలమొక్కలు

సాక్షి, విశాఖపట్నం: అందాల విశాఖలో వెదురు సోయగాలు కనువిందు చేయనున్నాయి. జీ–20 దేశాల సదస్సుకు వచ్చే అతిథులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న ఈ సదస్సుకు విశాఖ నగరం ఆతిథ్యం ఇస్తోంది. ఇందుకోసం నగరం ముస్తాబవుతోంది. పర్యావరణహిత వెదురుతో మోడరన్ బాస్కెట్లు, బ్యాంబూ పోల్స్, బ్యాంబూ తబలాల ఆకృతితో వీటిని వైఎస్సార్ జిల్లా మైదుకూరులో తయారు చేయిస్తున్నారు. అక్కడ వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం ఉన్న వారితో వీటిని వినూత్నంగా రూపొందిస్తున్నారు. వీటిపై అందంగా పూసే పూల మొక్కలను అమర్చనున్నారు. వీటిని ఆర్కే బీచ్‌లోని నోవోటెల్ హోటల్ నుంచి రుషికొండ సమీపంలో ఉన్న జీ–20 సదస్సు జరిగే ర్యాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతం వరకు రోడ్డుకు ఇరువైపులా, రోడ్డు మధ్యలోని డివైడర్ల పైన, బీచ్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌ల పైన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 500 వరకు బ్యాంబూ బాస్కెట్లు, 50కి పైగా తబలాలు, 200 వరకు బ్యాంబూ పోల్స్ ఉండనున్నాయి. ఇవి కాకుండా మరో వెయ్యి వరకు వెదురు ఫ్లవర్ వాజ్‌లను కూడా సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర బ్యాంబూ మిషన్, మేదరి హ్యాండీ క్రాఫ్ట్స్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా వీటన్నిటినీ తయారు చేస్తున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో వీటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వెదురు ఉత్పత్తులను మైదుకూరు నుంచి సింహాచలం నర్సరీ వద్దకు తీసుకొచ్చారు. రవాణాలో కొన్నింటి వార్నిష్‌లు పాడయ్యాయి. అలాంటి వాటికి మళ్లీ వార్నిష్‌లు వేస్తున్నారు. నేడో, రేపో వీటిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

ఈ తరహా ఇదే తొలిసారి..

ఇప్పటివరకు దేశంలోని త్రిపుర, అస్సాం, మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాలల్లోనే ఈ తరహా వెదురు ఆకృతులు తయారవుతున్నాయి. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వీటిని ప్రవేశపెడుతున్నట్టు రాష్ట్ర మేదర కార్పొరేషన్ డైరెక్టర్ రాఘవేంద్ర 'సాక్షి'కి తెలిపారు. మైదుకూరులో మూడు వారాల నుంచి వీటి తయారీలో నైపుణ్యం ఉన్న మేదరులు రేయింబవళ్లు శ్రమించి వీటిని రూపొందిస్తున్నారని చెప్పారు. జీ–20 సదస్సు ముగిశాక మళ్లీ వీటిని భద్రపరచుకోవచ్చు. మూడు, నాలుగేళ్ల పాటు ఇవి చెక్కు చెదరవు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి ప్రతిష్టాత్మక సదస్సులు జరిగినప్పుడు మళ్లీ వీటిని బ్యూటిఫికేషన్ కోసం ఉపయోగించుకోవచ్చని గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి 'సాక్షి'కి చెప్పారు. వెదురు పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, దీంతో ముమ్ముందు వెదురుకు కొరత ఏర్పడదని, పర్యావరణహిత వెదురుతో అనేక రకాల ఆకృతులను విస్తృతం చేసేందుకు దోహదపడుతుందని తెలిపారు.

పూణే, కడియంల నుంచి పూలమొక్కలు

వెదురు ఆకృతులపై ఏర్పాటు చేసే ప్రత్యేక రకాల పూల మొక్కలను (ఫ్లవరింగ్ ప్లాంట్స్) పూణే, కడియం నర్సరీల నుంచి రప్పిస్తున్నారు. వీటిని అమర్చాక పూలు వికసిస్తాయి. అవి నాలుగైదు రోజుల పాటు వాడిపోకుండా ఉంటాయి. నోవోటెల్-రాడిసన్ బ్లూ హోటళ్ల మధ్య బీచ్ రోడ్డులో విదేశీ ప్రతినిధుల రాకపోకలుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వెదురు ఆకృతులపై అమర్చిన పూల మొక్కలు ఈ ప్రతినిధులను ఆకట్టుకోనున్నాయి. ఉగాది సందర్భంగా తాడేపల్లిలోని సీఎంఓ వద్ద ఇలాంటి వాటినే ఏర్పాటు చేశారు. అవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎందరినో అలరించాయి.

ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

ఏయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని చెప్పారు. 2023–24 విద్యా సంవత్సరానికి బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేవారు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, రూ.1000 అపరాధ రుసుముతో మే 2వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుముతో మే 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. మే 20వ తేదీన ఆన్‌లైన్ విధానంలో ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. దరఖాస్తు పూర్తి వివరాలకు www. cets. apsche. ap. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

తెలంగాణ

ఈపీఎఫ్ఓ వడ్డీ ఖరారుపై కసరత్తు!

- రెండ్రోజుల్లో భేటీ కానున్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్
- ప్రస్తుతం రూ.8.10 శాతం వడ్డీ ఇస్తున్న ఈపీఎఫ్ఓ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) చందాదారుల వార్షిక వడ్డీ చెల్లింపుపై కసరత్తు ముమ్మరం చేసింది. మరో వారంలో 2022–23 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ క్రమంలో 2022–23 సంవత్సరంలో చెల్లించాల్సిన వడ్డీని ఖరారు చేసేందుకు రెండ్రోజుల్లో ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డు సమావేశం కానుంది. బోర్డు సమావేశంలో ట్రస్టీలు చర్చించి వడ్డీ చెల్లింపుపై నిర్ణయం తీసుకున్న తర్వాత కేంద్ర కేబినెట్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గడువులోగానే నిర్ణయం తీసుకుని కేంద్రానికి ప్రతిపాదనలు పంపే దిశగా ఈపీఎఫ్ఓ బోర్డు చర్యలు తీసుకుంటోంది.

గతేడాది 8.1 శాతం వడ్డీ చెల్లింపు..

దేశవ్యాప్తంగా 7,42,331 సంస్థలు ఈపీఎఫ్ఓ పరిధిలో ఉన్నాయి. ఈ సంస్థల్లో 6,79,21,183 మంది ఈపీఎఫ్ చందాదారులు ఉన్నారు. కాగా, 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 4,08,79,787 క్లెయిమ్స్ సెటిల్ చేసినట్లు ఈపీఎఫ్ఓ గణాంకాలు చెబుతున్నాయి. సాధారణంగా ఈపీఎఫ్ఓ వడ్డీ చెల్లింపునకు సంబంధించి ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే నిర్ణయం తీసుకుంటుంది. గత కొన్నేళ్లుగా ఇదే సంప్రదాయాన్ని కొనసాగించిన ఈపీఎఫ్ఓ బోర్డు.. కోవిడ్–19 పరిస్థితుల అనంతరం తీవ్ర జాప్యం చేస్తూ వస్తోంది. 2021–22 వార్షిక వడ్డీ చెల్లింపు తీవ్ర జాప్యం కావడంతో చందాదారుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. పలు సామాజిక మాధ్యమాల్లో, ఈపీఎఫ్ఓకు కూడా ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఈసారి ముందస్తుగా నిర్ణయం తీసుకుని వడ్డీ చెల్లింపునకు కసరత్తు వేగవంతం చేసింది. 2021–22కి సంబంధించి ఈపీఎఫ్ఓ వడ్డీ 8.10 శాతంగా ఉంది.

> ఏ ప్రాణినీ ద్వేషించనివాడు, అహంకార మమకారాలు లేనివాడు, సుఖదుఃఖాలలో సమంగా వ్యవహరించేవాడు, క్షమాగుణం కలవాడు, నాకు ప్రియుడు.
> – భగవద్గీత

సాక్షి
శనివారం, మార్చి, 25

అనర్హత వేటు లేవనెత్తిన ప్రశ్నలు

చట్టం వేరు...ధర్మం వేరు. చట్టబద్ధమైన చర్యలన్నీ ధర్మబద్ధం కాకపోవచ్చు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడటానికి దారితీసిన సూరత్ కోర్టు తీర్పు, అంతక్రితం రెండు వారాలుగా అధికార, విపక్షాలు సాగిస్తున్న ఆందోళనల పర్యవసానంగా పార్లమెంటు స్తంభించి పోవటం వంటి పరిణామాలు ప్రజాస్వామ్య ప్రియులను కలవరపరుస్తాయి. పౌరులు ఎలా మెలగాలో, పాటించాల్సిన స్వీయ నియంత్రణలేమిటో చట్టాలు చెబుతాయి. అధికారానికుండే పరిమితులేమిటో కూడా తేటతెల్లం చేస్తాయి. కానీ వాటి ఆచరణ సక్రమంగా లేని చోట ఆ చట్టాలు కొందరికి చుట్టాలవుతాయి. మరికొందరికి అవరోధాలవుతాయి. కర్ణాటకలోని కోలార్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాట్లాడిన రాహుల్ అవినీతికి, అక్రమాలకు పాల్పడి విదేశాలకు పరారైన నీరవ్ మోదీ, లలిత్ మోదీల పేర్లకు ప్రధాని నరేంద్ర మోదీ పేరు జత చేసి 'దొంగలందరి ఇంటిపేరు మోదీ అని ఎందుకుంటుంది?' అంటూ వ్యంగ్య వ్యాఖ్య చేశారు. రాహుల్ వ్యాఖ్య ఆ ఇంటి పేరుగల సామాజిక వర్గానికి ఇబ్బందికరంగా మారిందంటూ గుజరాత్ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్‌పై కోర్టు తీర్పునిచ్చింది. రాహుల్ వ్యాఖ్యతో చాలామందికి ఏకీభావం లేకపోవచ్చు. ప్రత్యర్థులనుసరించే విధానాలను విమర్శించటంకాక వారిపై దూషణలకు దిగటం చాన్నాళ్లుగా రివాజుగా మారింది. ఇక భౌతికంగా నిర్మూలిస్తామని బెదిరింపులకు దిగటం, దౌర్జన్యాలకు పూనుకోవటం వంటివి చెప్పనవసరమే లేదు. అయితే ఈ ధోరణులను వ్యతిరేకించేవారు సైతం రాహుల్‌కు విధించిన రెండేళ్ల జైలు శిక్షను, దాని ఆధారంగా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయటం సమర్థించలేకపోతున్నారు. గతంలో రాఫెల్ ఒప్పందంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించినప్పుడు రాహుల్ 'చౌకీదార్ చోర్ హై' అని వ్యాఖ్యానించి వివాదంలో చిక్కుకున్నారు. ప్రధానినుద్దేశించి వ్యాఖ్య చేయబోయి సుప్రీంకోర్టును తప్పుబట్టేలా మాట్లాడటంతో సమస్య ఏర్పడింది. ఆ కేసులో రాహుల్ బేషరతు క్షమాపణ చెప్పడాన్ని అంగీకరించి సర్వోన్నత న్యాయస్థానం 2019లో కేసు మూసివేసింది. అయితే రాహుల్ వంటి నేతలు జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికింది. సూరత్ కోర్టు దాన్నే గుర్తుచేసింది.

ఈ తీర్పుపైనా, అనర్హత వేటుపైనా ఎటూ కాంగ్రెస్ అప్పీల్‌కి వెళ్తుంది. అక్కడ ఏమవుతుందన్న సంగతి అటుంచి, సూరత్ కోర్టు తీర్పు లేవనెత్తిన అంశాలు ప్రధానమైనవి. పరువు నష్టం కలిగించటాన్ని నేరపూరిత చర్యగా పరిగణించి గరిష్టంగా రెండేళ్ల జైలు, జరిమానాకు వీలుకల్పించే భారత శిక్షాస్మృతి(ఐపీసీ)లోని 499, 500 సెక్షన్ల సహేతుకతపై ఎప్పటినుంచో అభ్యంతరాలున్నాయి. ఒకపక్క పరువునష్టంలో సివిల్ దావాకు వీలున్నప్పుడు జైలుశిక్ష, జరిమానాలెందుకని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. బ్రిటిష్ వలస పాలన కాలంలో చేసిన ఈ చట్టం ఇప్పుడు బ్రిటన్‌లోనూ, ఇతర పాశ్చాత్య దేశాల్లోనూ ఉనికిలో లేదు. ఇది దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉన్నది గనుక, భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగిస్తుంది గనుక రద్దు చేయాలని గతంలో సుప్రీంకోర్టుకెక్కిన వారున్నారు. అయితే పేరుప్రతిష్టలు కలిగివుండే హక్కు జీవించే హక్కులో భాగమని, దానికి భంగం కలిగించినవారు తగిన శిక్ష అనుభవించక తప్పదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అదే సందర్భంలో ఈ అంశంలో తీర్పులు వెలువరించేటపుడు జాగురూకత వహించాలని కింది కోర్టులకు సలహా ఇచ్చింది. అయితే ఈ సలహాను కింది కోర్టులు పాటిస్తున్నాయా అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఒక రచనపై వచ్చిన విమర్శను తట్టుకోలేకనో, ఒక నాటకాన్నీ లేదా సినిమాను అడ్డుకోవటానికో ఈ సెక్షన్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. తమిళనాడులో జయలలిత పాలనాకాలంలో ఆమె పార్టీకి చెందిన కార్యకర్తలు వందల సంఖ్యలో పరువునష్టం దావాలు వేసిన సంగతి ఎవరూ మరువలేరు. కోర్టులు సైతం యాంత్రికంగా వ్యవహరిస్తున్నాయి. అందుకే సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు కింది కోర్టులను తప్పుబట్టవలసి వచ్చింది.

నీరవ్ మోదీ, లలిత్ మోదీ తదితరులకు ప్రభుత్వ ప్రాపకం లభించిందని ఆరోపిస్తే రాహుల్‌కు బహుశా ఈ కేసు బెడద ఉండేదికాదు. తగిన ఆధారాలతో అటువంటి విమర్శలు చేస్తే దానివల్ల ప్రజలకు ఏదో మేరకు ప్రయోజనం కూడా కలుగుతుంది. రాహుల్ తన వ్యాఖ్యలద్వారా ఒక వెనుకబడిన వర్గాన్ని కించపరిచారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇలా రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగా ఎదుర్కొనటం తప్పేమీ కాదు. అందుకు భిన్నంగా న్యాయస్థానాలను ఆశ్రయించటం ఎంత వరకూ సబబో, చట్టానికి అనుగుణంగానే అయినా ఆదరాబాదరాగా అనర్హత వేటువంటి నిర్ణయాలు తీసుకోవటం ఏమేరకు ధర్మమో ఆలోచించుకోవాలి. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్, జయలలిత, అజంఖాన్ తదితరుల కేసుల్లో వెనువెంటనే చర్యలు తీసుకున్న సందర్భాలు లేకపోలేదు. అయితే ఈ ప్రక్రియ సందేహాస్పదం కారాదు. మెజారిటీ ఉంది కదా అని కక్షపూరితంగా చేశారన్న అపఖ్యాతి తెచ్చుకోకూడదు. దేశద్రోహులను కాల్చిపారేయాలని పిలుపునిచ్చిన వారు నిక్షేపంలా కేంద్రమంత్రులుగా కొనసాగుతుంటే విపక్ష నేత నోరుజారటం మాత్రం మహాపరాధం కావటం సాధారణ పౌరులకు కొరుకుడుపడని అంశం. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రధాన లక్ష్యం రాహులేనని పార్లమెంటులోని పరిణామాలైనా, తాజా చర్య అయినా తేటతెల్లం చేస్తున్నాయి. రాజకీయ పక్షాలూ, వాటి వ్యూహాల మాటెలా వున్నా దేశంలో చట్టబద్ధ పాలనకూ, సమన్యాయానికీ విఘాతం కలగనీయకుండా చూడాలని సాధారణ పౌరులు కోరుకోవటం అత్యాశేమీ కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చవితి రా.7.07 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** భరణి ప.3.56 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** తె.4.14 నుండి 5.54 వరకు (తెల్లవారితే ఆదివారం), **దుర్ముహూర్తం:** ఉ.6.04 నుండి 7.41 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.05 నుండి 12.42 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బ్యాంకింగ్ సంక్షోభం నేర్పే పాఠాలు

విశ్లేషణ



మదన్ సబ్నవీస్

ప్రధానంగా అమెరికా కేంద్రంగా పనిచేసే కొన్ని బ్యాంకుల సంక్షోభం పత్రికల పతాక శీర్షికలకు ఎక్కింది. దీంతో జరగాల్సిన నష్టమంతా జరిగిపోయిందా? ఇలా కుప్పకూలిపోయే బ్యాంకులు మరిన్ని ఉన్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తాయి. ఆ బ్యాంకుల సంక్షోభానికి దారితీసిన పరిస్థితులు దేనికవే వేర్వేరు కావడం గమనార్హం. ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొనేందుకు భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో తగినన్ని ఏర్పాట్లు ఉన్నా రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ ప్రాక్టీసుల విషయంలో సమీక్ష జరగాల్సిన అవసరం ఉంది. కేవలం పెట్టుబడులపై మాత్రమే కాకుండా, అప్పులపై కూడా దృష్టి పెట్టాలన్నది ఈ సంక్షోభం చెబుతున్న ఒక పాఠం. పెట్టుబడుల జాబితా మరీ కొండవీటి చాంతాడంత ఉండటమూ సరికాదన్నది మరో పాఠం.

సిల్వర్‌గేట్ బ్యాంక్, సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్, క్రెడిట్ స్విస్... ఇటీవలి కాలంలో పత్రికల పతాక శీర్షికలకు ఎక్కిన బ్యాంకుల పేర్లు. భారత్‌లో క్రెడిట్ స్విస్ గురించి చాలామందికి తెలుసు కానీ... మిగిలిన మూడింటితో పరిచయం అంతంత మాత్రమే. ఎందుకంటే ఇవి ప్రధానంగా అమెరికాలో పనిచేసే బ్యాంకులు. అయినాసరే, వీటి గురించి బోలెడన్ని కథనాలు వరుసగా వస్తూండటం కొంత అసౌకర్యంగా అనిపించే విషయమే.

ఇప్పుడు తలెత్తిన ప్రశ్న ఏమిటంటే, మన బ్యాంకింగ వ్యవస్థ ఎంత సురక్షితం? అన్నది. అమెరికాకు చెందిన లేహ్‌మన్ బ్రదర్స్ దివాళా సంక్షోభం తరువాత 'బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్' మూలధనానికి సంబంధించిన విధానాలను మరింత కఠినం చేసింది. బేసెల్ కమిటీ మార్గదర్శకాలు ఇందుకు కారణమయ్యాయి. అయినా ప్రస్తుత సంక్షోభాన్ని అది నివారించలేక పోయింది. ఇప్పుడు ఇంకో ప్రశ్న తలెత్తుతోంది. జరగాల్సిన నష్టమంతా జరిగిపోయిందా? లేక ఇలా కుప్పకూలిపోయే బ్యాంకులు మరిన్ని ఉన్నాయా? అయితే, ఈ బ్యాంకుల మూసివేతకు దారితీసిన పరిస్థితులు దేనికవే వేర్వేరు కావడం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

దేని కారణాలు దానివే!

ఈ మూడు బ్యాంకుల మూసివేతకూ, భారతీయ బ్యాంకులకూ నేరుగా సంబంధం లేకపోవచ్చు. సిల్వర్‌గేట్ బ్యాంకు క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌లో ఉంది. ఇప్పుడు క్రిప్టో కరెన్సీకి అంత ఆదరణ లేదు. ఇంకొన్నేళ్లు పోతే అసలు క్రిప్టో అన్న పదం కూడా వినిపించకపోవచ్చు. అదంత సుస్థిరమైంది కాదని ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది.

సిలికాన్ వ్యాలీ బ్యాంకు కేవలం స్టార్టప్‌లపైనే ఎక్కువగా కేంద్రీకరించింది. అందిన డిపాజిట్లు అత్యధికం స్టార్టప్‌ల నుంచి వచ్చినవే. కొంతమేరకు అప్పులూ ఇచ్చారు కానీ ఎక్కువ మొత్తం ప్రభుత్వాలకు అప్పు ఇచ్చింది. (మన బ్యాంకుల మాదిరిగానే ప్రభుత్వ బాండ్లు, ట్రెజరీ బిల్లుల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టారన్నమాట.)

ఇక సిగ్నేచర్ బ్యాంకు గురించి: ఇది అటు క్రిప్టో, ఇటు స్టార్టప్‌లు రెండు రంగాల్లోనూ పనిచేస్తోంది. ప్రస్తుతం దీన్ని ఆదుకునేందుకు న్యూయార్క్ కమ్యూనిటీ బ్యాన్‌కార్ప్ ఒక ప్రయత్నం చేస్తోంది.

చివరగా క్రెడిట్ స్విస్: ఇది స్విట్జర్లాండ్ బ్యాంక్. ఎవరికి రుణాలిచ్చారన్న విషయంలో ఈ బ్యాంకు కొన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే రకరకాల వ్యాపార వ్యవహారాల కారణంగా నష్టాలు ఎదుర్కొంది. ఆ దేశ కేంద్ర బ్యాంకు దీనికి బెయిల్ అవుట్ ఇస్తోంది. అలాగే యూబీఎస్ దీన్ని స్వాధీనం చేసుకుని కష్టాల నుంచి బయట పడేసే ప్రయత్నం చేస్తోంది. ఈ నాలుగు ఘటనలు వేటికవే ప్రత్యేకం కానీ చరిత్ర పుటల్లో నిలిచిపోయేవి.



లేహ్‌మన్ బ్రదర్స్ సంక్షోభం కంటే ప్రస్తుత సంక్షోభం భిన్నమైంది. ఎలాగంటే... ఇప్పుడు అన్ని నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగాయి. ఆర్‌బీఐ కూడా భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందన్న భరోసా ఇచ్చింది. యూరప్‌లోనూ కేంద్ర బ్యాంకులు క్రెడిట్ స్విస్ సంక్షోభం ప్రభావాన్ని మదిస్తున్నాయి. మరి ఈ సంక్షోభం ప్రభావం భారత్‌పై ఏమిటి? మనం నేర్చుకోవాల్సిన గుణపాఠాలేమిటి?

అప్పుల గురించి కూడా యోచించాలి...

సిలికాన్ వ్యాలీ బ్యాంక్ కుప్పకూలిపోవడం నేర్పించే **మొదటి పాఠం...** కేవలం పెట్టుబడులపై మాత్రమే కాకుండా, అప్పులపై కూడా దృష్టి పెట్టాలని! రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ముప్పు ఒక్క దగ్గర పోగుపడకుండా చూడటం వీటి ఉద్దేశం. అయితే డిపాజిట్లు పోగుపడటం వల్ల కూడా ముప్పు ఉంటుందన్నది వినూత్నమైన విషయం. డిపాజిట్లు ఎక్కువగా స్టార్టప్‌ల నుంచి రావడం వల్ల సంక్షోభం మరింత ముదిరింది. ఎందుకంటే డిపాజిట్లు చేసిన వారందరూ అకస్మాత్తుగా వాటిని ఉపసంహరించుకునే ప్రయత్నం చేశారు. భారతీయ బ్యాంకులు ఈ విషయమై ఆలోచన చేయాలి. చిన్న బ్యాంకులు మరీ ముఖ్యంగా.

ఇక రెండో గుణపాఠం: పెట్టుబడుల జాబితా మరీ కొండవీటి చాంతాడంత ఉండటమూ సరికాదని చెబుతోంది. యూఎస్ ట్రెజరీ బాండ్లు కలిగి ఉండటం వాస్తవానికి చాలా సురక్షితం. కానీ వడ్డీ రేట్లు పెరిగిపోవడం వల్ల ఈ పెట్టుబడుల విలువల్లో తేడాలొస్తాయి. ఈ విషయాన్ని బ్యాంకులు గుర్తించాలి. రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ ప్రాక్టీసెస్‌లను సమీక్షించుకోవాలి.

ముచ్చటగా మూడో పాఠం: వాణిజ్య బ్యాంకింగ్‌లో నైపుణ్యం సాధించాలని బ్యాంకులకు తరచూ చెబుతూంటారు. ఇతర కార్యకలాపాలను అనుబంధ కంపెనీల ద్వారా నడపాలనీ, వాటి మూలధన నిర్మాణం కూడా వేరుగా ఉండాలనీ అంటారు. క్రెడిట్ స్విస్ విషయంలో ఈ రెండు లోపాలు కొట్టొచ్చినట్లు కనిపించాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్‌లో వచ్చిన నష్టాలు, వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగపు నిధులను విత్‌డ్రా చేయడం కాస్తా వాణిజ్య బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్‌పై ప్రభావం చూపింది.

భారత్‌లో ఈ బలహీనతను చాలాకాలం కిందటే గుర్తించారు. అందుకే ఇన్వెస్ట్‌మెంట్, మర్చెంట్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితరాలను అనుబంధ సంస్థల ద్వారా నడుపుతున్నారు. దీనివల్ల ముప్పు కొంచెం తక్కువవుతుంది.

క్రిప్టో కరెన్సీని ఎలాగూ భారత్ గుర్తించలేదు. కాబట్టి రెండు బ్యాంకులు కుప్పకూలడం తాలూకూ ప్రభావం మనపై ఉండదు. వాస్తవానికి తాజా సంక్షోభం తరువాత ప్రపంచవ్యాప్తంగా క్రిప్టో కరెన్సీ వ్యవహారాలను బ్యాంకింగ్‌కు దూరంగా ఉంచాలన్న అభిప్రాయం బలపడటం గుర్తించాలి.

ప్రత్యక్ష ప్రభావం లేదు

అమెరికన్ బ్యాంకులు, క్రెడిట్ స్విస్ సంక్షోభం తాలూకూ ప్రత్యక్ష ప్రభావం భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థపై ఏమీ కనపడటం లేదు. కాకపోతే ఒక్కసారి పరిస్థితిని సమీక్షించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. బ్యాలెన్స్ షీట్లను ఒక్కసారి పరిశీలించుకుని డిపాజిట్లు, అప్పులు ఎలా విభజితమై ఉన్నాయో చూసుకోవడం మేలు. ట్రెజరీ డిపార్ట్‌మెంట్ కూడా రిస్క్ టీమ్స్‌తో కలిసి పెట్టుబడుల తీరుతెన్నులను మదింపు చేయాలి. అంతేకాకుండా... డెట్(రుణ) సర్వీస్ కవరేజి నిష్పత్తికి సంబంధించి ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా? అన్నది పరిశీలించాలి. ఇది నిరంతర ప్రక్రియలా సాగాలి.

ఆర్‌బీఐ కూడా డిపాజిట్లపై ప్రస్తుతం జారీ చేస్తున్న ఇన్సూరెన్స్‌ను సమీక్షించాల్సిన అవసరముంది. ప్రస్తుతం డిపాజిట్లపై ఉన్న ఐదు లక్షల గరిష్ఠ ఇన్సూరెన్స్ పరిమితిని పది లక్షల రూపాయలకు పెంచాలి. ముప్పు తీవ్రత ఆధారంగా బ్యాంకులను వర్గీకరించే అంశాన్నీ పరిశీలించాలి.

అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న అంశంపై త్వరలోనే చర్చ మొదలు కావచ్చు. 'బేసిల్–4' (సంస్కరణల కోసం) వంటివి ఏర్పడే అవకాశమూ లేకపోలేదు. ఇది బ్యాంకులకు అవసరమైన మూలధనం మరింత పెరిగేందుకు దారితీసే అవకాశముంది. అంతేకాకుండా... మార్కెట్, క్రెడిట్ రిస్క్‌లను అంచనా వేసేందుకు మరిన్ని పరీక్షల్లాంటివి చేయాల్సిన అవసరం ఏర్పడవచ్చు.

వ్యాసకర్త బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకానమిస్ట్
('ద బిజినెస్ లైన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అన్నది వేరు!



నీరవ్ మోదీ, లలిత్ మోదీ, మేహుల్ చోక్సీలను రాహుల్ గాంధీ దొంగలు అన్నారు. అందరు దొంగలకు మోదీ అనే పేరు ఎందుకుంది అని ప్రశ్నించారు. అందరు మోదీలు దొంగలు అని ఆయన అనలేదు. అయినప్పటికీ ఎవరో మోదీ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందన్న ఫిర్యాదు మీద ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఆ కారణంగా ఆయన్ని ఎన్నికల్లో పాల్గొనకుండా చేయవచ్చనే కదా? ఇదీ భారత ప్రజాస్వామ్య పరిస్థితి!

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

పేడ పాఠం



ప్రైవేటు వ్యక్తుల వ్యవసాయ క్షేత్రాలను జప్తు చేయడానికి నెదర్లాండ్స్ ప్రభుత్వం ప్రయత్నించింది. దీనికి ప్రతిగా డచ్ రైతులు ప్రభుత్వ భవనాలు, పోలీసుల మీద పేడను పిచికారీ చేశారు. మనం డచ్‌వాళ్ల నుంచి నేర్చుకోవచ్చు.

– స్టూ పీటర్స్, టీవీ హోస్ట్

బలోపేతం చేస్తున్నారు



రాహుల్ గాంధీ కూడా కలలు కననన్ని రకాలుగా ఈ ప్రభుత్వం ఆయన్ని బలోపేతం చేయడానికి దారులు వెతుకుతోంది.

– హర్తోష్ సింగ్ బాల్, సంపాదకుడు

వద్దంటే వద్దు



నియంత మెక్రాన్‌ను తొలగించాలని కోరుతూ ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో లక్షల మంది పోగయ్యారు. 'వరల్డ్‌ఎకనామిక్ ఫోరమ్' నిరంకుశత్వంతో ప్రజలు విసిగిపోయారు.

– అనస్తాసియా మారియా లూపిస్, వైద్యురాలు

ఓబీసీలను అవమానించారు!



రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని అవమానించినంత మాత్రాన మనం గాంధీ ఇంటిపేర్లున్న అందరినీ నిందించలేం. రాహుల్ గాంధీ ఓబీసీ సమాజం మీద అవమానకర వ్యాఖ్యలు చేసి వాళ్లను అగౌరవపరిచారు. కానీ కొందరు కాంగ్రెస్ నాయకులు దీన్ని సమర్థించుకోవడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

– కిరణ్ రిజిజు, కేంద్ర న్యాయశాఖ మంత్రి

కొంతైనా పేరొస్తుంది



ఒక విన్నపం: తర్వాతెప్పుడైనా మీరు మీకు నచ్చిన పుస్తకం గురించి ప్రస్తావించినప్పుడు, ఒకవేళ అది ఏ పుస్తకాల దుకాణంలోనో కొనివుంటే అది కూడా పేర్కొనండి. అది మాలాంటి పుస్తకాల షాపులకు ఎంతో మేలు చేస్తుంది. మీ ప్రస్తావన మమ్మల్ని సంతోషంతో చిన్న డ్యాన్స్ చేసేట్లు కూడా చేయొచ్చు.

– లియొనార్డ్ ఫెర్నాండెజ్, గోవా పుస్తకాల దుకాణదారు

అందుకే గొప్ప



నాకు వరుసకు అమ్మమ్మయ్యే (రచయిత్రి) మహాశ్వేతాదేవి బతికి ఉన్నప్పుడు ఆమె దగ్గరకు ఎప్పుడు వెళ్లినా, మూడు రైటింగ్ ప్యాడ్స్ మీద వరుసగా రాస్తూవుండేది. బహుశా ఒకటి నవల, మిగిలిన రెండు కథలు లేదా వ్యాసాలు. మళ్లీ ఆ మూడింటిలోనూ ఆమె అప్రయత్నంగా రాస్తున్నట్టు అనిపించేది.

– నీలాంజనా భౌమిక్, రచయిత్రి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

రంగినేని ఎల్లమ్మ పురస్కారం

2022 సంవత్సరపు 'రంగినేని ఎల్లమ్మ పురస్కారా'న్ని రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు 'ఉడుకు బెల్లం' కథా సంపుటి గెలుచుకుంది. రంగినేని మోహన్ రావు అధ్యక్షులుగా ఉన్న రంగినేని చారిటబుల్ ట్రస్ట్ కొన్నేళ్లుగా ఈ పురస్కారాలను ప్రదానం చేస్తోంది.

సిరిసిల్ల కరీంనగర్ రోడ్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో జరిగే వేడుకకు ముఖ్య అతిథి... ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత డా॥ ఎన్. గోపి. కవి, రచయిత జూకంటి జగన్నాథం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో కేంద్రసాహిత్య అకాడెమీ అనువాద పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్, ఉస్మానియా యూనివర్సిటీ సహాయ ఆచార్యులు ఎస్. రఘు, కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ వంటి ప్రముఖులు పాల్గొంటారు. కేంద్రసాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్ సమన్వయంతో ఈ సభ జరగనుంది.

– మద్దికుంట లక్ష్మణ్, పురస్కార కమిటీ కన్వీనర్
(రేపు సిరిసిల్లలో 'రంగినేని ఎల్లమ్మ పురస్కార' ప్రదానం)

జగతిని ధర్మయాత్రతో జయించిన సమ్రాట్




మల్లెపల్లి లక్ష్మయ్య

''భారతీయ జెండాలో ధర్మ చక్రాన్ని ఇముడ్చుకోవడం కేవలం గుర్తుగా మాత్రమే కాదు. ఇది ప్రత్య క్షంగా సమ్రాట్ అశోకుణ్ణి నిరంతరం గుర్తుచేసుకోవడమే. సమ్రాట్ అశో కుడు భారత దేశం మాత్రమే గర్వించదగిన వాడు కాదు. యావత్ ప్రపంచం ఆయనను స్మరించుకొంటూనే ఉంది. ఆయన ఇతర దేశాలకు పంపిన దమ్మ సైన్యం దండయాత్రలకు వెళ్ళలేదు. మానవ త్వాన్ని తమ వెంట తీసుకెళ్ళి ఎన్నో దేశాల సమాజాలను చైతన్య పరిచింది'' అంటూ భారత ప్రప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, 1947 జూలై 22వ తేదీన రాజ్యాంగ సభలో భారత జాతీయ పతాకంపై ప్రవేశ పెట్టిన తీర్మాన సభలో ప్రస్తావించారు. ఆయనతో పాటు ఆనాటి సభలో ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్‌తోపాటు అనేక మంది మేధావులూ, న్యాయ నిపుణులూ నెహ్రూ ప్రసంగాన్ని ఎంతో ప్రశంసించారు.

దశదిశలా తన సామ్రాజ్యాన్ని విస్తరింపచేసిన చక్రవర్తిగా అశోకుడికి గొప్ప పేరుంది. యుద్ధాలను నిరసించి శాంతిని కాంక్షించిన మానవతామూర్తిగా ఆయనకు మరొక విశేషమైన స్థానమున్నది. పరిపాలనలో అనేకమైన సంస్కరణలను ప్రవేశ పెట్టిన దీక్షాదక్షతల ప్రత్యేకతలు ఉన్నాయి. వీటన్నింటికి తోడు, బౌద్ధాన్ని భారతదేశ హద్దులను దాటించి ఎన్నో దేశాల్లో ఆ ధర్మాన్ని విస్తరింపచేసిన సందర్భమున్నది. తన సొంత కొడుకును, బిడ్డను శ్రీలంకకు దమ్మదూతలుగా పంపించిన త్యాగ గుణమున్నది. వీటిన్నింటికన్న మరొక ముఖ్యమైన విషయమున్నది. అదే ఒక రాజుగా, చక్రవర్తిగా ప్రజల క్షేమాన్ని, సంక్షేమాన్ని ప్రధాన కర్తవ్యంగా స్వీకరించి ప్రపంచ చరిత్రలోనే 'సంక్షేమం' అన్న పదానికి ఒక రూపాన్నీ, సారాన్నీ అందించిన ఆద్యుడిగా చరిత్రలో నిలిచిపోయాడు.

బౌద్ధాన్ని తాత్విక భూమికగా చేసుకుని అశోకుడు ఈ విధానాలను సొంతం చేసుకున్నాడు. అందులో గౌతమ బుద్ధుడు అందించిన మార్గదర్శనం ప్రాథ మికం. గౌతమ బుద్ధుని అనంతమైన బోధనలలో ఎన్నో అద్భుతమైన విషయాలున్నాయి. చాలామంది గౌతమ బుద్ధుణ్ణి కేవలం ఒక నైతిక విషయాల ప్రబోధకుడిగా పరిగణిస్తున్నారు. కానీ ఆయన ఆర్థిక, రాజకీయ విషయాల్లో ఎన్నో ఆవిష్కరణలను చేశారు.

కొత్త కోణం



ఆనాటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఆయన 'కూటదంత సుత్త', 'దశ రాజ దమ్మ' జాతక కథల్లో... ఒక రాజు నిర్వహించాల్సిన కర్తవ్యాలను చాలా వివరంగా తెలిపారు. దానినే దశరాజదమ్మంగా చెపుతుంటారు. దానం, శీలం, త్యాగం, నిజాయితీ, నిబద్ధత, ఆదరణ, దురాశలకు దూరంగా ఉండడం, విద్వేషం లేకుండా ఉండడం, ఇతర ప్రాణులను హింసించకుండా ఉండడం, క్షమా గుణం కలిగి ఉండడం, శత్రుత్వం లేకుండా ఉండడం లాంటి లక్షణాలకు కట్టుబడి ఉండాలని గౌతమ బుద్ధుడు బోధించాడు.

పదిసూత్రాలలో ఉన్న దశరాజ దమ్మం, వస్సకార సూత్రాలు సమ్రాట్ అశోకుని మీద అమిత ప్రభావాన్ని కలుగజేశాయని భావించక తప్పదు. ఇందుకు ఈనాటి ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌కు సమీపంలోని ధౌలిలో లభించిన శిలాశాసనమే సాక్ష్యం. ''ప్రజలందరూ నావాళ్లే. వాళ్లంతా నా సంతానమే. నా సంతానం క్షేమాన్ని ఎట్లాగైతే బాధ్యతగా స్వీకరిస్తానో, అట్లాగే ప్రజలందరి సంక్షేమం నా కర్తవ్యం'' అంటూ తన పాలన విధానాన్ని వివరించాడు.

ప్రజల కష్టాలను తొల గించడానికి ఆర్థిక పరమైన ఎన్నో సంస్కరణలను ప్రవేశ పెట్టాడు. అందులో ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అశో కుడు తీసుకున్న చర్యలు వ్యవసాయ స్థిరీకరణకు ఉపయోగ పడ్డాయి. వ్యవసాయ అభివృద్ధి కోసం చెరువులను తవ్వించి, పంట కాలువలను తవ్వడం ద్వారా వ్యవసాయ ప్రగతిలో కొత్త విప్లవం వచ్చింది. అందువల్ల స్థిరమైన గ్రామాల సంఖ్య పెరిగింది. యాగాలు, క్రతువుల పేరిట జరుగుతున్న పశువధను నిషేధించడం వ్యవసాయ ప్రగతికి ఎంతో ఉపకరించింది. పశు సంతతిని అభివృద్ధి చేయడానికి పశు పెంపకం వైపు ప్రజలను ఆలోచింప జేశారు. ఈ విధానం వల్ల పాడి పంటలతో సమాజం ముందుకు వెళ్ళే మార్గాన్ని వేశారు. గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ రాసిన 'ఇండికా' పుస్తకం ద్వారా ఈ విషయాలు కొన్ని వెలుగులోకి వచ్చాయి.

అంతేకాకుండా వ్యవసాయంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాలను అభివృద్ధి చేశాడు. అందులో నౌకా యానం, నౌకా నిర్మాణ పరిశ్రమలు ముఖ్యమైనవి. నౌకా నిర్మాణ పరిశ్రమ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకాక, అనాటి ప్రభుత్వమే నిర్వహించింది. ఎవరైనా నౌకలు కావాలంటే ప్రభుత్వమే అద్దెకు ఇచ్చేది. దీనికై ప్రత్యేకమైన విభాగాలు ఉండేవి. బంగారం, బట్టలు, వజ్రాలు, రత్నాలు, సుగంధ ద్రవ్యాలు ఇతర వస్తువుల ఎగుమతులు ఎక్కువగా జరిగేవి. దీనివల్ల గ్రామాలలో వృత్తి సముదాయాలు బాగా పెరిగాయి. వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, చేనేత వర్గాలు చాలా వేగంగా తమ ఉత్పత్తిని, నైపుణ్యాన్ని పెంచుకోగలిగాయి. అంతే కాకుండా ఆనాటి పాలన అందిస్తున్న ప్రోత్సాహం వలన వ్యక్తుల నైపుణ్యం కూడా బాగా పెరిగింది. దీనితో వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు, కళా సంస్కృతులు బాగా వృద్ధి చెందాయి. ప్రజల కోసం ప్రభుత్వమే వైద్యశాలలను నిర్మించింది. పశు పక్ష్యాదులకు కూడా వైద్యం అందించారు. వ్యాపారుల కోసం, ఇతర యాత్రికుల కోసం దారుల వెంట వసతులు, నీటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఇట్లా సమ్రాట్ అశోకుడు సాగించిన రాజకీయ, ఆర్థిక విప్లవ వృక్షాలకు బుద్ధుడు వేసిన విత్తనాలే మూలం. అందువల్ల బౌద్ధం గొప్పతనం విశిష్టత అశోకుడి పాలనలో మనకు రుజువులుగా కనిపించాయి. అలా బుద్ధుడు ప్రవచించిన బోధనలను ఆచరణలో అశోకుడు ఆనాటి సమాజానికి అన్వయించి ఆనాటి సామాజిక గతిని ప్రగతి వైపు నడిపించాడు. అయితే బుద్ధుడు, అశోకుడు చూపిన మార్గాన్ని బాబా సాహెబ్ అంబేడ్కర్ తన రాజకీయ సిద్ధాంతంగా మలుచు కొని జవహర్‌లాల్ నెహ్రూ లాంటి నాయకుల తోడ్పాటుతో భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్య సంపదగా మార్చారు. అందుకే భారతదేశ చరిత్ర బుద్ధుడు, అశోకుడు, బాబా సాహెబ్ అంబేడ్కర్లదే అంటే అతిశయోక్తి కాదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । 81063 22077
(మార్చి 29న సమ్రాట్ అశోక అష్టమి – అశోక జయంతి)

నేడు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- రేపు ఉదయం 9 గంటలకు ప్రయోగం


ప్రయోగానికి సిద్ధంగా రాకెట్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ స్పేస్ సంస్థలు కలిసి వాణిజ్యపరంగా స్థానిక సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఆదివారం ఉదయం 9 గంటలకు ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్‌ను ప్రయోగించేందుకు సర్వం సిద్ధంచేశారు. ఇందుకు సంబంధించి శనివారం ఉదయం 8.30 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించనున్నారు. 24.30గంటల కౌంట్ డౌన్ అనంతరం రాకెట్‌ను ప్రయోగిస్తారు. ఈ మేరకు షార్‌లో శుక్రవారం నిర్వహించిన ఎంఆర్ఆర్ కమిటీ, లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశాల్లో నిర్ణయించారు. అంతకుముందే మూడు దశల రాకెట్‌ను అనుసంధానం చేశారు. దానిని ప్రయోగ వేదికపై అమర్చి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు వారికి అప్పగించారు. ఈ ప్రయోగం ద్వారా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్ కంపెనీ, ఇండియాకు చెందిన భారతీ ఎంటర్‌ప్రైజెస్ వారు సంయుక్తంగా వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో 5,805 కిలోల బరువు కలిగిన 36 సమాచార ఉపగ్రహాలను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని లోయర్ ఎర్త్ ఆర్బిట్ (సర్క్యులర్ ఆర్బిట్)లోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రయోగాన్ని 19.7 నిమిషాల్లో పూర్తి చేసి 36 ఉపగ్రహాలను ఒక్కొక్కటిగా నిర్దేశించిన సమయంలో నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు డిజైన్ చేశారు.

నేడు, రేపు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు కొనసాగడానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం, ఆదివారం వర్షాలు పడతాయని వాతావరణ శాఖ శుక్రవారం తెలిపింది. కొద్దిరోజులుగా ఉపరితల ద్రోణి ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పుడు ద్రోణికి ఉపరితల ఆవర్తనం కూడా తోడైంది. ప్రస్తుతం అంతర్గత తమిళనాడు నుంచి విదర్భ వరకు రాయలసీమ, ఉత్తర కర్ణాటక మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. మరోవైపు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో రాయలసీమ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ఫలితంగా శని, ఆదివారాల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అదే సమయంలో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులకు ఆస్కారం ఉందని పేర్కొంది. కాగా శుక్రవారం ప్రకాశం, అనకాపల్లి, కాకినాడ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. కనిగిరి (ప్రకాశం) 8.5, కోట ఉరట్ల (అనకాపల్లి) 7.1, డి.పోలవరం (కాకినాడ), మెళియాపుట్టి (శ్రీకాకుళం) 5.7, కురుపాం (పార్వతీపురం మన్యం) 5.7, శివల (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ)లో 5 సెం.మీల వర్షపాతం నమోదైంది.

అన్నవరపు బ్రహ్మయ్యకు కీర్తి పురస్కారం

సాక్షి,విజయవాడ: ప్రముఖ పాత్రికేయుడు అన్నవరపు బ్రహ్మయ్యకు 2020 సంవత్సరానికిగాను వార్తా రచనలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారం లభించింది. దీన్ని మార్చి 29న హైదరాబాద్ తెలుగు వర్సిటీ ఆవరణలో అందజేయనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బట్టు రమేష్ శుక్రవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన బ్రహ్మయ్య 1981లో జర్నలిజంలో ప్రవేశించారు. పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం తెలుగు తోరణం పత్రికకు వ్యవస్థాపక సంపాదకుడిగా వ్యవహరిస్తున్నారు.

సామాజిక సేవలపై..
పెరిగిన మూలధన, రెవెన్యూ వ్యయం

సామాజిక సేవలపై మూలధన వ్యయం 22.31 శాతం.. రెవెన్యూ వ్యయం 4.93 శాతం పెరుగుదల

- రాష్ట్ర రెవెన్యూ రాబడి 28.53 శాతం వృద్ధి
- రాష్ట్ర సొంత పన్నుల రాబడి 23.64 శాతం..
- సొంత పన్నేతర ఆదాయం 47.78 శాతం పెరుగుదల
- కేంద్రం నుంచి పన్నుల వాటాతో పాటు గ్రాంట్లు రాబడి కూడా..
- 2021–22 ఆర్థిక ఏడాదికి సంబంధించి కాగ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి : 2020–21తో పోలిస్తే 2021–22 ఆర్థిక సంవత్సరంలో సామాజిక సేవలపై మూల ధన వ్యయంతో పాటు రెవెన్యూ వ్యయం కూడా పెరిగిందని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక తెలిపింది. 2021–22కి సంబంధించి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కాగ్ ఇచ్చిన నివేదికను ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శుక్రవారం అసెంబ్లీకి సమర్పించారు. సామాజిక సేవలపై 2021–22లో 42.45 శాతం వ్యయం చేసినట్లు పేర్కొంది. ఇందులో ప్రధానంగా విద్య, ఆరోగ్య.. కుటుంబ సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం, సాంఘిక సంక్షేమం, పోషణ, క్రీడలు, కళలకు రూ.66,371 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొంది. సామాజిక సేవలపై సాధారణ రాష్ట్రాల సగటు వ్యయం కన్నా ఏపీలో ఎక్కువగా ఉంది. ఇక సామాజిక సేవలపై రాష్ట్రాల సగటు వ్యయం 38.31 శాతం ఉండగా ఏపీలో 42.45 శాతం ఉంది. అలాగే.. ఆరోగ్యంపై సాధారణ రాష్ట్రాల సగటు వ్యయం 6.2 శాతం ఉంటే ఏపీలో 6.34 శాతంగా ఉంది. మరోవైపు.. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల వ్యయం పెరుగుతోందని కాగ్ వెల్లడించింది. 2021–22లో మొత్తం వ్యయంలో అభివృద్ధి వ్యయం 66.69 శాతం ఉంది.

2020-21తో పోలిస్తే 2021-22లో కీలకమైన ఆర్థిక సూచికల్లో మార్పులు ఇలా..

రెవెన్యూ రాబడులు:
- రాష్ట్ర రెవెన్యూ రాబడి 28.53 శాతం పెరిగింది.
- రాష్ట్ర సొంత పన్నుల రాబడి 23.64 శాతం
- సొంత పన్నేతర రాబడి 47.78 శాతం
- కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా 44.67 శాతం
- కేంద్రం నుంచి సహాయ గ్రాంట్లు 22.90 శాతం వృద్ధి

రెవెన్యూ వ్యయం:
- ఇది 4.25 శాతం పెరిగింది.
- సాధారణ సేవలపై 14.56 శాతం
- సామాజిక సేవలపై 4.93 శాతం
- ఆర్థిక సేవలపై 10.36 శాతం పెరిగింది.

మూలధన వ్యయం:
- సాధారణ సేవలపై 69.39 శాతం
- సామాజిక సేవలపై 22.31 శాతం
- ఆర్థిక సేవలపై 10.26 శాతం పెరిగింది.

రుణాలు, అడ్వాన్స్‌లు:
- ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 24.66 శాతం పెరిగాయి.
- వసూళ్లు 98.49 శాతం పెరిగింది.

ప్రజా రుణం:
- తీసుకున్న రుణం 1.46 శాతం తగ్గింది
- తిరిగి చెల్లింపు 1.67 శాతం పెరిగింది.
- నగదు నిల్వ 2021–22లో 17.49 శాతం పెరిగింది.

తప్పనిసరి ఖర్చుల్లోని అంశాల్లో పెరుగుదల ఇలా.. (రూ.కోట్లలో)

అంశాలు	2019-20	2020-21	2021-22
జీతాలు, వేతనాలు	36,934	40,582	42,738
పెన్షన్లు	17,385	17,470	20,327
వడ్డీ చెల్లింపులు	17,653	20,018	22,165
మొత్తం	71,972	78,070	85,230



ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బాబును అరెస్టు చేయాలి

908వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చంద్రబాబును వెంటనే అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి 908వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు ప్రలోభాలకు గురిచేస్తూ డబ్బు ఎరవేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని నడిబజారులో నగ్నంగా ఊరేగించాడన్నారు. తెలంగాణలో ఎమ్మెల్యేలకు వలవేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన చంద్రబాబును అరెస్టు చేయనీయకుండా వ్యవస్థలు అడ్డుపడిన కారణంగానే.. నేడు బాబు మరోసారి తప్పుడు చర్యలకు పాల్పడ్డాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుజన రాజ్యాధికారం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో బహుజనులకు పెద్దపీట వేస్తుంటే అన్ని విధాలా బాబు అడ్డుపడుతున్నాడని ధ్వజమెత్తారు. మత ప్రాతిపదికన కాకుండా కుల ప్రాతిపదికన రిజర్వేషన్‌లు కల్పించాలని కోరుతూ దళిత క్రిస్టియన్‌లను ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపించడం హర్షణీయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, ఇందుపల్లి సుభాషిణి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అంత్యక్రియలు


శ్రీనాథరెడ్డి మృతదేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న ప్రభుత్వ అధికారులు

సింహాద్రిపురం: ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథరెడ్డికి శుక్రవారం కోవరంగుంటపల్లె గ్రామంలో కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బుధవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందిన ఆయన పార్థివదేహాన్ని గురువారం హైదరాబాద్‌లోనే ప్రముఖుల దర్శనార్థం అందుబాటులో ఉంచారు. శుక్రవారం శ్రీనాథరెడ్డి మృతదేహం స్వగ్రామమైన సింహాద్రిపురం మండలం కోవరంగుంటపల్లె గ్రామానికి తీసుకొచ్చారు. బంధుమిత్రులతోపాటు, రాయలసీమ వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు నివాళులు అర్పించిన అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసు అధికారులు గౌరవ వందనం అనంతరం సాయుధులైన నలుగురు పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు నిర్వహించిన తర్వాత శ్రీనాథరెడ్డి చితికి ఆయన తండ్రి ద్వారకనాథరెడ్డి నిప్పంటించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మధుసూదనరెడ్డి, హైకోర్టు జీపీ మహేశ్వరరెడ్డి, రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా యువత నడుచుకోవాలి

- సీఐడీ విభాగం అడిషనల్ డీజీ సంజయ్
- యూనివర్సిటీ కనెక్ట్ సదస్సు విజయవంతం



ఏయూక్యాంపస్ (విశాఖ తూర్పు): దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా యువత నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ సీఐడీ విభాగం అడిషనల్ డీజీ సంజయ్ అన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో జీ-20 సన్నాహక సదస్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. భారతీయుడిగా నిలుస్తూ, భారతీయ తత్వాన్ని ప్రపంచానికి అందించే ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి అత్యధిక ప్రాధాన్యత, గుర్తింపు, గౌరవం లభించే దిశగా పనిచేయాలని యువతరానికి సూచించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ..జీ–20 నిర్వహణ బాధ్యత భారత్‌కు లభించడం దేశానికే గర్వకారణమన్నారు. భారత ప్రభుత్వ పూర్వ దౌత్యవేత్త గిరీష్ శర్మ మాట్లాడుతూ..ప్రపంచాన్ని ప్రభావితం చేసే దేశాలు జీ–20 సదస్సులో పాల్గొంటాయని చెప్పారు. ఏయూ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఆచార్య జి.వీర్రాజు మాట్లాడుతూ..యువతను చైతన్యవంతం చేసే విధంగా యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఏయూ విశ్రాంత ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ యువత దేశ సంపద సృష్టికర్తలుగా నిలుస్తున్నారన్నారు. ఆర్ఐఎస్ ప్రతినిధి అలీ, అంబేద్కర్ చెర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ తదితరులు ప్రసంగించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రూ.46 కోట్లతో వైఎస్సార్ విత్తన పరిశోధన కేంద్రం

- గన్నవరంలోని ఏపీసీడ్స్ ఆవరణలో భూమిపూజ
- పనులు ప్రారంభించిన మంత్రులు కాకాణి, రోజా, ఎమ్మెల్యేలు వంశీ, రమేశ్‌బాబు


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు కాకాణి, రోజా, ఎమ్మెల్యే వంశీ, రమేష్‌బాబు

గన్నవరం: రాష్ట్రంలో మొదటిసారిగా రూ.46 కోట్లు వ్యయంతో కృష్ణాజిల్లా గన్నవరంలోని ఏపీ సీడ్స్ కార్పొరేషన్ సంస్థ ఆవరణలో నిర్మిస్తున్న వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణ కేంద్రం పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీమోహన్, సింహాద్రి రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని భూమిపూజ చేసి పనుల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఇప్పటివరకు విత్తన పరిశోధన కేంద్రం జాతీయస్థాయిలో వారణాసిలో మాత్రమే ఉందన్నారు. తొలిసారిగా రాష్ట్రంలో విత్తన పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించడం రైతుల సంక్షేమం పట్ల ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఎనిమిదెకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ కేంద్రాన్ని ఏడాదిలోపు పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మంత్రి రోజా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అన్ని వాతావరణాలను తట్టుకుని మంచి దిగుబడులిచ్చే విత్తనాలను సరఫరా చేసే లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శేఖర్‌బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ జె.రాఘవరావు, ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీపీ అనగాని రవి తదితరులు పాల్గొన్నారు.

దళిత యువతి దారుణహత్య

- ప్రేమ పేరుతో వంచన... ఆపై చెరువులో నెట్టివేసి హత్య
- అనంతపురంలో ఆటో డ్రైవర్ ఘాతుకం


హతురాలు రమాదేవి (ఫైల్)


నిందితుడు జాఫర్ (ఫైల్)

బుక్కరాయసముద్రం: ప్రేమ పేరుతో దళిత యువతిని ఓ ఆటో డ్రైవర్ వంచించాడు. పెళ్లి చేసుకోవాలని కోరిన యువతిని కిరాతకంగా కొట్టి చెరువులో నెట్టివేసి హత్య చేశాడు. అనంతపురం జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు... అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన నారాయణమ్మ, నారాయణస్వామి దంపతుల కుమార్తె రమాదేవి (24) నార్పలలోని ఓ ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా పని చేస్తుంది. నడిమిదొడ్డి గ్రామానికి చెందిన జాఫర్ ఆటోలో రమాదేవి రోజూ స్కూలుకు వెళ్లి వచ్చేది. పెళ్లయి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్న జాఫర్... రమాదేవిని ప్రేమ పేరుతో నమ్మించాడు. ఇద్దరూ శారీరకంగా కలిసిన తర్వాత తనను పెళ్లి చేసుకోవాలని రమాదేవి కోరింది. దీంతో ఎలాగైనా రమాదేవిని వదిలించుకోవాలని భావించిన జాఫర్ ఈ నెల 4వ తేదీన దేవరకొండ సమీపంలోని చెరువు దగ్గరకు ఆటోలో ఆమెను తీసుకెళ్లాడు. అక్కడ ఆమెతో గొడవపడి కొట్టి చెరువులోకి నెట్టివేశాడు. దీంతో రమాదేవి నీట మునిగి మృతిచెందింది. అక్కడి నుంచి జాఫర్ ఇంటికి వెళ్లిపోయాడు. యథావిధిగా ఆటో నడుపుకుంటున్నాడు. స్కూలుకు వెళ్లిన రమాదేవి తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. ఆమె స్కూలుకు రాలేదని యాజమాన్యం చెప్పడంతో వెంటనే నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు జాఫర్‌పై అనుమానంతో స్టేషన్‌కు రెండుసార్లు పిలిపించి విచారణ చేశారు. అయినా ఆచూకీ దొరకలేదు. కానీ, వారం తర్వాత రమాదేవి సెల్‌ఫోన్ నుంచి ఆమె అక్కకు మెసేజ్ వచ్చింది. 'అమ్మను బాగా చూసుకో. నేను ఇంటి నుంచి వచ్చేశా. నేను బాగున్నా. ఏం టెన్షన్ పెట్టుకోవద్దు' అనేది మెసేజ్ సారాంశం. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా.. సెల్‌ఫోన్ జాఫర్ వద్ద ఉన్నట్లు తేలింది. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగు చూసింది. చెరువులోని రమాదేవి మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు వెలికి తీయించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నిందితుడ్ని విచారించి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

దళిత సంఘాల ఆందోళన

రమాదేవి హత్యను ఖండిస్తూ ఆమె బంధువులతోపాటు దళిత సంఘాల నాయకులు శుక్రవారం అనంతపురం–తాడిపత్రి రహదారిపై మూడు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ మోహన్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. రమాదేవి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, ఐదు ఎకరాల పొలం, ఐదు సెంట్ల ఇంటి స్థలం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, రూ.8.50 లక్షల పరిహారం అందించే విధంగా చర్యలు చేపడతామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఫెర్రో అల్లాయ్ పైపుల ఫ్యాక్టరీకి భూమిపూజ

- సీఎం జగన్‌పై నమ్మకంతోనే పరిశ్రమలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్టమైన పరిపాలన వల్లే పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు వస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఆరడిగుంటలో రూ.160 కోట్లతో నిర్మిస్తున్న ఫెర్రో అల్లాయ్ పైపుల ఫ్యాక్టరీ నిర్మాణానికి శుక్రవారం ఎంపీలు పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, కలెక్టర్ హరినారాయణ్‌తో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఈనెలలో విశాఖలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని గుర్తుచేశారు. సుమారు రూ.13 లక్షల కోట్లతో రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ఎంవోయూలు చేసుకోవడం శుభపరిణామమన్నారు. ఇందులో ఇంధనశాఖకు సంబంధించి రూ.9 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురావడం ముఖ్యమంత్రిపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. పుంగనూరు నియోజకవర్గం తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల సరిహద్దులో ఉండడం, ఎక్స్‌ప్రెస్ హైవేలు సమీపంలో వస్తుండడంతో ఈ ప్రాంతం పరిశ్రమలు నెలకొల్పేందుకు అనువుగా ఉందన్నారు. ముఖ్యంగా రెండు రిజర్వాయర్లు నిర్మించి, పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్, ముడిసరుకు లభించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొచ్చేవారికి ప్రభుత్వపరంగా అన్నిరకాల రాయితీలు అందించి ప్రోత్సహిస్తామని తెలిపారు. భవిష్యత్తులో పుంగనూరు చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఫ్యాక్టరీ ఎండీ క్రేజివాల్, సీఈవో సురేష్‌కండేవాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపద్మావతి మహిళా వర్సిటీకి ఐఎస్ఓ గుర్తింపు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ గుర్తింపు కలిగిన ఐఎస్ఓ సర్టిఫికేషన్ లభించింది. శుక్రవారం మహిళా వర్సిటీలో హెచ్‌వైఎం సంస్థ ఎండీ ఆలపాటి శివయ్య చేతుల మీదుగా ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రం మహిళా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, డిప్యూటీ రిజిస్ట్రార్ గీతావాణి పాల్గొన్నారు.

ఐదేళ్లలో 10 లక్షల చిన్నకారు రైతులకు సహకారం

ప్రణాళికను ప్రకటించిన వాల్‌మార్ట్



రిపోర్ట్‌ను విడుదల చేస్తున్న వాల్‌మార్ట్ బృందం

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): దేశ వ్యాప్తంగా చిన్నకారు రైతులకు సహకారం అందించడమే ధ్యేయంగా ప్రణాళికలను రూపొందించినట్లు వాల్‌మార్ట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాథ్లీన్ మెక్‌లాఫ్లిన్‌తెలిపారు. శుక్రవారం విశాఖలోని ఓ హోటల్‌లో వాల్‌మార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ రంగం అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన సదస్సులో వాల్‌మార్ట్ ఫౌండేషన్ ఐదేళ్ల ప్రణాళికను వివరించింది. 2028 నాటికి 10 లక్షల చిన్నకారు రైతులకు సహకారం అందించాలని అందులో 50 శాతం మహిళ రైతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాల్‌మార్ట్ నూతన నిధుల ద్వారా ఏపీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలలోని చిన్న కారు రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంగా వ్యవసాయ సమీకరణలు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఏపీ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో వచ్చే ఐదేళ్లలో 3 మిలియన్ల డాలర్ల పెట్టుబడితో 24 రైతు ఉత్పత్తిదారుల సంస్థల భాగస్వామ్యంతో చిన్నకారు రైతుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సదస్సును ఫిక్కి చైర్మన్, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ ఏపీ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ప్రభాకర్‌రావు జ్యోతి ప్రారంభించారు. అనంతరం సంస్థ రిపోర్ట్‌ను వాల్‌మార్ట్ బృందం విడుదల చేసింది.

టీడీపీ కార్యాలయం వద్ద ప్రమాదం

- టపాసులు కాలుస్తుండగా చెలరేగిన మంటలు
- నలుగురు కార్యకర్తలకు గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం


టీడీపీ జాతీయ కార్యాలయం వద్ద బాణసంచా పేలి ఎగిసిపడుతున్న మంటలు (ఇన్‌సెట్‌లో) తీవ్రంగా గాయపడిన షణ్ముఖ

మంగళగిరి: గుంటూరు జిల్లా ఆత్మకూరులోని టీడీపీ జాతీయ కార్యాలయం వద్ద శుక్రవారం బాణసంచా కాలుస్తుండగా ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు టీడీపీ కార్యకర్తలు గాయపడగా అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు నెల్లూరు జిల్లాకు చెందిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ర్యాలీగా ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు మద్యం మత్తులో ఇష్టానుసారంగా బాణసంచా కాల్చారు. దీంతో అక్కడ ఉన్న బాణసంచాకు అంతటికీ నిప్పు రవ్వలు అంటుకుని ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో మంగళగిరిలోని మార్కండేయ కాలనీకి చెందిన తాడిశెట్టి చెన్నయ్య, తాడిశెట్టి వెంకటేశ్వర్లు, నంబూరుకు చెందిన కారు డ్రైవర్ కొడాలి షణ్ముఖ, కృష్ణాజిల్లా కంచికచర్ల మండలం కేసర గ్రామానికి చెందిన ఎస్‌కే హుస్సేన్ సాహెబ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం చినకాకాని ఎన్నారై వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారిలో చెన్నయ్య, వెంకటేశ్వర్లు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కార్యాలయం వద్ద ర్యాలీ అదుపుతప్పడం, కార్యకర్తలు మద్యం సేవించి ఉండటం ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

సచివాలయానికి తాళం వేసిన టీడీపీ సర్పంచ్ భర్త



తాళం వేస్తున్న టీడీపీ సర్పంచ్ భర్త నారాయణ



బయట వేచి ఉన్న సచివాలయ ఉద్యోగులు

ఉలవపాడు: తన భార్యకు తెలియకుండా లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తారా అని టీడీపీ సర్పంచ్ నాళం గోవిందమ్మ భర్త నారాయణ సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగక... సచివాలయానికి, రైతు భరోసా కేంద్రానికి తాళం వేశాడు. ఈ ఘటన నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలంలో శుక్రవారం జరిగింది. ఆత్మకూరు గ్రామంలో 50% సబ్సిడీతో రైతు గ్రూపులకు వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకుగాను సహకార కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు, వ్యవసాయ శాఖాధికారులు వచ్చారు. అనంతరం వారు లబ్ధిదారులను సచివాలయానికి పిలిపించారు. ఈ సమయంలో సర్పంచ్ భర్త నారాయణ వచ్చి తమకు తెలియకుండా పరికరాలు లబ్ధిదారులకు ఎలా అందజేస్తారని సచివాలయ సిబ్బందిని బయటకు పంపించి తాళం వేశారు. సిబ్బంది బయటకు వచ్చి ఎంపీడీవో చెంచమ్మకు సమాచారమిచ్చారు. ప్రొటోకాల్ వివాదం ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని, తాళం ఎలా వేస్తారని ఫోన్‌లో అడిగి తాళం తీయాలని చెప్పారు. అయినా వినకపోవడంతో సచివాలయం వద్దకు వెళ్లి దగ్గరుండి తాళం తీయించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

వెల్దుర్తి(కర్నూలు): కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలం కృష్ణాపురం జెడ్పీ హైస్కూల్‌లో విధి నిర్వహణలో ఉన్న ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఓర్వకల్లు మండలం కొంతలపాడుకు చెందిన చిన్న మద్దయ్య (51) 1997లో ఎస్జీటీగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. 2017 నుంచి కృష్ణాపురం జెడ్పీ హైస్కూల్‌లో గణిత విద్యా బోధన చేస్తున్నారు.

డాక్టర్ హత్య కేసులో ఐదుగురికి జీవితఖైదు

భార్య, కుమారుడే నిందితులు

నెల్లూరు (లీగల్): రాష్ట్రవ్యాప్తంగా 2015లో సంచలనం కలిగించిన నెల్లూరు హాస్పిటల్ అధినేత, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుడుగుంట విజయ్ కుమార్ హత్య కేసులో నిందితులు ఐదుగురికి యావజ్జీవ కారాగార శిక్ష (జీవిత ఖైదు) పడింది. ఈ మేరకు శుక్రవారం నెల్లూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సి.సత్యవాణి తీర్పు చెప్పారు. నిందితులైన ఉషారాణి (హతుడు డాక్టర్ విజయ్‌కుమార్ భార్య), సుందరయ్య (కుమారుడు), న్యాయవాది కునిశెట్టి శ్రీధర్, మీసాల గంగరాజు, పామంజి పోలురాజుకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికీ రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వివరాలిలా ఉన్నాయి. భార్యతో వివాదాల నేపథ్యంలో డాక్టర్ విజయ్‌కుమార్ నెల్లూరు న్యూ మిలటరీ కాలనీలోని ఆయన తల్లి వద్ద ఉండేవారు. విజయ్‌కుమార్ భార్య, కుమారుడు సుందరయ్య బాలాజీనగర్‌లో వేరుగా ఉండేవారు. ఈ నేపథ్యంలో భర్త ఆస్తి తమకు దక్కదన్న ఉద్దేశంతో భార్య ఉషారాణి న్యాయవాది కునిశెట్టి శ్రీధర్‌తో కలిసి విజయ్‌కుమార్‌ను ఎలాగైనా వదిలించుకోవాలని కుట్రపన్నింది. 2015 మే 28 అర్ధరాత్రి విజయ్‌కుమార్ ఇంట్లోకి నిందితులు ఉషారాణి, సుందరయ్య, న్యాయవాది కునిశెట్టి శ్రీధర్, కిరాయి హంతకులు గంగరాజు, పోలురాజు ప్రవేశించి నిద్రిస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్‌ను గొంతు నులిమి హత్య చేశారు. తర్వాత గుండెపోటుతో విజయ్‌కుమార్ చనిపోయాడని ప్రచారం చేసి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. మృతుడి ఒంటిపై గాయాలు ఉండడం చూసిన ఆయన మిత్రులు మరో న్యాయవాది కేవీ శేషారెడ్డి నెల్లూరు వేదాయపాళెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఐదుగురిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

స్పందనలు

ప్రజాస్వామ్య చరిత్రలో ఇదో చీకటి రోజు

'ఇది భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు. నిజాలు మాట్లాడుతున్నందుకు, ప్రజల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నందుకే రాహుల్‌పై అధికార బీజేపీ కక్షగట్టింది. ఆయన గొంతు నొక్కడమే ఉద్దేశం. నిజాలను రాహుల్ బహిర్గతం చేయడం బీజేపీకి ఇష్టం లేదు, రాహుల్‌పై వేటు పడినా అదానీ అక్రమాలపై జేపీసీ విచారణ డిమాండ్‌పై తగ్గేది లేదు. మమ్మల్ని జైలుకు పంపించినా పోరాడుతూనే ఉంటాం''

– మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధ్యక్షుడు

''మోదీ భారత్‌లో విపక్ష నాయకులే లక్ష్యంగా మారారు. నేర చరితులైన బీజేపీ వారికి మంత్రి పదవులు. విపక్ష నేతలపై అనర్హత వేటు. ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత హీనమైన పరిస్థితి!''

మమత బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

''రాహుల్‌పై అనర్హత వేటు దిగ్భ్రాంతికి గురిచేసింది. దేశం అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. దేశంలో ఒకే పార్టీ, ఒకే నాయకుడు ఉండాలని అనుకుంటున్నారు. బ్రిటీష్ పరిపాలన కంటే ప్రమాదకరంగా ప్రధాని మోదీ పాలన మారింది. ఇది కేవలం ఒక్క కాంగ్రెస్ చేసే పోరాటం కాదు. దేశాన్ని రక్షించుకోవడానికి 130 కోట్ల మంది భారతీయులు ఏకం కావాలి''

అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

''ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మోదీ స్నేహితుడైన పారిశ్రామికవేత్త (అదానీ) అంశాల నుంచి దృష్టి మరల్చే బీజేపీ ఎత్తుగడ ఇది. యూపీలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కుట్రలు పన్ని, తప్పుడు కేసులు పెట్టి సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే ఆజమ్‌ఖాన్ సహా ఎందరిపైనో అనర్హత వేటు వేసింది''

అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు

''రాహుల్‌గాంధీపై అనర్హత వేటు రాజ్యాంగం ప్రాథమిక సిద్ధాంతాలకే వ్యతిరేకం. ప్రజాస్వామ్య విలువలన్నీ మంటగలుపుతున్నారు. ఇలాంటి చర్యల్ని పూర్తిగా ఖండించాలి''

శరద్ పవార్, ఎన్సీపీ అధినేత

''రాహుల్‌పై అనర్హత ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులపై జరిగిన దాడి. ఇదొక ఫాసిస్టు చర్య. ఒక జాతీయ పార్టీ నాయకుడు, పార్లమెంటు సభ్యుడికి కూడా తన అభిప్రాయాలను వ్యక్తపరిచే ప్రజాస్వామ్య హక్కు లేదని ఇలాంటి చర్యల ద్వారా భయపెడుతున్నారు''

ఎంకె స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

''ప్రతిపక్ష నాయకుల్ని టార్గెట్ చేయడానికి పరువు నష్టం మార్గాన్ని బీజేపీ ఎంచుకోవడాన్ని ఖండించాలి. వ్యవస్థల్ని దుర్వినియోగం చేయడం తారాస్థాయికి చేరుకుంది. ఇలాంటి నిరంకుశ దాడుల్ని ప్రతిఘటించాలి, ఓడించాలి''

సీతారాం ఏచూరి, సీపీఎం ప్రధాన కార్యదర్శి

''అబద్ధాలు, వ్యక్తిగత నిందలు, ప్రతికూల రాజకీయాలు రాహుల్‌లో ఒక అంతర్భాగంగా మారాయి. ఒబిసి సామాజిక వర్గాన్ని దొంగలతో పోల్చి రాహుల్ తనకున్న కుల అహంకారాన్ని బయటపెట్టుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆయనకి ప్రజలు ఇంతకంటే పెద్ద శిక్ష విధిస్తారు.''

జె.పి. నడ్డా, బీజేపీ అధ్యక్షుడు

రాహుల్‌పై అనర్హత వేటు

లోక్‌సభ సభ్యత్వం రద్దు ● పార్లమెంట్ సెక్రటేరియట్ నిర్ణయం

న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామం! పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష ఖరారైన కాంగ్రెస్ నాయకుడు, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దయింది! ఈ మేరకు సంచలన నిర్ణయం తీసుకుంటూ లోక్‌సభ సెక్రటేరియట్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 'దొంగలందరి ఇంటి పేరూ మోదీయే ఎందుకుంటుందో' అని వ్యాఖ్యానించిన కేసులో సూరత్ కోర్టు రాహుల్‌ను దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించడం తెలిసిందే. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొంది. తీర్పు వెలువడ్డ ఈ నెల 23వ తేదీ (గురువారం) నుంచే వేటు అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. నిజానికి అప్పీలుకు వీలుగా శిక్ష అమలును నెల రోజుల పాటు నిలిపేస్తున్నట్టు సూరత్ కోర్టు పేర్కొనడం తెలిసిందే. అయినా లోక్‌సభ సెక్రటేరియట్ మాత్రం 24 గంటల్లోపే ఎంపీగా ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ వేటు వేయడం గమనార్హం! శిక్షపై ఉన్నత న్యాయస్థానంలో స్టే లభించని పక్షంలో రెండేళ్ల జైలు శిక్షా కాలం, అనంతరం మరో ఆరేళ్లు కలుపుకుని మొత్తం ఎనిమిదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాహుల్ అనర్హుడవుతారు! శుక్రవారం ఉదయం మామూలుగానే లోక్‌సభ సమావేశానికి హాజరైన ఆయన, లోక్‌సభ సెక్రటేరియట్ నిర్ణయం అనంతరం సభ నుంచి వెళ్లిపోయారు. రాహుల్‌పై అనర్హత వేటును కాంగ్రెస్ తీవ్రంగా నిరసించగా విపక్షాలన్నీ ముక్త కంఠంతో ఖండించాయి. ఆయనకు బాసటగా నిలిచాయి. దీనిపై 'జనాందోళన్' పేరిట దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. బీజేపీ మాత్రం వేటు చట్టప్రకారమే జరిగిందని పేర్కొంది. రాహుల్‌కు చట్టం వర్తించదా అని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన, అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. 'నేరాలకు పాల్పడడం రాహుల్‌కు అలవాటే. పార్లమెంట్‌కు, ప్రభుత్వానికి, దేశానికి అతీతుడినని ఆయన భావిస్తున్నారు. తమకు ప్రత్యేక భారత శిక్షాస్మృతి ఉండాలని, తమను ఎవరూ నేరస్తులుగా నిర్ధారించవద్దని, శిక్షలు విధించవద్దని కాంగ్రెస్, ప్రధానంగా నెహ్రూ–గాంధీ కుటుంబం కోరుకుంటోంది'' అంటూ దుయ్యబట్టారు. ''ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఏకమవుతున్నాయి. కానీ దేశ ప్రజలంతా ప్రధాని మోదీకి మద్దతుగా నిలుస్తున్నారు'' అన్నారు.


శుక్రవారం తనపై వేటు నిర్ణయం అనంతరం పార్లమెంటు నుంచి వెళ్లిపోతున్న రాహుల్ గాంధీ

భారత్ గొంతుక కోసమే నా పోరాటం

"భారతదేశ గొంతుక కోసం పోరాటం సాగిస్తున్నా. ఈ విషయంలో ఎలాంటి మూల్యం చెల్లించడానికైనా సిద్ధంగా ఉన్నా"

– రాహుల్ గాంధీ ట్వీట్

తలవంచం.. ఏం చేసుకుంటారో చేసుకోండి

''దేశ ప్రజాస్వామ్యం కోసం మా కుటుంబం రక్తం ధారపోసింది. అలాంటి ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నిస్తోంది. ప్రాణత్యాగం చేసిన ప్రధాని కుమారుడైన రాహుల్ గాంధీని 'మీర్ జాఫర్' అంటూ మోదీ మనుషులు కించపర్చారు. మా కుటుంబాన్ని దూషించారు. రాహుల్ తండ్రెవరని బీజేపీ ముఖ్యమంత్రి ఒకరు ప్రశ్నించారు. కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని పాటిస్తూ తలపాగా ధరిస్తే దాన్నీ తప్పుపట్టారు. తద్వారా పండిట్ల సామాజిక వర్గాన్ని అవమానించారు. నెహ్రూ ఇంటి పేరు ఎందుకు పెట్టుకోలేదని పార్లమెంట్‌లో మీరు (మోదీ) మమ్మల్ని ప్రశ్నించారు. మమ్మల్ని దారుణంగా అవమానించినా ఏ జడ్జి కూడా మీకు రెండేళ్ల జైలు శిక్ష విధించలేదు. పార్లమెంట్ నుంచి అనర్హత వేటు వేయలేదు. రాహుల్ నిజమైన దేశ భక్తుడు. అందుకే అదానీ గ్రూప్ సాగించిన లూటీపై ప్రశ్నించాడు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ బాగోతాలపై నిలదీశాడు. మీ మిత్రుడు గౌతమ్ అదానీ పార్లమెంట్ కంటే గొప్పవాడా? అధికార దాహమున్న వ్యక్తుల ముందు మేం తల వంచే ప్రసక్తే లేదు. ఏం చేసుంటారో చేసుకోండి!''

– ప్రియాంకాగాంధీ వాద్రా, కాంగ్రెస్ నాయకురాలు

వయనాడ్ ఖాళీ

లోక్‌సభలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కేరళలోని వయనాడ్ స్థానం ఖాళీ అయినట్టు లోక్‌సభ వెబ్‌సైట్ పేర్కొంది. ఎన్సీపీ ఎంపీ మహ్మద్ ఫైజల్‌పై హత్యా యత్నం నేరం రుజువై పదేళ్ల జైలు శిక్ష పడటంతో లక్షద్వీప్, కాంగ్రెస్ ఎంపీ సంతోఖ్ సింగ్ చౌదరి మృతితో జలంధర్ (పంజాబ్) స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. 2019లో వయనాడ్‌తో పాటు గాంధీల కంచుకోట అయిన యూపీలోని అమేథీ నుంచి కూడా పోటీ చేసిన రాహుల్ అక్కడ బీజేపీ నేత స్మృతీ ఇరానీ చేతిలో ఓటమి చూవిచూశారు.

పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్ష, పార్లమెంట్ సెక్రటేరియట్ వేసిన అనర్హత వేటుపై న్యాయ పోరాటానికి ప్రతిపక్ష కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. అనర్హత వేటు నుంచి బయట పడి, ఎంపీగా కొనసాగడంతో పాటు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే రాహుల్ ముందు రెండు మార్గాలున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు. తీర్పును పై కోర్టు కొట్టివేస్తే అనర్హత వేటూ రద్దవుతుంది. కనీసం జైలు శిక్షను రెండేళ్ల కంటే తగ్గించినా ఊరటే. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లు, అంతకు మించి జైలుశిక్ష పడితేనే అనర్హత వేటు వర్తిస్తుంది. కనుక సూరత్ కోర్టు విధించిన జైలు శిక్షను రద్దు చేసేలా, రెండేళ్ల కంటే తగ్గించేలా పై కోర్టులో వాదించి నెగ్గాల్సి ఉంటుంది. లేదంటే కనీసం శిక్ష అమలుపై స్టే తెచ్చుకున్నా ఎంపీ పదవిని కాపాడుకోవచ్చు. రాబోయే లోక్‌

రాహుల్ ముందు 2 మార్గాలు

సభ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. రాహుల్ అప్పీలును పై కోర్టు తిరస్కరిస్తే మాత్రం మరో ఎనిమిదేళ్ల దాకా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదు. ఇది క్రిమినల్ కేసు కావడంతో నేరుగా గుజరాత్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించకపోవచ్చని తెలుస్తోంది. తొలుత సూరత్ సెషన్స్ కోర్టులో అప్పీల్ దాఖలు చేస్తారని, అక్కడ ఊరట దక్కకపోతే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నట్లు సమాచారం. హత్యాయత్నం కేసులో దోషిగా తేలి, జైలుశిక్ష పడిన లక్షద్వీప్ ఎంపీ మొహమ్మద్ ఫైజల్‌పై లోక్‌సభ సెక్రటేరియట్ ఈ ఏడాది జనవరిలో అనర్హత వేటు వేసింది. లక్షద్వీప్ లోక్‌సభ స్థానం ఖాళీ అయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఉప ఎన్నిక కోసం నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. ఇంతలో మొహమ్మద్ ఫైజల్‌కు విధించిన జైలు శిక్షపై కేరళ హైకోర్టు స్టే విధించింది. దీంతో ఉప ఎన్నిక నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం రద్దు చేసింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం


అదానీ అంశంపై జేపీసీతో దర్యాప్తు చేయించాలని, దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ నిరసన ర్యాలీ చేపట్టిన 40 మంది ప్రతిపక్ష ఎంపీలను పోలీసులు నిర్బంధించారు. పార్లమెంట్ హౌస్ నుంచి విజయ్ చౌక్‌కు ర్యాలీగా వెళ్లిన ప్రముఖుల్లో కేసీ వేణుగోపాల్, ఆధిర్ రంజన్ చౌధురి, కె.సురేశ్, మాణిక్యం ఠాగోర్ తదితరులు ఉన్నారు. వీరంతా నిషేధాజ్ఞలు ఉల్లంఘించారని పోలీసులు చెప్పారు. సెక్షన్ 144ను ఉల్లంఘించి ర్యాలీ చేపట్టిన 40 మంది ఎంపీలను అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అంతకుముందు విజయ్‌చౌక్ వద్ద కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే తదితర నేతలు మాట్లాడారు. ర్యాలీలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, శివసేన ఉద్ధవ్ వర్గం, జేడీయూ, ఆప్ నేతలు పాల్గొని 'వుయ్ డిమాండ్ జేపీసీ', 'సేవ్ ఎల్ఐసీ', 'డెమోక్రసీ ఇన్ డేంజర్' అన్న ప్లకార్డులను ప్రదర్శించారు.



వేటును నిరసిస్తూ విపక్షాల ర్యాలీ

రాహుల్ నోరు నొక్కేందుకే: కాంగ్రెస్
సోనియా సహా అగ్ర నేతల అత్యవసర భేటీ

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. దీనిపై దేశవ్యాప్తంగా 'జనాందోళన్'కు పిలుపునిచ్చింది. రాహుల్ సభ్యత్వంపై వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ వెలువడగానే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ సహా కాంగ్రెస్ ముఖ్య నేతలంతా శుక్రవారం సాయంత్రం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. రాహుల్ నోరు నొక్కేందుకే అధికార బీజేపీ ఇలా వాయు వేగంతో చర్యలకు దిగిందని తీర్మానించారు. వేటుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని, మోదీ సర్కారు నిరంకుశ వైఖరిపై నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల విభాగాలు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయనున్నాయి. రాహుల్‌కు విపక్షాల సంఘీభావాన్ని ఈ సందర్భంగా కాంగ్రెస్ స్వాగతించింది. ''దీనిపై ఐక్యంగా పోరాడదాం. ఆందోళనల్లో మీరు కూడా కలిసి రండి'' అంటూ ప్రతిపక్ష పార్టీలకు పిలుపునిచ్చింది. భేటీలో ప్రియాంక, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర సంస్థల దుర్వినియోగంపై
ఏప్రిల్ 5న విచారణ: సుప్రీం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం రాజకీయ విరోధులకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలను ఏకపక్షంగా వాడుకుంటోందంటూ 14 ప్రతిపక్ష పార్టీలు వేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 5వ తేదీన విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. డీఎంకే, ఆర్జేడీ, బీఆర్ఎస్, టీఎంసీ, ఎన్సీపీ, జేఎంఎం, జేడీయూ, సీపీఎం ఎస్పీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పార్టీలు వేసిన పిటిషన్‌పై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం వాదనలు వింది. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో 95% ప్రతిపక్ష పార్టీల నేతలపై ఉన్నవేనని పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వి తెలిపారు.

రాహుల్‌కు జైలు శిక్ష గురించి తెలిసింది: ఐరాస

ఐక్యరాజ్యసమితి: ''కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష పడిన విషయం మా అవగాహనలో ఉంది. భారత్‌లోని పరిణామాలపై ఈ దశలో మా స్పందన ఇదే'' అని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. ఐరాస చీఫ్ ఆంటోనియో గుటెరస్ ప్రతినిధి ఫర్హాన్ హక్ గురువారం మీడియాతో మాట్లాడారు. భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి గుటెరస్ ఆందోళన చెందుతున్నారా అని అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.

వేటు రాజ్యాంగబద్ధమేనా?

రాహుల్ లోక్‌సభ సభ్యత్వం రద్దు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేటు రాజ్యాంగబద్ధమేనని కొందరు, లోక్‌సభ సెక్రటేరియట్ సరైన నిర్ణయం తీసుకోలేదని మరికొందరు అంటున్నారు. 2014 నాటి లిల్లీ థామస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన ప్రజాప్రతినిధులు వెంటనే అనర్హతకు గురవుతారని వెల్లడించింది. శిక్ష పడిన మర్నాడే రాహుల్‌పై వేటుకు ఈ తీర్పు దోహదపడినట్లు తెలుస్తోంది. అయితే 2018 నాటి లోక్‌ప్రహరీ వర్సెస్ భారత ఎన్నికల సంఘం కేసులో సుప్రీంకోర్టు మరో తీర్పు ప్రకటించింది. అనర్హత వేటు పడిన ప్రజాప్రతినిధిపై అభియోగాలను పై కోరుటు కొట్టేస్తే సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. శిక్ష రద్దయితే వేటూ రద్దవుతుందని తెలియజేసింది. రాహుల్‌పై వేటు విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 102(1)(ఈ), ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3)ని లోక్‌సభ సెక్రటేరియట్ ఉదాహరించింది. వీటి ప్రకారం రెండేళ్లకు మించి జైలు శిక్ష పడిన సభ్యులపై శిక్షాకాలం ముగిసిన తర్వాత ఆరేళ్ల దాకా ఎన్నికల్లో పోటీ చేయకుండా వేటు వేయవచ్చు. కానీ ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4) ప్రకారం శిక్ష పడిన 3 నెలల తర్వాత మాత్రమే అనర్హత ప్రక్రియ ప్రారంభం కావాలి. ఈలోగా శిక్షపడిన సభ్యుడు పై కోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. కింది కోర్టు తీర్పును పై కోర్టు కొట్టివేసే అవకాశం ఉంది. కానీ, రాహుల్‌పై వెంటనే వేటు వేయడం గమనార్హం. ఇలా శిక్ష పడిన మరుసటి రోజే సభ్యులపై అనర్హత వేటు వేసిన దాఖలాలు గతంలో లేవు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951లోని సెక్షన్ 8(4)ను లోక్‌సభ సెక్రటేరియట్ పట్టించుకోలేదని నిపుణులు చెబుతున్నారు. లోక్‌ప్రహరీ కేసు ప్రకారం.. రాహుల్‌కు పడిన జైలుశిక్షను పై కోర్టు రద్దు చేస్తే ఆయనపై అనర్హత వేటు సైతం రద్దవుతుంది.

అనర్హత వేటు పడ్డ నేతలు...!

న్యూఢిల్లీ: ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951, సెక్షన్ 8(3) ప్రకారం ఏదైనా క్రిమినల్ కేసులో దోషిగా తేలి, రెండేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష పడితే చట్టసభ సభ్యులు తమ సభ్యత్వాన్ని కోల్పోతారు. మోదీ ఇంటి పేరుని కించపరిచే వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో గతంలో ఎవరెవరికి శిక్ష పడి ఎంపీ, ఎమ్మెల్యే పదవుల్ని పోగొట్టుకున్నారో చూద్దాం.

లాలూ ప్రసాద్ యాదవ్: దాణా కుంభకోణం కేసులో సెప్టెంబర్ 2013లో దోషిగా తేలిన ఆర్జేడీ అధినేత పార్లమెంటు సభ్యత్వాన్ని కోల్పోయారు. బిహార్‌లోని సారన్ నియోజకవర్గం ఎంపీగా ఉన్న ఆయన పదవి పోగొట్టుకొని జైలు పాలయ్యారు. ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు.

జె.జయలలిత: ఏఐఏడీఎంకే దివంగత నాయకురాలు జె.జయలలిత కూడా జైలు శిక్ష పడిన కారణంగా అనర్హతకు గురయ్యారు. అక్రమాస్తుల కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడడంతో తమిళనాడు అసెంబ్లీ సెప్టెంబర్ 2014లో ఆమె శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఆమె పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. 2015లో కర్ణాటక హైకోర్టు జయలలితను నిర్దోషిగా ప్రకటించడంతో ఆమె తిరిగి సీఎం పదవి దక్కించుకున్నారు.

పి.పి. మహమ్మద్ ఫైజల్: హత్యాయత్నం కేసులో లక్షద్వీప్‌లో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ పి.పి.మహమ్మద్ ఫైజల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడడంతో ఆయనపై అనర్హత వేటు పడింది. అనంతరం జైలుశిక్షపై స్టే నేపథ్యంలో లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించాల్సి ఉంది.

ఆజమ్‌ఖాన్: విద్వేషపూరిత ప్రసంగాల కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడిన సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు ఆజమ్‌ఖాన్‌పై 2022 అక్టోబర్‌లో ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడింది.

అనిల్ కుమార్ సాహ్ని: రాజ్యసభ ఎంపీగా ఉండగా విమాన ప్రయాణాలు చేయకుండానే తప్పుడు టిక్కెట్లు సమర్పించి రూ.23.71 లక్షలు క్లెయిమ్ చేసుకున్న కేసులో బీహార్‌కు చెందిన అనిల్ కుమార్ సాహ్నికి మూడేళ్ల జైలు శిక్ష పడింది. శిక్ష పడిన సమయంలో అసెంబ్లీ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

విక్రమ్ సింగ్ సైని: 2013 నాటి ముజాఫర్‌నగర్ ఘర్షణల కేసులో దోషిగా తేలి రెండేళ్ల శిక్ష పడిన ఉత్తరప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సింగ్ సైని 2022 అక్టోబర్‌లో అనర్హతని ఎదుర్కొన్నారు.

ప్రదీప్ చౌధరి: హర్యానాలోని కాల్కా నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రదీప్ చౌధరికి దాడి కేసులో మూడేళ్ల జైలు శిక్ష పడింది. దీంతో 2021జనవరిలో హర్యానా అసెంబ్లీ ఎమ్మెల్యేగా ఆయనపై అనర్హత వేటు పడింది.

కులదీప్ సింగ్ సెంగార్: ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగార్ అత్యాచారం కేసులో దోషిగా తేలడంతో 2020 ఫిబ్రవరిలో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.

అబ్దుల్లా ఆజమ్‌ఖాన్: 15 ఏళ్ల క్రితం నాటి ధర్నా కేసులో రెండేళ్ల పాటు శిక్ష పడిన సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజమ్ ఖాన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో యూపీ ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడింది.

అనంత్ సింగ్: బీహార్‌లోని ఆర్జేడీ ఎమ్మెల్యే అనంత్ సింగ్ నివాసంలో మారణాయుధాలు లభ్యమైన కేసులో ఆయన దోషిగా తేలడంతో 2022 జులైలో శాసనసభ సభ్యత్వాన్ని కోల్పోయారు.



శత్రు నౌకల్ని అమాంతంగా ముంచేయవచ్చు.. వీటితో నౌకాశ్రయాలకు, నగరాలకూ ముప్పే

ప్రస్తుతం రష్యా వద్ద మాత్రమే ఈ సామర్థ్యం.. ఉత్తర కొరియా ప్రకటనతో ప్రకంపనలు

సునామీ పుట్టించే.. అండర్ వాటర్ డ్రోన్!

– సాక్షి, నేషనల్ డెస్క్

సునామీని పుట్టించే అణు సామర్థ్యమున్న అండర్ వాటర్ డ్రోన్ 'హెయిల్'ను విజయవంతంగా పరీక్షించినట్టు ఉత్తర కొరియా చేసిన ప్రకటన ప్రకంపనలు రేపుతోంది. దీని సాయంతో భారీ సునామీలు పుట్టించి తీరంలో నౌకాశ్రయాలనూ, సముద్ర మధ్యంలో శత్రు నౌకలను నాశనం చేయగల సామర్థ్యం తమకు సమకూరిందని అది చెబుతోంది. అదే నిజమైతే రష్యా తర్వాత ఈ సామర్థ్యమున్న రెండో దేశమవుతుంది. ఇలాంటి డ్రోన్లను ప్రయోగిస్తే సముద్ర మట్టం అనూహ్యంగా పెరిగి పరిసర ప్రాంతాలను పూర్తిగా ముంచెత్తుతుంది. దీనితో సముద్ర మధ్యంలో అయితే శత్రు నౌకలను నీట ముంచవచ్చు. అదే తీర ప్రాంతంలో ప్రయోగిస్తే సమీప నౌకాశ్రయాలతో పాటు నగరాలు, జనావాసాలు కూడా నామరూపాల్లేకుండా పోయే ప్రమాదముంది! కాకపోతే హెయిల్‌ను రష్యా అండర్ వాటర్ డ్రోన్ పొసెయిడాన్‌తో ఏ మాత్రమూ పోల్చలేం. ఎందుకంటే అత్యాధునిక హంగులతో కూడిన పొసెయిడాన్‌ను జలాంతర్గాముల నుంచీ ప్రయోగించవచ్చు. స్వయంచాలిత న్యూక్లియర్ ప్రొపెల్షన్ వ్యవస్థ సాయంతో ఎంతకాలమైనా ప్రయాణం చేయగల సత్తా దాని సొంతం. హెయిల్‌కు అంత సీన్ లేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికాతో సంయుక్త సైనిక విన్యాసాలు చేస్తున్న దక్షిణ కొరియాను బెదిరించేందుకే ఇలాంటి ప్రకటన చేసి ఉండవచ్చన్నది వారి విశ్లేషణ.

ఏమిటీ అండర్ వాటర్ డ్రోన్?

- వీటిని ఒకరకంగా చిన్నపాటి మానవరహితజలాంతర్గాములుగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా సముద్ర గర్భంలో వరుస పేలుళ్ల ద్వారా అతి పెద్ద రాకాసి అలల్ని పుట్టించి పరిసర ప్రాంతాలను నీట ముంచేస్తాయి. ఇవి స్వయంచాలితాలు. యుద్ధనౌకలు, లేదా ఇతర ప్రాంతాల నుంచి కంప్యూటర్లు, సెన్సర్ల ద్వారా వీటిని నియంత్రిస్తుంటారు. ఇలాంటి అండర్‌వాటర్ డ్రోన్లు 1950ల నుంచే ఉనికిలో ఉన్నట్టు బార్డ్ సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ ద డ్రోన్ చెబుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 250కి పైగా ఇలాంటి డ్రోన్లు వినియోగంలో ఉన్నట్టు అంచనా. మిలిటరీ డాట్‌కామ్ వివరాల మేరకు వీటిని జలాంతర్గాముల ద్వారా అమెరికా నేవీ 2015లో తొలిసారిగా మోహరించింది. ''ఇది ప్రమాదకరమైన పనులెన్నింటినో అండర్‌వాటర్ డ్రోన్ గుట్టు గా చక్కబెట్టగలదు. ఒకవైపు వీటిని ప్రయోగించి శత్రు లక్ష్యాలను ఛేదించవచ్చు. శత్రువు దృష్టిని అటువైపు మళ్లించి ప్రధాన జలాంతర్గామి తన ప్రధాన లక్ష్యం మీద మరింత మెరుగ్గా దృష్టి సారించవచ్చు. అంటే రెట్టింపు ప్రయోజనమన్న మాట''అని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.



పొసెయిడాన్.. రష్యా డ్రోన్..

- ఇది అణు సామర్థ్యమున్న సూపర్ టోర్పెడో. చరిత్రలో అతిపెద్ద టోర్పెడో కూడా ఇదే! నాటో దళాలు దీన్ని కాన్యాన్‌గా పిలిచే పొసెయిడాన్‌ను టోర్పెడో, డ్రోన్ రెండింటి క్రాస్ బ్రీడ్‌గా చెప్పవచ్చు. తొలి జత పొసెయిడాన్ టోర్పెడోలను విజయవంతంగా ఉత్పత్తి చేసినట్టు గత జనవరిలో రష్యా స్వయంగా ప్రకటించింది. వీటిని బెల్ గొరోడ్ అణు జలాంతర్గామిలో మోహరిస్తామని పేర్కొంది. అయితే పొసెయిడాన్ తయారీ గురించి రష్యా అధ్యక్షుడు పుతిన్ 2018లోనే ప్రకటన చేశారు. ''దీని రేంజ్ అపరిమితం. అంతేగాక సముద్రాల్లో అత్యంత అట్టడుగుల్లోకీ వెళ్లి దాడులు చేయగల సత్తా దీని సొంతం. పైగా ప్రస్తుతమున్న అన్ని టోర్పెడోల కంటే కొన్ని రెట్లు ఎక్కువ వేగంతో, అదే సమయంలో ఏమాత్రం శబ్దం చేయకుండా దూసుకెళ్తుంది. తనంతతానుగా ప్రమాదాన్ని గుర్తించి ప్రయాణ మార్గాన్ని మార్చేసుకోగలదు. కనుక దీన్ని శత్రువు నాశనం చేయడం దాదాపుగా అసాధ్యం. సముద్రంలో దీన్ని ఎదుర్కోగల ఆయుధమే లేదు''అని ధీమాగా పేర్కొన్నారు. రష్యాతో పాటు చైనా కూడా ఇలాంటివి తయారు చేసే పనిలో ఉందని అమెరికా అనుమానిస్తోంది. అయితే అమెరికా వద్ద ఇలాంటివి ఎప్పటినుంచో ఉన్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు!
- స్టేటస్–6 ఓషియానిక్ మల్టీపర్పస్ సిస్టంగా కూడా పిలిచే పొసెయిడాన్ గురించి తెలిసింది చాలా తక్కువ.
- దాదాపు ఆరడుగుల వ్యాసార్థం, 24 మీటర్ల పొడవు, 2 లక్షల పౌండ్ల బరువుండే దీన్ని అణు జలాంతర్గామి నుంచి ప్రయోగించవచ్చు.
- ఈ డ్రోన్లు ఎంత పెద్దవంటే అంతటి జలాంతర్గామిలో కేవలం ఆరంటే ఆరు మాత్రమే పడతాయట!
- ఇది అణు, సంప్రదాయ ఆయుధాలు రెండింటినీ మోసుకెళ్లగలదు.
- ఇందులో ఏకంగా ఓ అణు రియాక్టరే ఉంటుంది. దాని సాయంతో ఇది స్వయం చాలితంగా పని చేస్తుంది.
- పొసెయిడాన్ శత్రు యుద్ధ నౌకలను, తీర ప్రాంతాల్లోని లక్ష్యాలను నాశనం చేస్తున్నట్టున్న దృశ్యాలతో కూడిన వీడియోలను రష్యా రక్షణ శాఖ విడుదల చేసింది.
- అమెరికాలోని దాదాపు అన్ని తీర ప్రాంత నగరాలూ దీని పరిధిలోకి వస్తాయని రష్యా చెబుతోంది!

అణు డ్రోన్‌ను పరీక్షించాం: ఉత్తర కొరియా

భారీ రేడియో ధార్మిక సునామీని పుట్టించగల అణుసామర్థ్యంతో కూడిన అండర్ వాటర్ డ్రోన్ 'హెయిల్'ను విజయవంతంగా పరీక్షించినట్టు ఉత్తర కొరియా ప్రకటించింది! ఈ ఆందోళనకర పరిణామం కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. ''ఈ డ్రోన్‌ను తీరం వద్ద మోహరించవచ్చు. నౌకలపై సముద్రం లోపలికి తీసుకెళ్లి ప్రయోగించవచ్చు. నీటి లోపల ఇది సృష్టించే పేలుడు దెబ్బకు పుట్టుకొచ్చే రేడియో ధార్మిక సునామీ నౌకాశ్రయాలతో పాటు నడి సముద్రంలో శత్రు యుద్ధ నౌకలను కూడా తుత్తునియలు చేయగలదు''అని ఉత్తర కొరియా అధికార వార్తా సంస్థ కేసీఎన్ఏ చెప్పుకొచ్చింది. ''ఈ దిశగా మూడు రోజులుగా సాగుతున్న ప్రయోగాలను అధ్యక్షుడు కిమ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు'' అని తెలిపింది. టోర్పెడో వంటి పరికరం పక్కన కిమ్ నవ్వుతున్న ఫొటోను ఉత్తరకొరియా పత్రిక రొండొంగ్ సిన్మున్ ప్రచురించింది. ఆ పరికరమేమిటనేది వివరించలేదు. సముద్ర జలాలు ఉవ్వెత్తున లేచి పడుతున్న ఫొటోలను కూడా ముద్రించింది. ''ఈ అలలు డ్రోన్ మోసుకెళ్లిన అణ్వాయుధం పేలుడు ఫలితం. మంగళవారం ప్రయోగించిన ఈ డ్రోన్ నీటి అడుగున 60 గంటల పాటు ప్రయాణించి, 150మీటర్ల లోతులో లక్ష్యాన్ని ఛేదించింది''అని పేర్కొంది. 2012 నుంచి అభివృద్ధి చేస్తున్న ఈ డ్రోన్‌ను గత రెండేళ్లలో 50 సార్లకు పైగా పరీక్షించి చూసినట్లు తెలిపింది. అయితే ఉత్తర కొరియా ప్రకటనలో విశ్వసనీయతపై నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హెయిల్ అంటే కొరియా భాషలో సునామీ. ఈ డ్రోన్ గురించి ఉత్తర కొరియా అధికారికంగా వెల్లడించడం ఇదే తొలిసారి! ఉత్తర కొరియా దుందుడుకు చర్యలకు మూల్యం తప్పదంటూ దక్షిణ కొరియా అధ్యక్షుడు హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఈ పరీక్ష గురించిన ప్రకటన వెలువడింది!

కొరియా సముద్ర జలాల్లో విమానవాహక నౌకలను మోహరిస్తామని అమెరికా ప్రకటించడం తెలిసిందే.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం । 25 । మార్చి । 2023

అందం.. ఆభరణం



బొమ్మనహళ్లి: నగరంలోని షెరటాన్ గ్రాండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వినూత్న డిజైన్లతో కూడిన అభరణాల ప్రదర్శనను శుక్రవారం కన్నడ నటి నిశ్చికా నాయుడు ప్రారంభించారు. సుమారు 50 రకాల డిజైన్లతో దేశంలోనే పేరు పొందిన ఆభరణాల తయారీ సంస్థలు సిద్ధం చేసిన ఆభరణాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ ఆభరణ ప్రదర్శన, వీక్షణతో పాటు కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించామని ప్రదర్శన నిర్వాహకులు, గోల్డెన్ కీపర్ సంస్థ జగదీశ్, హేమలత తెలిపారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



మైసూరు: మైసూరు విశ్వ విద్యాలయం నూతన వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఎస్‌కే లోకనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీవీ పరిపాలన కార్యాలయానికి చేరుకున్న లోకనాథ్ వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలువురు ప్రొఫెసర్లు, సిబ్బంది ఆయనను అభినందించారు.

పడిపోయిన కేఆర్‌ఎస్ డ్యాం నీటి మట్టం

దొడ్డబళ్లాపురం: మండ్య జిల్లా శ్రీరంగపట్టణం తాలూకాలోని కేఆర్‌ఎస్ డ్యాం నీటిమట్టం 100 అడుగులకు పడిపోయింది. 4 సంవత్సరాల తరువాత డ్యాం నీటి మట్టం ఈ స్థాయికి పడిపోవడం మొదటిసారి. 124.80 అడుగుల గరిష్ట స్థాయి నీటిమట్టం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 100 అడుగుల వరకూ మాత్రమే నీరు కలిగిఉంది. జూన్ వరకూ తాగునీటికి ఢోకాలేదంటున్న అధికారులు వర్షాలు ఆలస్యంగా వస్తే మాత్రం తాగునీటికి తిప్పలు తప్పవంటున్నారు. ఇక మే నెల చివరికి వ్యవసాయానికి నీరందించడం కష్టంగా మారింది. దీంతో డ్యాం పరిసరప్రాంతాల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కామాంధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

శివమొగ్గ : మైనర్ బాలికను లైంగికంగా వేధించిన యువకుడికి సంవత్సరాల జైలు శిక్ష, రూ.1.10లక్షల జరిమానా విధిస్తూ పోక్సో న్యాయాలయం తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. భద్రావతి తాలూకాకు చెందిన 25 సంవత్సరాల యువకుడు 2019 సంవత్సరంలో 13 సంవత్సరాల మైనర్ బాలికను లైంగికంగా వేధించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు భద్రావతి హళేనగర పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈకేసు విచారణకు రాగా నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. దీంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ అదనపు జిల్లా న్యాయాలయం ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మోహన్‌జీ ఎస్. తీర్పు వెలువరించారు. ప్రభుత్వం తరపున న్యాయవాది హరిప్రసాద్ వాదనలు వినిపించారు.

ఏసీ మంజునాథ్ సస్పెన్షన్‌పై క్యాట్ స్టే



ఏసీ మంజునాథ్

దొడ్డబళ్లాపురం: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురైన రామనగర ఏసీ మంజునాథ్ కేఏటీ(క్యాట్)ని ఆశ్రయించడంతో సస్పెన్షన్‌పై స్టే ఇచ్చింది. ఈనెల 17న ప్రభుత్వం మంజునాథ్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ మంజునాథ్ క్యాట్‌ని ఆశ్రయించారు. లోకాయుక్త దాడిచేసి ఏడాది గడిచిన తరువాత తనను సస్పెండ్ చేయడం సరి కాదని వాదించారు. వాదనలు విన్న కేఏటీ సస్పెన్షన్‌పై స్టే విధించి విచారణను ఏప్రిల్ 19కి వాయిదా వేసింది.

అంబులెన్స్‌ల ప్రారంభం

మండ్య : రూ.96లక్షల ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన నాలుగు అంబులెన్స్‌లను ఎంపీ సుమలత శుక్రవారం కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. శ్రీరంగ పట్టణం, మద్దూరు, కేఆర్ పేట, పాండవపురలకు వీటిని కేటాయించారు.

ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధం



దావణగెరెలో సభా వేదిక ఏర్పాట్లు



పోలీసుల బందోబస్తు

- నేడు బెంగళూరు, చిక్కబళ్లాపురం, దావణగెరెలో పలు కార్యక్రమాలు
- హాజరుకానున్న నరేంద్రమోదీ
- భారీగా భద్రతా ఏర్పాట్లు

యశవంతపుర: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం చేపట్టే రాష్ట్ర పర్యటనకు పోలీసుశాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. బెంగళూరు, చిక్కబళ్లాపురం, దావణగెరెలో జరిగే పలు కార్యక్రమాల్లో మోదీ పాల్గొననున్నారు. ప్రధాని మోదీ ఉదయం 10.10గంటలకు హెచ్‌ఏఎల్ విమానాశ్రయం చేరుకుంటారు. 10.35 గంటలకు చిక్కబళ్లాపురం వెళ్తారు. 10.45గంటలకు మధుసూదన్ సాయి మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. 12.55 గంటలకు వైట్‌ఫీల్డ్ మెట్రో స్టేషన్‌కు విచ్చేసి 1.00గంటలకు వైట్‌ఫీల్డ్, కేఆర్‌పురం మెట్రో రైలు మార్గాన్ని ప్రారంభిస్తారు. అదే మార్గంలో ప్రయాణిస్తారు. 1.50 గంటలకు హెలికాప్టర్ ద్వారా దావణగెరెకు వెళ్తారు. విజయసంకల్పరథయాత్ర ముగింపు సందర్భంగా 3.50 గంటలకు జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 5.15గంటలకు శివమొగ్గ ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 5.55కు ఢిల్లీకి బయల్దేరి వెళ్తారు. మోదీ పర్యటన సందర్భంగా 8 మంది ఐపీఎస్ స్థాయి అధికారులతో పాటు 4 వేల మంది పోలీసులతో బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు దావణగెరె జిల్లా ఎస్పీ సీబీ రిష్యంత్ తెలిపారు. భారీ వాహనాలను దావణగెరె నగరలోకి నిషేధించినట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి సభకు కార్యకర్తలు విచ్చేసే వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- ఏ క్షణంలో అయినా విధానసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్
- జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలు

బనశంకరి: రాష్ట్ర విధానసభ ఎన్నికలకు ఏ క్షణంలో అయినా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఎన్నికల నియమావళి అమలుకు సిద్ధంగా ఉండాలని జిల్లాకలెక్టర్లుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచించింది. ఎన్నికలు ఏప్రిల్ లేదా మేనెలలో జరుగుతాయని, ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు, బీబీఎంపీ కమిషనర్‌కు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి తెలిపారు. రాజకీయ పార్టీలు సార్వజనీక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. కోడ్ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను జిల్లా కలెక్టర్లుకు పంపించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే మద్యం, డబ్బు, బహుమతుల రవాణాను అడ్డుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయపార్టీల సభలు సమావేశాలు నిర్వహించకుండా చూసుకోవాని తెలిపారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు, వ్యయం పట్ల నిఘా పెట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సూచించారు.

ఎన్నికల్లో అక్రమాలపై డేగకన్ను
టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిన ఐటీ శాఖ

శివాజీనగర: ఓటర్లకు ప్రలోభాలకు పెట్టే వారిపై డేగకన్ను పెట్టిన ఆదాయ పన్నుల (ఐటీ) శాఖ అధికారులు ఫిర్యాదు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల నాయకులు బంగారు, మద్యం, నగదుతో పాటు ఎలాంటి ఆశలు చూపినా ఫిర్యాదు చేయాలని విన్నవించారు. ఫిర్యాదు చేసేవారి పేర్లను రహస్యంగా ఉంచుతామన్నారు. పారదర్శకంగా, అవినీతి రహిత ఎన్నికలు జరిపేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఫిర్యాదు చేసేవారు టోల్ ఫ్రీ నంబర్ 1800-425-2115, ఫోన్ నంబర్ 080-22861126, సెల్ నెంబర్ 8277422825, 8277413614కు సమాచారం ఇవ్వాలన్నారు.

వ్యక్తిని అపహరించి రూ.45 లక్షల డిమాండ్

- ముగ్గురు పోలీసుల అరెస్ట్
- మారతహళ్లి పీఎస్ఐ పరారీ

బనశంకరి: డబ్బు కోసం ఓ వ్యక్తిని అపహరించి రూ.45 లక్షలకు డిమాండ్ పెట్టిన కేసు దర్యాప్తు వేగవంతం చేసిన నగర పోలీసుల శాఖ ప్రాథమిక నివేదిక ఆధారంగా పీఎస్ఐతో పాటు ముగ్గురు పోలీసులను శుక్రవారం వైట్‌ఫీల్డ్ విభాగ డీసీపీ గిరీశ్ సస్పెండ్ చేసి దర్యాప్తునకు ఆదేశించారు. బాగలూరు నివాసి రామాంజనేయ అనే వ్యక్తిని అపహరించి డబ్బు డిమాండ్ చేసిన మారతహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రంగేశ్, హెడ్‌కానిస్టేబుల్ హరీశ్, మహదేవ్, మహేశ్‌లను డీసీపీ గిరీశ్ సస్పెండ్ చేశారు. రామాంజనేయ పులిచర్మాలు, గోర్లు విక్రయానికి ప్రయత్నించారు. ఇతడి అనుచరుడైన సిద్దమల్లప్ప అనే వ్యక్తి పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా ఉన్న షబ్బీర్, జాకీర్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయం షబ్బీర్ ఎస్ఐ రంగేశ్ బృందానికి తెలిపారు. దాడి చేసిన పోలీస్‌లు రామాంజనేయ వద్ద గల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించగా అవి నకిలీ పులిచర్మం, గోర్లుగా తేలాయి. నకిలీ పులిచర్మం, పులి గోర్లు అని తెలియగానే కోపోద్రిక్తుడైన ఎస్ఐ రంగేశ్ పట్టుబడిన రామాంజనేయను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా కారులో నగరమంతా తిప్పాడు. రెండు రోజుల అనంతరం మారతహళ్లి పోలీస్‌స్టేషన్ పక్కన ఇంట్లో రామాంజనేయను బంధించాడు. రామాంజనేయ తండ్రి శివరామయ్యకు ఎస్ఐ రంగేశ్ ఫోన్ చేసి విషయం తెలిపి మీ కుమారుడిపై కేసు నమోదు చేయకూడదంటే రూ.45 లక్షలు ఇవ్వాలని చెప్పి ఫోన్ కట్ చేశాడు. కుమారుడిని కిడ్నాప్ చేశారని శివరామయ్య 21న బాగలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు హెడ్‌కానిస్టేబుల్‌తో పాటు ఇద్దరు పోలీసులను అరెస్ట్ చేశారు. ఇదే సమయంలో ఎస్ఐ రంగేశ్ పరారయ్యాడు.

పోలీస్ కమిషనర్ హెచ్చరిక

పోలీస్ అధికారులు, సిబ్బంది అక్రమ వ్యవహారాల్లో భాగస్వాములైతే కఠినచర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీస్‌లు ఓ వ్యక్తిని అపహరించి రూ.45 లక్షలకు డిమాండ్ చేసిన కేసుకు సంబంధించి స్పందించిన కమిషనర్ ఇలాంటి అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎస్ఐ పరారీలో ఉండగా ఇతడి కోసం గాలిస్తున్నామని దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

రూ.90 కోట్ల డ్రగ్స్ ధ్వంసం



డ్రగ్స్‌ను ధ్వంసం చేయడానికి సంచుల్లో తరలిస్తున్న దృశ్యం

బనశంకరి: నగరంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పరిధిలో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్న రూ.90 కోట్ల విలువచేసే డ్రగ్స్‌ను మాదకద్రవ్యాల అక్రమరవాణా, జాతీయ భద్రతా సమావేశం సందర్భంగా డాబస్ పేట్ పారిశ్రామిక ప్రదేశంలో శుక్రవారం ధ్వంసం చేశారు. 4110 కిలోల గంజాయి, 11కిలోల గంజా ఆయిల్, 22 కిలోల హాశీశ్ ఆయిల్, 8 కిలోల అఫీము, 5.5 కిలోల చరస్, 62.7 కిలోల ఎండీఎంఏ పౌడర్, 8073 ట్యాబ్లెట్‌ను కాలుష్యనియంత్రణ మండలి అధికారుల సమక్షంలో కాల్చివేశారు.



బెంగళూరులో కనిపించిన నెలవంక

రంజాన్ మాసం ప్రారంభం

యశవంతపుర: ముస్లింల పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. నెల రోజుల పాటు ఉపవాసం అచరిస్తారు. రాజధాని బెంగళూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు ఉదయం 3:30 గంటల నుంచి ఉపవాసం అచరించటం ప్రారంభించారు. నెల రోజుల పాటు జరిగే ఉపవాసం వేసవిలో ప్రారంభమైంది. ఇందుకు మసీదుల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. సూర్యోదయానికి ముందు, అస్తమయం తరువాత ఆహారం తీసుకోనున్నారు. ఉదయం ఐదు గంటలకు, మధ్యాహ్నం 1:30, సాయంత్రం 6:30, రాత్రి 8 గంటలకు మసీదుల్లో నమాజ్ చేయనున్నారు.

యడియూరప్ప ఇంటికి అమిత్‌షా



యడియూరప్ప నివాసంలో అల్పాహారం తీసుకుంటున్న అమిత్ షా, బొమ్మై, మంత్రులు

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో బీజేపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు పార్టీ హైకమాండ్ కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో పార్టీ ఢిల్లీ పెద్దల రాకపోకలు జోరందుకున్నాయి. నెల రోజులుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి విచ్చేసి నేతలతో పలుసార్లు భేటీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం బెంగళూరుకు చేరుకున్న ఆయన శుక్రవారం ఉదయం మాజీ సీఎం బీ.ఎస్.యడియూరప్ప ఇంటికి వెళ్లారు. యడియూరప్ప, సీఎం బొమ్మైతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అమిత్‌షా యడియూరప్పకు అధిక ప్రాధాన్యత నిస్తూ ఆయన ఇంటికి వెళ్లడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. యడియూరప్ప తనయుడు విజయేంద్ర అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. యడియూరప్ప ఇంటిలో అల్పాహారం తీసుకున్న తర్వాత యడియూరప్ప, సీఎం బసవరాజ బొమ్మై, నేతలు అరుణ్‌సింగ్, నళీన్‌కుమార్ కటీల్, ఉపాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, మంత్రులు గోవింద కారజోళ, బీ.శ్రీరాములు, రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాజేశ్‌తో అమిత్‌షా చర్చించారు. కొంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ చేరుతున్నారనే సమాచారాన్ని ప్రస్తావిస్తూ అసంతృప్తులతో మాట్లాడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపనలు చేయాలని సూచించినట్లు తెలిసింది.

కర్ణాటకను కాంగ్రెస్ ఏటీఎంగా వాడుకుంది

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపణ

సాక్షి బెంగళూరు: అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కర్ణాటకను ఏటీఎంలా ఉపయోగించుకుందని, వారి చరిత్రే ఒక అవినీతి చరిత్ర అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. కర్ణాటక అభివృద్ధి చెందాలన్నది ప్రధాని నరేంద్ర మోదీ కల అని, అందుకు అనుగుణంగా మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చి ప్రధాని నరేంద్రమోదీకి మద్దతు పలకాలని ఆయన ప్రజలను కోరారు. బెంగళూరు కొమ్మఘట్టలో సహకార సమృద్ధి సౌధకు శంకుస్థాపన చేసిన అనంతరం రూ. 800 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. సహకార రంగ పితామహుడు సిద్దనగౌడ చిత్రపటానికి అమిత్ షా పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అయినా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే అక్కడ ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఖజానాగా మారిపోతోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కావాలా? లేక రాహుల్ గాంధీ నేతృత్వంలోని అవినీతి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కావాలా అనేది మీరే నిర్ణయించుకోండి అంటూ అమిత్ షా ప్రజలను కోరారు. పీఎఫ్ఐని ఇటీవల మోదీ నిషేధించారని, కానీ గతంలో సిద్ధరామయ్య ఇదే పీఎఫ్ఐ కేసులన్నింటిని ఉపసంహరించుకున్నారని గుర్తు చేశారు. సీఎం బసవరాజు బొమ్మై, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప, మంత్రి ఎస్‌టీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపుపై జాప్యమెందుకు ?

- బెంగళూరులో కాంగ్రెస్ చలో రాజ్‌భవన్
- పలువురు నేతల అరెస్ట్



ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సర్కిల్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివాజీనగర: షెడ్యూల్డ్ కులాలు, తెగలకు రిజర్వేషన్లు పెంచుతామని అధికార బీజేపీ తప్పుడు వాగ్దానాలు చేసి దళితులను మోసం చేస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నగరంలో చలో రాజ్‌భవన్ కార్యక్రమం చేపట్టారు.

కేపీసీసీ కార్యాలయం నుంచి ర్యాలీ ఆరంభించి రాజభవన్ ముట్టడికి ప్రయత్నించిన సిద్దరామయ్య, డీ.కే.శివకుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ధర్నాలో ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు డీ.కే.శివకుమార్, విధానపరిషత్ ప్రతిపక్ష నాయకుడు బీ.కే.హరిప్రసాద్, కార్యాధ్యక్షులు రామలింగారెడ్డి, సలీం అహమ్మద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌కు సంబంధించి షెడ్యూల్డ్ 9కు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓట్ల కోసం తప్పుడు హామీలు

ప్రతిపక్ష నాయకుడు సిద్దరామయ్య మాట్లాడుతూ... రిజర్వేషన్లు పెంచిన విషయానికి సంబంధించి 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఇన్ని రోజులు జాప్యం చేసినందుకు రిజర్వేషన్ పెంపునకు ఆదేశాలు ఎప్పుడయ్యాయని ప్రశ్నించారు. కేవలం ఓటు కోసం ప్రజలను తప్పుదారి పట్టించి మోసం చేస్తున్నారని విమర్శించారు.

దళితులకు మోసం:

ఇదే సమయంలో మాట్లాడిన డీ.కే.శివకుమార్, దళితులను ఎంతవరకు మోసం చేస్తారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా నడచుకుంటోదని మండిపడ్డారు. మాజీ డీసీఎం జీ.పరమేశ్వర్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలకు బీజేపీ నాయకులు మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ధర్నా చేపడుతున్నామని తెలుసుకొని రాత్రికి రాత్రి కేంద్ర ప్రభుత్వ సిఫారసుకు పంపారని ధ్వజమెత్తారు. రాజభవన్ ముట్టడికి ప్రయత్నించిన కాంగ్రెస్ నాయకులను ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సర్కిల్ వద్ద అడ్డుకొన్న పోలీసులపై మండిపడ్డారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సర్కిల్ వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు సిద్దరామయ్య, డీ.కే. శివకుమార్‌తో పాటు పలువురి నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా క్వీన్స్ రోడ్డులో గంటకు పైగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

తాయిలాలపై కొరడా



స్వాధీనం చేసుకున్న బియ్యం

శివమొగ్గ: విధానసభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆహార కిట్లు, వంటసామగ్రి పంచుతున్నారు. అయితే అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు. శివమొగ్గ జిల్లాలో పలు చోట్ల ఎన్నికల అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. దాఖలాలు లేకుండా రవాణా చేస్తున్న డబ్బు, ధాన్యం తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అధికారి మీడియాకు తెలిపారు. తీర్థహళ్లి తాలూకా ఆగుంబె పోలీస్ స్టేషన్ పరిధిలో చెక్ పోస్ట్ వద్ద లారిలో రవాణ చేస్తున్న 29.70 లక్షల విలువైన 1100 నాన్‌స్టిక్ దోశ పాన్, శివమొగ్గ నగరం వినోభ నగర పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 8 లక్షల విలువైన 30 టన్నుల పప్పు దినుసులు, కోటె పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.7 లక్షల విలువైన 10 టన్నుల బియ్యం, దొడ్డపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.10 లక్షల విలువైన చీరలు, కుక్కర్లు, 25 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

సిగరెట్ విషయంలో స్నేహితుల మధ్య గొడవ

- కత్తిపోట్లకు గురై ఒకరి మృతి



శివాజీనగర: సిగరెట్ విషయంలో స్నేహితుల మధ్య గొడవ కత్తిపోట్లకు దారితీయగా ఒకరు మృతిచెందారు. ఉప్పారపేట గణేశ ఆలయ సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. హతుడిని కలబురిగికి చెందిన మల్లినాథ్ బిరాదర్ (36)గా పోలీసులు గుర్తించారు. వివరాలు.. ఉత్తర కర్ణాటకకు చెందిన మల్లినాథ్ బిరాదర్, మంజునాథ్, చిక్కమగళూరుకు చెందిన గణేశ్ స్నేహితులు. వంట, ఇతర చిన్నపాటి పనులు చేసుకొని చేతికి వచ్చిన సొమ్ముతో మద్యం సేవించి రాత్రి సమయంలో మెజిస్టిక్ చుట్టు పక్కల ప్రాంతాల్లో నిద్రించేవారు. బుధవారం రాత్రి ముగ్గురి మధ్య సిగరెట్ తాగే విషయానికి గొడవ జరిగింది. మంజునాథ్, మల్లినాథ్ బిరాదర్ గణేశ్‌పై దాడి చేశారు. గురువారం ముగ్గురూ ఎప్పటిలాగానే పనులకు వెళ్లారు. సాయంత్రం మళ్లీ కలసి మద్యం సేవించి గణేశ్ ఆలయం వద్దకు వెళ్లారు. బుధవారం జరిగిన గొడవ చర్చకు వచ్చింది. ఆవేశానికి గురైన గణేశ్ చాకుతో మంజునాథ్, మల్లినాథ్ బిరాదర్ కడుపులో పొడిచాడు. మల్లినాథ్ బిరాదార్ మృతిచెందగా, మంజునాథ్‌ను ఆస్పత్రికి తరలించారు. గణేశ్‌కు గాయాలు కాగా, చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. ఉప్పారపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

కార్యకర్తపై చేయి చేసుకున్న సిద్దు

శివాజీనగర: విపక్షనేత, మాజీ సీఎం సిద్దరామయ్య ఓ కార్యకర్తపై చేయి చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం బెంగళూరులోని ఆయన ఇంటివద్ద జరిగింది. తమ నాయకుడికి టికెట్ ఇవ్వాలని దావణగెరె జిల్లా హరిహరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు సిద్దరామయ్య నివాసానికి వచ్చారు. అక్కడే మహిళా కార్యకర్తలు కూడా ఉన్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. అక్కడే ఉన్న సిద్దు ఓ కార్యకర్త చెంపపై కొట్టారు. అతన్ని దావణగెరె జిల్లా హరిహరకు చెందిన కార్యకర్తగా గుర్తించారు. ఓ మహిళా కార్యకర్తను తోసినందుకు కోపగించుకొన్న సిద్దరామయ్య కార్యకర్తపై చేయిచేసుకున్నట్లు సమాచారం.

ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది హైకమాండ్ నిర్ణయిస్తుంది

- బీ.వై.విజయేంద్ర

శివాజీనగర: తాను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని, ఇందులో ఎలాంటి గందరగోళం లేదని రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర తెలిపారు. శుక్రవారం కావేరి నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, తాను శికారిపుర నుంచి పోటీ చేయాలని ఆశిస్తున్నాను. ఫైనల్‌గా పార్టీ అధినాయకులు ఎక్కడ సూచిస్తే అక్కడ పోటీ చేస్తానన్నారు. ఈ విషయంలో గందరగోళం లేదని, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప ఈసారి ఎన్నికల్లో పోటీ చేయటం లేదని చెప్పటంతో సహజంగా అదే నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కార్యకర్తల ఒత్తిడి ఉందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అల్పాహారం తీసుకోవడానికి తమ ఇంటికి వచ్చారని, తనకు ఎంతో సంతోషం కలిగిందన్నారు. ఆ సమయంలో షాతో ఎన్నికలపై విషయంపై చర్చించామని, ఎలాంటి రహస్యాలు లేవన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ కోత

కంప్లి: పట్టణంలోని 110 కేవీ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతు పనుల నిర్వహణ నేపథ్యంలో పట్టణంతో పాటు గ్రామాల్లో ఈనెల 26న ఉదయం 9 గంటల సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జెస్కాం ఏఈ వినోద్‌కుమార్ బ్యాలాళ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కారులో రూ.53 లక్షలు సీజ్



కారు డిక్కీలో పట్టుబడిన నగదు కట్టలు

హుబ్లీ: ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.53 లక్షల నగదును ధార్వాడ గరగ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. తేగూరు హైవే-4లో ఈ ఘటన చోటు చేసుకుంది. చెక్‌పోస్ట్ వద్ద పరిశీలిస్తున్న వేళ ఇన్నోవా కారులో నగదు దొరికింది. బెళగావి జిల్లా చిక్కోడి నుంచి హావేరి జిల్లా తడసకు నగదును చేర్చేందుకు తరలిస్తున్నట్లు తెలిసింది. కారులో సంజు హిరేమఠ అనే వ్యక్తి ఈ నగదును తీసుకెళుతున్నాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగదును, ఇన్నోవా కారును సీజ్ చేశారు. గరగ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రూ.3 లక్షల నగదు స్వాధీనం

రాయచూరు రూరల్: అక్రమంగా కారులో తరలిస్తున్న రూ.3 లక్షల నగదును శక్తినగర్ చెక్‌పోస్టులో గురువారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణలోని నారాయణపేట జిల్లా మక్తల్ తాలూకా కృష్ణా మండలం బైపాస్ రహదారి వద్ద తనిఖీ చేపట్టగా, ఆ సమయంలో కారుకు నంబర్ బోర్డు లేకపోవడం, ఎలాంటి రికార్డులు లేని కారణంగా ఈ డబ్బును స్వాధీనపర్చుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు పంచడానికి ఈ డబ్బును తీసుకెళుతున్నట్లు అందిన సమాచారంతో నగదును సీజ్ చేశామన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: ముద్దాపుర అగసి వద్ద గల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం నూతన అధ్యక్షునిగా అల్లి నాగరాజ్, ఉపాధ్యక్షునిగా డీ.మురారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గురువారం సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డీఆర్ఓ కార్యాలయ అధికారి నూర్ మొహ్మద్ ప్రకటించారు. సంఘం గత అధ్యక్ష, ఉపాధ్యక్షులైన బళె వీరేష్, శెరగార రాజేష్‌ల రాజీనామాల వల్ల ఈ ఎంపిక జరిగిందన్నారు. అధికారికంగా నూతన అధ్యక్ష ఉపాధ్యక్షుల ఎంపిక జరిపామని ఎన్నికల అధికారి వెల్లడించారు. ఈ సందర్భంగా ఈఓ హెచ్. ఈరణ్ణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీకి 120 సీట్లు రావాలని చీరపై చేనేత



బీజేపీకి 120 ప్లస్ సీట్లు అని నేసిన చీరను ప్రదర్శిస్తున్న తృప్తి సాలిమట్, మేఘరాజ్

రాయచూరు రూరల్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి మరోసారి బీజేపీ విజయ కేతనం ఎగరేయాలని బాగలకోటె జిల్లా ఇలకల్‌లో చేనేతకారులు చీరపై తమ చేనేత కళను రూపుదిద్దారు. రెండు రోజుల క్రితం ఇలకల్ చీరల రాయబారి తృప్తి సాలిమట్ బీజేపీకి 120కి పైగా సీట్లు రావాలని నేసిన చీరను ప్రదర్శించారు. ఇలకల్‌లో చేనేతకారుల సమ్మాన్ పథకం ద్వారా లబ్ధి పొందిన చేనేత కారుడు మేఘరాజ్ బీజేపీ కమలం గుర్తుపై 120 ప్లస్ అంటూ తన ప్రతిభను చీరపై కనబరిచారు.

లాడ్జి గదిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం

- అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు

హొసపేట: విజయపురలోని ఓ లాడ్జి గదిలో విజయనగర జిల్లాకు చెందిన ఇద్దరి మృతదేహాలు వెలుగు చూసిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసు వివరాల మేరకు..విజయపురలోని రాజధాని లాడ్జి గదిలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను గుర్తించారు. విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకా కృష్ణాపుర తాండ నివాసి సీ.ఇంద్రకుమార్‌తో పాటు మరో వ్యక్తి లాడ్జిలో మృతి చెందారని తెలిపారు. రెండు రోజులు క్రితం ఇంద్రకుమార్ విజయపురలోని రాజధాని లాడ్జిలో గది నెంబర్-114లో బస చేశారు. అనంతరం అతని గదిలోకి మరో వ్యక్తి చేరారు. ఇంద్రకుమార్‌తో కలిసి ఉన్న మరో వ్యక్తి ఇంద్రకుమార్‌ను హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండు రోజుల నుంచి లాడ్జిలోని గది తలుపులు తెరవక పోవడంతో లాడ్జి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గది తలుపులు తెరచి చూడగా పక్కపక్కనే ఇద్దరి మృతదేహాలు పడి ఉన్నాయి. మృతి చెందిన మరో వ్యక్తి పేరు, వివరాలు తెలియరాలేదు. వివరాల కోసం సమగ్ర విచారణ చేపడుతున్నట్లు ఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

అధ్యక్ష పీఠం దక్కేదెవరికో?

- ఈ నెల 29న ఎన్నికకు ముహూర్తం ఖరారు
- మేయర్‌గిరి రేసులో ఆరుగురు కార్పొరేటర్లు
- ఉపమేయర్ పదవి కోసం బరిలో ముగ్గురు



బళ్లారిలోని సిటీ కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి,బళ్లారి: ప్రస్తుతం కొనసాగుతున్న మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, ఉపమేయర్ మాలన్‌బీ పదవీ కాలం ఈనెల 18వ తేదీకి ముగిసిన తరుణంలో రెండో అవధి కింద మేయర్, ఉపమేయర్ ఎన్నిక కోసం ప్రభుత్వం తేదీని, రిజర్వేషన్లను కూడా ఖరారు చేసింది. మేయర్ స్థానం ఎస్సీ జనరల్‌కు కేటాయించగా, ఉపమేయర్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. దీంతో ఆ వర్గాలకు చెందిన కార్పొరేటర్లు పదవులు దక్కించుకునేందుకు తమదైన శైలిలో ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నెల 29న ఎన్నిక జరగనున్న తరుణంలో రిజర్వేషన్ అర్హత కలిగిన కార్పొరేటర్లు పదవులు ఎలా దక్కించుకోవాలోనని మల్లగుల్లాలు పడుతున్నారు. బళ్లారి సిటీ కార్పొరేషన్ పరిధిలోని మొత్తం 39 వార్డులకు గాను 21 స్థానాల్లో కాంగ్రెస్ కార్పొరేటర్లు, 13 స్థానాల్లో బీజేపీ కార్పొరేటర్లు, ఐదు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలుపొందిన సంగతి తెలిసిందే. దీంతో సిటీ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ పట్టు సాధించడంతో తొలి విడత మేయర్, ఉపమేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన మోదుపల్లి రాజేశ్వరి, మాలన్‌బీ ఎన్నిక కాగా వారి పదవీ కాలం కూడా ముగిసింది.

జోరందుకున్న పైరవీలు

ఈనేపథ్యంలో రెండో అవధిలో మేయర్, ఉపమేయర్ పదవి దక్కించుకునేందుకు కాంగ్రెస్ వారే ఎన్నిక అవుతారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బీజేపీకి చెందిన కార్పొరేటర్లు 13 మంది ఉండటంతో పోటీ చేస్తారా? లేదా? అన్న సందిగ్ధత నెలకొంది. ఒక వేళ పోటీ చేసినా కాంగ్రెస్ లేదా స్వతంత్ర అభ్యర్థులకు గాలం వేయాలి. ఇదంతా పక్కన పెడితే నగర మేయర్, ఉపమేయర్ పదవి కోసం కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు దక్కించుకునే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ తరఫున గెలుపొందిన వారిలో మేయర్ రేసులో ఎస్సీ వర్గానికి చెందిన 4వ వార్డు కార్పొరేటర్ త్రివేణి కమేలా సూరి, 7వ వార్డు కార్పొరేటర్‌గా ఉమాదేవి, 29వ వార్డు కార్పొరేటర్ శిల్పా, 31వ వార్డు కార్పొరేటర్ శ్వేతా సోము, 38వ వార్డు కార్పొరేటర్ కుబేర, 35వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది కాంగ్రెస్ పార్టీలో చేరిన 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్ కూడా మేయర్ పదవిని ఆశిస్తున్నారు. ఆరుగురు కార్పొరేటర్లలో త్రివేణి, కుబేర, శ్వేత, ఉమాదేవి మేయర్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే నాగేంద్ర మద్దతు కీలకం

మేయర్ స్థానం ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో పురుషులకు ఇవ్వాలని, ఉపమేయర్ ఎలాగూ మహిళలకు రిజర్వ్ అయినందున మహిళలకు దక్కుతుందని, తనకే మేయర్ పదవిని ఇవ్వాలని కార్పొరేటర్ కుబేర పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. నగర మేయర్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామీణ ఎమ్మెల్యే బీ.నాగేంద్ర కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈయన ఎవరికి మద్దతు సూచిస్తారన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది. ఉపమేయర్ రేసులో 33వ వార్డు కార్పొరేటర్ జానకమ్మ, 39వ వార్డుకు కార్పొరేటర్ శశికళ జగన్నాథ్, 14వ వార్డు కార్పొరేటర్ బీఆర్ఎల్ రత్నమ్మ ఉన్నారు. మొత్తం మీద బళ్లారిలో ఒక వైపు అసెంబ్లీ ఎన్నికల వేడి, మరోవైపు వేసవి ఎండల ప్రతాపం, ఇంకోవైపు త్వరలో జరగనున్న నగర మేయర్, ఉపమేయర్ ఎన్నికల హీట్ మధ్యన ఎవరిని పదవులు వరిస్తాయోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది.

రూ.కోటి నిధుల అందజేత



సీఎం నుంచి చెక్కు అందుకుంటున్న అర్చకులు బ్రహ్మానంద స్వామీజీ

గంగావతి: ఆనెగుంది సమీపాన ఉన్న మేగోటి దుర్గాదేవి గోశాలకు సీఎం బసవరాజ్ బొమ్మై రూ.1.0253 కోట్ల చెక్కును ఆలయ అర్చకులు బ్రహ్మానంద స్వామీజీకి అప్పగించారు. ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి చేసిన కృషి ఫలితంగా ఈ సొమ్మును గోశాల ఆలయ అర్చకులకు ఆయన ఇప్పించారు. ఇప్పటి వరకు గోశాలలోని వందలాది ఆవుల పోషణను దాతలు అందించిన సాయంతో నడిపే వారు. అయితే ఎమ్మెల్యే ఈ విషయాన్ని బెంగళూరుకు వెళ్లి సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు ఇప్పించడం గమనార్హం.

దుష్ట సంస్కృతిని సంహరించాలి

రాయచూరు రూరల్: సమాజంలో దుష్ట సంస్కృతి సంహారానికి మహిళలు ముందుకు రావాలని జిల్లా విద్యా శాఖ అధికారిణి ఇందిరా పిలుపు ఇచ్చారు. గురువారం రాత్రి గిరి అభయాంజనేయ ఆలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో మాట్లాడారు. 22వ శతాబ్దంలో మహిళలు గగన యాత్రలతో సాంకేతిక, విజ్ఞాన సమాచార కేంద్రాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో నాగరత్న, అరుణ, లలితలున్నారు.

శ్మశాన వాటిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

గంగావతి: శ్మశాన వాటిక లేని గ్రామాలు రెవెన్యూ శాఖ అధికారులకు దరఖాస్తులను సమర్పించాలని తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు. తాలూకాలో ఇప్పటి వరకు శ్మశానం లేని గ్రామాలకు దరఖాస్తులను సమర్పిస్తే అధికారులు పరిశీలించి ఆయా గ్రామాలకు శ్మశాన వాటికలను మంజూరు చేస్తారని తెలిపారు.

డాక్టర్ బసిరెడ్డికి సన్మానం



డాక్టర్ బసిరెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

బళ్లారిఅర్బన్: నగరానికి చెందిన జిల్లా సర్జన్ డాక్టర్ బసిరెడ్డికి రాష్ట్ర వైద్యసేవా రత్న పురస్కారం లభించడంతో శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ బసిరెడ్డిని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సభ్యులు, జిల్లా ఆస్పత్రి సిబ్బంది ఘనంగా సన్మానించారు. కర్ణాటక గవర్నమెంట్ మెడికల్ ఆర్గనైజేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2022-23వ సంవత్సరానికి గాను ఇటీవల తుమకూరులో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, ఆరోగ్య శాఖా మంత్రి, ప్రజాప్రతినిధుల సమక్షంలో డాక్టర్ బసిరెడ్డిని పురస్కారంతో సత్కరించిన సంగతి విదితమే.

బళ్లారి నుంచి పోటీకి సిద్దూకు ఆహ్వానం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎం.దివాకర్ బాబు

బళ్లారిటౌన్: వచ్చే ఎన్నికల్లో బళ్లారి నగర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ఆహ్వానించినట్లు ఆ పార్టీ సీనియర్ నేత ఎం.దివాకర్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం గంగప్ప జిన్న వద్ద గల తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంపై తాను స్థానిక నేతలు అల్లం వీరభద్రప్ప, నారా సూర్యనారాయణ రెడ్డి తదితరులతో చర్చించానన్నారు. కాంగ్రెస్‌లో నగర అభ్యర్థి స్థానానికి తీవ్ర పోటీ ఉన్నా ఎవరికి టికెట్ లభించినా గెలుపు కోసం అందరూ కృషి చేస్తామన్నారు. తాను కూడా టికెట్ ఆకాంక్షినేనన్నారు. నాడు సిద్దరామయ్య బెంగళూరు నుంచి బళ్లారికి పాదయాత్ర చేపట్టి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కూడా బళ్లారి నుంచి కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేస్తే తప్పకుండా గెలిచి ముఖ్యమంత్రి అవుతారనే నమ్మకం ఉందన్నారు. ఆయన సీఎం అయితే నగరాభివృద్ధికి మరింత దోహదపడుతుందన్నారు. పార్టీ నాయకులు కల్లుకంబ పంపాపతి, తిమ్మప్ప యాదవ్, శర్మాస్, చాంద్‌బాషా, బీఎం పాటిల్, హనుమకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు పటిష్ట భద్రత

- జిల్లాలో 18 చెక్‌పోస్టుల ఏర్పాటు
- 769 మంది రౌడీషీటర్ల గుర్తింపు
- జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు

సాక్షి, బళ్లారి: మే నెలలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే జిల్లా వ్యాప్తంగా బళ్లారి, గ్రామీణ, కంప్లి, సిరుగుప్ప, సండూరు నియోజకవర్గాల పరిధిలో గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో మొత్తం 18 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 11 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, ఐదు జిల్లాలో, రెండు నగరంలో ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న దాదాపు రూ.6 లక్షల నగదును సీజ్ చేశామన్నారు.

ఎన్నికలపై 16 కేసులు నమోదు

రెండు వారాల నుంచి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న వారి వద్ద నుంచి నగదు, చీరలు, మద్యం, గంజాయిని సీజ్ చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి 16 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 769 మంది రౌడీ షీటర్లను గుర్తించామని, వారిలో 589 మంది నుంచి వారితో ప్రమాణ పత్రాలను రాయించుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించామన్నారు. వారి పరిధిలో ఎలాంటి గొడవలు జరిగినా గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. మరో నలుగురిని జిల్లా నుంచి ఎన్నికలు ముగిసేదాకా బహిష్కరించామన్నారు. అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు పటిష్టమైన చర్యలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగే 25 ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

2200 చీరలు స్వాధీనం

టాటాఏస్ వాహనంలో తరలిస్తున్న 2200 చీరలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ వాహనంతో పాటు సుమారు రూ.7.70 లక్షలు ఉంటుందన్నారు. అదే విధంగా కుడితిని వద్ద మరో 41 చీరలను పట్టుకున్నామని, వీటి విలువ దాదాపు రూ.11 వేలు ఉంటుందన్నారు. ఇవి ఏ పార్టీకి చెందినవో విచారణ చేస్తున్నామన్నారు. డీఏఆర్ క్వార్టర్లలో పోలీసు కానిస్టేబుల్‌ను హత్య చేసింది ఆయన రెండో భార్య అని, ఆమె విచారణలో ఒప్పుకున్నారని, ఈ ఘటనలో ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. మొదటి భార్య నుంచి విడాకులు తీసుకోకుండా రెండో భార్యను పెళ్లి చేసుకున్నారని, ఇద్దరితో సంసారం చేయాలని నిర్ణయించుకోవడంతో రెండో భార్య హత్య చేసినట్లు ఆయన వివరించారు.

ఎయిమ్స్ కోసం రాయచూరు బంద్ పాక్షికం



ర్యాలీ నిర్వహిస్తున్న పోరాట సమితి కార్యకర్తలు



స్థానికాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరానికి ఎయిమ్స్ మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం చేపట్టిన రాయచూరు బంద్ పాక్షికంగా విజయవంతమైంది. పోరాట సమితి నేతలు, కార్యకర్తలు నగరంలో కలియ తిరుగుతూ నగర బంద్‌కు పూనుకున్నారు. ఈ సందర్భంగా క్రీడా మైదానంలో ఎయిమ్స్ పోరాట సమితి నేతలు బసవరాజ్, అశోక్ కుమార్ జైన్, కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్య, కాంగ్రెస్ నేత రవి మాట్లాడుతూ సీఎం బసవరాజ్ బొమ్మై రాయచూరుకు ఎయిమ్స్‌ను కేటాయించే వరకు ఆందోళన చేస్తామన్నారు. జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడడానికి ప్రజా ప్రతినిధుల్లో చిత్తశుద్ధి లేమే కారణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాపై సవతి తల్లి ప్రేమను ఒలకబోస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంతవరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపక పోవడంపై ఆందోళన కారులు మండిపడ్డారు. బంద్‌కు ఎస్‌డీపీఐ, కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు మద్దతు పలికాయి. క్రీడా మైదానం నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్, గ్రామ ప్రముఖులు తదితరులు

కంప్లి: ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు భూములకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గురువారం తాలూకాలోని ఇటిగితో పాటు వివిధ గ్రామాల్లో రూ.4.79 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేసిన సందర్భంగా మాట్లాడారు. రోడ్డు అభివృద్ధికి రైతులందరూ సహకరించాలన్నారు. చాలా ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీపీ అధ్యక్షురాలు ఈరమ్మ, ప్రముఖులు సణ్ణ బాలే సాబ్, షామియాన వీరేష్, వడ్డర శంకర్, దాదా ఖలందర్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్‌కు ఆమోదం

గంగావతి రూరల్: 2023-24వ ఆర్థిక సంవత్సరానికి కుష్టగి పురసభకు ప్రవేశ పెట్టిన రూ.27.37 లక్షల మిగులు బడ్జెట్‌కు ఆమోదం లభించింది. శుక్రవారం కుష్టగి టీపీ సభాంగణంలో ఏర్పాటు చేసిన బడ్జెట్ సభను ఉద్దేశించి పురసభ అధ్యక్షులు జీకే హిరేమఠ మాట్లాడారు. పురసభ ప్రారంభ మిగులు రూ.17.90 లక్షలు కాగా వివిధ అభివృద్ధి పనులతో పాటు సిబ్బంది వేతనాలు పోగా ఈ సంవత్సరం రూ.27.37 లక్షల మిగులు బడ్జెట్‌ను ప్రవేశ పెట్టామన్నారు. ఈ సందర్భంగా పురసభ ఉపాధ్యక్షులు, స్థాయి సమితి అధ్యక్షులు, పురసభ సభ్యులు, సిబ్బంది వర్గం పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

బళ్లారిఅర్బన్: మహానగర పాలికెలో పని చేస్తున్న చెత్తసేకరణ వాహనాల డ్రైవర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు అందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పాలికెలో పని చేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసి వేతనాలు నేరుగా అందించాలని ఆందోళనకారులకు మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్లు రామాంజినేయలు, పూజారి గాదెప్ప, సూరి తదితర కార్పొరేటర్లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై జాగృతి జాతా



ప్రారంభిస్తున్న డాక్టర్ సురేంద్రబాబు తదితరులు

రాయచూరు రూరల్ : 2035 నాటికి దేశంలో క్షయ వ్యాధిని పూర్తి నియంత్రణలోకి తేవాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ సురేంద్రబాబు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్ వద్ద జనజాగృతి జాతాకు శ్రీకారం చుట్టి మాట్లాడారు. జాతాలో వైద్యాధికారులు గణేష్, షాకీర్, లలిత, నందిత, ఉద్యోగులు పాలాక్షి, సంధ్య, లక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

కంప్లి: క్షయముక్త భారత్‌గా రూపొందించేందుకు అందరూ కలసికట్టుగా శ్రమించాలని ప్రభుత్వ సముదాయ ఆరోగ్య కేంద్రం పిల్లల నిపుణులు డాక్టర్ సాగర్ వీ.భర్మక్కనవర్ తెలిపారు. శుక్రవారం సముదాయ ఆరోగ్య కేంద్రంలోని ఆవరణలో జాతీయ క్షయరోగ జాగృతి జాతాను ప్రారంభించి మాట్లాడారు. క్షేత్ర ఆరోగ్య విద్యాధికారి కే.శోభ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిర్మూలనకు నడుం బిగించండి

కోలారు : క్షయ రోగ నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ జగదీష్ తెలిపారు. శుక్రవారం నగరంలోనిర్వహించిన ప్రపంచ క్షయరోగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. జిల్లా క్షయ రోగ నియంత్రణ అధికారి డాక్టర్ జీ.ప్రసన్నకుమార్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ ఏవీ నారాయణస్వామి పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

అభివృద్ధికారకులనే ఎన్నుకోండి



ఓటుపై జాగృతి ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న దృశ్యం

కోలారు : వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చేవారిని ఎన్నుకోవాలని రైతు సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ మనవి చేశారు. శుక్రవారం హార్టికల్చర్ నర్సరీ ప్రాంగణంలో ఓటు హక్కుపై జాగృతి కల్గించే కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు గడిచినా మహిళలకు మాత్రం ఇంకా స్వాతంత్ర్యం రాలేదన్నారు. నేడు పాలకుల నిర్లక్ష్యం వల్ల మహిళలకు హక్కులు, సౌలభ్యాలు దూరమవుతున్నాయన్నారు. మహిళలపై దౌర్జన్యాలు, అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. వీటన్నింటికీ అడ్డుకట్ట వేయడానికి ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లోనుకాకుండా సరైన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా శైలజ, వెంకటమ్మ, రత్నమ్మ, చౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడికి అభినందన

కోలారు : జిల్లా జేడీఎస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా కిలారిపేటకు చెందిన శబరీష్ యాదవ్‌ను నియమించారు. నూతన అధ్యక్షుడు శబరీష్‌ను గోకుల మిత్ర బళగ సన్మానించింది. ఈ సందర్భంగా శబరీష్ యాదవ్ మాట్లాడుతూ పార్టీని సంఘటితం చేయడానికి కృషి చేస్తానన్నారు. నగర అభివృద్ధి కేవలం జేడీఎస్ వల్లే సాధ్యమన్నారు. కుమారస్వామి పంచరత్న పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని చూస్తున్నారన్నారు. నియోజకవర్గ జేడీఎస్ అభ్యర్థి సీఎంఆర్ శ్రీనాథ్‌ను గెలిపించడానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు మేస్త్రీ నారాయణస్వామి, శీనప్ప, బళె వెంకటేష్, విశ్వనాథ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోధనా సామగ్రి పంపిణీ

కోలారు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడానికి దాతలు సహకరించాలని బీఈఓ కన్నయ్య తెలిపారు. శుక్రవారం నగరంలోని బీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్యామ్సంగ్ ఇండియా, ఉపాధ్యాయ గెళెయర బళగ ఆధ్వర్యంలో సుమారు 15 పాఠశాలలకు ఆధునిక పాఠశాల బోధనా సామగ్రిని పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. బళగ వివిధ కంపెనీలతో చర్చించి రూ.40 లక్షల సామగ్రిని పాఠశాలలకు సమకూర్చడం హర్షణీయమన్నారు. బళగ అధ్యక్షుడు నారాయణస్వామి, క్షేత్ర సమన్వయ అధికారి ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు వీరణ్ణగౌడ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో లింబేకాయి చేరిక గురించి తెలియదు

- డీసీసీ అధ్యక్షుడు అల్తాఫ్ హళ్లూర

హుబ్లీ: పార్టీలో మోహన్ లింబేకాయి చేరికపై తనతో అసలు చర్చించలేదని డీసీసీ అధ్యక్షుడు అల్తాఫ్ హళ్లూర తీవ్రంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అరవింద బెల్లదను ఓడించే దీటైన అభ్యర్థి కావాలని కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారన్నారు. అందువల్ల మూల కాంగ్రెస్ వారికి తప్పని సరిగా టికెట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల కోసం ఈద్గా మైదానంలో వినాయకుడిని ప్రతిష్ఠించి దర్గాను తొలగించారన్నారు. ఈద్గా మైదానం పేరు మార్చాలని ప్రయత్నిస్తున్నారన్నారు. హెచ్‌డీపీఐ, ఏఐఎంఐఎం అభ్యర్థులు కాంగ్రెస్‌కు అసలు పోటీనే కాదన్నారు. ఈ పార్టీలన్నీ బీటీమ్ అంటూ బీజేపీ సాగిస్తున్న మత రాజకీయాలు చాలాకాలం సాగబోవన్నారు.

వైభవంగా కరగ



పూల కరగ నృత్యం చేస్తున్న శివరాజ్

శ్రీనివాసపురం : పట్టణంలో గురువారం రాత్రి నిర్వహించిన కరగ మహోత్సవం పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. పూల కరగను మోసిన శివరాజ్ చేసిన నృత్యం అలరించింది. పట్టణంలోని ప్రముఖ వీధుల్లో కరగ సాగింది. పలు చోట్ల భక్తులు కరగకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తెల్లవారు జామున కరగ తిరిగి ధర్మరాయస్వామి ఆలయం వద్దకు చేరుకుంది.

మళ్లీ బీజేపీదే అధికారం

- కోలారు ఎంపీ ఎస్.మునిస్వామి

మాలూరు : రాష్ట్రంలో మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తుందని కోలారు ఎంపీ ఎస్.మునిస్వామి తెలిపారు. గురువారం రాత్రి తాలూకాలోని మాస్తి ఫిర్కా దిన్నహళ్లిలో బీజేపీ యువ నాయకుడు జలంధర్ తన స్వంత ఖర్చుతో ఏర్పాటు చేసిన హైమాక్స్ దీపాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాలూరు టికెట్ విషయంలో ఎలాంటి గందరగోళం లేదన్నారు. గెలిచే వారికే టికెట్ కేటాయిస్తారన్నారు. మాలూరులో మంజునాథ్‌గౌడను పార్టీలోకి తీసుకున్నప్పుడే పార్టీ ఆయనకు మాలూరు టికెట్ కేటాయిస్తామని మాట ఇచ్చిందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తనకు మాలూరులో 37 వేల ఓట్ల మెజారిటీ లభించిందన్నారు. తాలూకా అభివృద్ధి కోసం మళ్లీ మంజునాథ్‌గౌడను గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కె ఎస్ మంజునాథ్‌గౌడ, సమాజ సేవకుడు జలంధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

'నందిని' ప్రతి ఒక్కరి దరిచేరాలి

కోలారు : ప్రతి ఒక్కరికీ ఉత్పత్తులను అందించాలనే ఉద్దేశంతో నందిని పార్లర్లను విరివిగా ప్రారంభిస్తున్నట్లు కోముల్ డైరెక్టర్ డి.వి.హరీష్ తెలిపారు. శుక్రవారం నగరంలోని మెక్కె సర్కిల్‌లోని పోలీస్ కల్యాణ మంటపం ప్రాంగణంలో నందిని ఉత్పత్తుల దుకాణాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని బంగారుపేట రోడ్డు, టేకల్ రోడ్డు, మెడికల్ కళాశాల సమీపంలో, పలు చోట్ల నందిని విక్రయ కేంద్రాలను స్థాపించామన్నారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై అజ్జప్పనహళ్లి గేట్ వద్ద సుమారు రూ.కోటి వ్యయంతో అత్యాధునిక నందిని కేంద్రం స్థాపనకు 10 గుంట్ల స్థలాన్ని రైతుల నుంచి లీజుకు తీసుకున్నట్లు తెలిపారు. కోముల్ ఎండీ గోపాలమూర్తి, పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు బివి గోపినాథ్, టౌన్ సీఏ ఎం గౌరవినకొళ్ల పాల్గొన్నారు.

ముస్లిం సోదరులతో అభ్యర్థి ప్రత్యేక ప్రార్థనలు

గంగావతి రూరల్: కనకగిరిలో శుక్రవారం ప్రచారంలో భాగంగా కనకగిరి అసెంబ్లీ నియోజకవర్గ కేఆర్‌పీపీ అభ్యర్థి డాక్టర్ చారుల్ దాసరి ముస్లిం మత పెద్దలతో కలసి ప్రార్థన చేశారు. వచ్చే ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని అభ్యర్థించారు. మైనార్టీ సోదరులు తమకు ఈద్గా మైదానంలో ప్రార్థన కోసం ప్రత్యేకంగా గోడను నిర్మించాలని కోరారు. స్పందించిన అభ్యర్థి తప్పకుండా రాబోయే రోజుల్లో సువ్యవస్థితమైన ప్రార్థన గోడను నిర్మిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బళ్లారి అలీఖాన్, మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నేత ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న ఉమాపతి శ్రీనివాసగౌడ

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నుంచి టికెట్ ఆశిస్తున్న కన్నడ నిర్మాత ఉమాపతి శ్రీనివాస్ గౌడ శుక్రవారం హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.వాసుదేవరెడ్డితో కలిసి సింగసంద్ర వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అనిల్ ఎస్.రెడ్డి, మంజునాథ్, వినోద్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

బొమ్మనహళ్లి: మంగమ్మపాళ్య వార్డులో కాంగ్రెస్, జేడీఎస్‌కు చెందిన 50 మందికిపైగా నాయకులు శుక్రవారం బీజేపీ నేత భరత్‌గౌడ, ఆంజనేయగౌడ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి కండువా కప్పి అభినందించారు.

క్షయ వ్యాధి నిర్మూలిద్దాం



జాతా ప్రారంభిస్తున్న దృశ్యం

తుమకూరు: ప్రపంచ క్షయ వ్యాధి దినం సందర్భంగా తుమకూరు జిల్లా పరిపాలన విభాగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తుమకూరు నగరంలో జన జాగృతి జాతాను నిర్వహించారు. తుమకూరు నగరంలోని ఉన్న టౌన్‌హాల్ సర్కిల్ వద్ద జాతాను జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారి మంజునాథ్, ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డీహెచ్‌ఓ మంజునాథ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

పురాతన బావి పునరుద్ధరణ



నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి సమీపంలో కోడిచిక్కనహళ్లిలో శిథిలావస్థకు చేరిన వందేళ్ల బావి పునరుద్ధరణకు నోచుకుంది. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ఎం.సతీష్ రెడ్డి సేటిస్ ఎన్విరాల్ మెంటల్ ట్రస్టు ద్వారా క్లీన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో బావిని శుభ్రం చేయించారు. శుక్రవారం బావి వద్ద పూజలు చేసి బావి ద్వారా ట్యాంకులకు నీటి సరఫరాను ప్రారంభించారు.

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలు అందజేత



వాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

బొమ్మనహళ్లి : బీటీఎం లేఔట్ నియోజక వర్గ పరిధిలోని కోరమంగళ వార్డులో స్థానిక ఎమ్మెల్యే, కేపీసీసీ కార్యాధ్యక్షుడు రామలింగారెడ్డి శుక్రవారం 19 మంది దివ్యాంగులకు ముడు చక్రాల బైకులు అందజేశారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వంతంగా పనులు చేసుకునేందుకు ఈ వాహనాలు ఉపయోగపడుతాయని రామలింగారెడ్డి అన్నారు. మాజీ మేయర్ మంజునాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అడగోడి మోహన్, జీ మంజునాథ్, చంద్రప్ప, మంజుళ సంపత్ కుమార్, డాక్టర్ .కే.సుధాకర్ పాల్గొన్నారు.


రక్ష విశ్వవిద్యాలయం ప్రారంభం



జ్యోతి వెలిగిస్తున్న ఈశ్వరప్ప

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని రాగిగుడ్డలో దేశంలోనే 5వ రక్ష విశ్వ విద్యాలయాన్ని శివమొగ్గ నగర ఎమ్మెల్యే కే.ఎస్.ఈశ్వరప్ప శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈశ్వరప్ప మాట్లాడుతూ...యువతలో దేశభక్తి, దేశాభిమానం, పెంచడం కోసం ఈ రక్ష విశ్వ విద్యాలయం ఎంతో కృషి చేస్తుందని, అలాంటి రక్ష విశ్వ విద్యాలయం శివమొగ్గలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అంతకు ముందు బెంగళూరు నగరంలో ఉన్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ బీ.వై.రాఘవేంద్రతో పాటు స్థానిక నాయకుల పాల్గొన్నారు.

చిన్నారు డ్యాంను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దండి



చిన్నారు డ్యాం



డ్యామ్ సమీపంలో పచ్చదనం



చిన్నారు డ్యాంకు వెళ్లే మార్గం

- చుట్టూ కొండలు, ఆహ్లాదకర వాతావరణం

క్రిష్ణగిరి: చుట్టూ కొండలు, కళకళలాడే వ్యవసాయ పంటలు, దట్టమైన అటవీ ప్రాంతం, ప్రశాంతమైన వాతావరణం, జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు కనువిందుగా కనిపించే సూళగిరి ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సామాజిక సేవాకర్తలు కోరుతున్నారు. కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు తాలూకాగా సూళగిరి తాలూకా వెలసింది. సూళగిరి పట్టణం పారిశ్రామికంగా, వ్యవసాయ రంగంలో ముందుకు దూసుకెళ్లడంతో పాటు సూళగిరి పక్కనే ఉన్న కొండపై శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వెలసిందని, ఈ కొండపైకి ఎక్కి చూస్తే నలువైపులా పాడి పంటలతో కళకళలాడే వ్యవసాయ భూములు, మరో వైపు పరిశ్రమలు, సమీపంలో చిన్నారు డ్యాం, కాశీ నుంచి కన్యాకుమారి వరకు వెళ్లే జాతీయ రహదారి తదితర దృశ్యాలు పర్యాటకులను ఆకర్షింపజేస్తుందని, ఈ ప్రాంతం పర్యాటక స్థలంగా మార్చేందుకు అనుకూలంగా ఉందని, కెలవరపల్లి రిజర్వాయర్ నుంచి సూళగిరి సమీపంలోని దొరచెరువు, అక్కడి నుంచి చిన్నారు డ్యాంకు నీరు వదిలేందుకు కాల్వలు ఏర్పాటు చేశారని, చిన్నారు డ్యాంను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని, సూళగిరి సమీపంలోని చిన్నారు డ్యాం జాతీయ రహదారి సమీపంలోనే ఉండడంతో వివిధ రాష్ట్రాల నుంచి తమిళనాడులోని పర్యాటక ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు ఇక్కడికి కూడా వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని సామాజిక సేవాకర్తలు చెబుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



మృతులు చెలువరాజు, అభిషేక్

తుమకూరు/మైసూరు: తుమకూరు, మైసూరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. తుమకూరు జిల్లా గుబ్బి తాలూకా చేళూరు -బిదరె రోడ్డులో సాలుమర తిమ్మక్క ఉద్యానవనం వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో గుబ్బి తాలుకాలోని హెబ్బూరు సమీపంలో ఉన్న రాగిముద్దనహళ్లి గ్రామానికి చెందిన చెలువరాజు(45), అభిషేక్(28) మృతి చెందారు. గుబ్బి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా చెన్నపట్టణ గ్రామానికి చెందిన సంతోష(24) అనే వ్యక్తి హెడియాల నుంచి చెన్నపట్టకు బైకులో వెళ్తూ హెడియాల వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొని మృతి చెందాడు. హులహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శాంతరామపై చర్యలు తీసుకోండి

బనశంకరి: ప్రభుత్వ అధికారిగా ఉంటూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన ప్రభుత్వ అదనపు కార్యదర్శి శాంతరామపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి లేఖ రాశారు. వాణిజ్య, పారిశ్రామిక శాఖ అధికారిగా ఉన్న శాంతరామ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న మేము ఎక్కడ విధులు నిర్వహిస్తున్నప్పటికీ పోస్టల్‌బ్యాలెట్ తీసుకుని ఓటు హక్కు వినియోగించుకుంటాము. అందులో తమ డిమాండ్లకు స్పందించే వారికి మాత్రమే ఓటు వేస్తాము, అని లెటర్ హెడ్‌లో రాసి దానిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఉద్యోగులను ప్రేరేపించే వ్యాఖ్యలు చేయడం ద్వారా కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన శాంతరామను ఎన్నికల విధుల నుంచి నుంచి సస్పెండ్ చేయాలని లేఖలో పేర్కొన్నారు.

ఉద్యాననగరిలో ఒడిస్సీ భామ సందడి



చీరెలు ప్రదర్శిస్తున్న భూమికాదాస్

బనశంకరి: ఉద్యాననగరిలో ఒడిస్సీ భామ భూమికాదాస్ సందడి చేశారు. హెచ్‌ఎస్‌ఆర్.లేఔట్ బీడీఏ కాంప్లెక్స్ సమీపంలోని వైట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సిల్క్ ఇండియా పట్టుచీరలు ప్రదర్శనను గురువారం భూమికా దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విభిన్న రకాలు పట్టుచీరలు ధరించి ప్రదర్శిస్తూ మేళాలో సందడి చేశారు. పట్టుచీరలు మేళాలో ఒడిస్సీ సంబల్‌పురి ఇక్కత్ సిల్క్ చీరలు, బిహార్ ఆర్గానిక్ టస్సర్‌సిల్క్ శారీస్, అస్సాం ముగా, ఎరిసిల్క్ చీరలు మగువులు మనసు దోచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్, మంగళగిరి, పోచంపల్లి చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్తరప్రదేశ్ మల్బరీసిల్క్, జమ్‌దాని, జామావార్‌సిల్క్, చిఫాన్ సిల్క్ శారీస్, మహారాష్ట్ర డిజైనర్ డ్రెస్ మెటీరియల్స్, చత్తీస్‌ఘడ్ ఎక్స్‌క్లూజివ్ రాసిల్క్ శారీస్, కోసాసిల్క్, టస్సర్‌ఘాట్, దుప్పాటా, మధ్యప్రదేశ్ మహేశ్వరి, చందేరి సిల్క్‌శారీస్, వెస్ట్‌బెంగాల్ బల్‌చారి, డాకామాస్లీ, కాశ్మీరీ సిల్క్‌చీరలు, రాజస్థాన్ కోటాసిల్క్ శారీలు మేళాలో మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన 29 తేదీ వరకు కొనసాగుతుంది.

ఇద్దరు ఆకతాయిల అరెస్ట్

బనశంకరి: రోడ్డుపై వెళ్తున్న వారిని వేధిస్తున్న ఇద్దరు ఆకతాయిలను శుక్రవారం జయనగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరు బైక్‌లో తిరుగుతూ రోడ్డుపై వెళ్లే వారిని అసభ్య పదజాలంతో దూషించడం, వికృత చేష్టలు చేయడం, అనంతరం వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో నేషనల్ కళాశాల పరిసరాల్లో ఉన్నట్లు తేలింది. దీంతో జయనగర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదు ఆధారంగా హేమంత్ అనే వ్యక్తితో పాటు ఓ మైనర్‌ను అరెస్ట్ చేశారు.

విశ్వకర్మలు రాజకీయంగా ఎదగాలి



బొమ్మనహళ్లి: విశ్వకర్మ సముదాయం ప్రజలు రాజకీయంగా ఎదగాలని, ఇదే సరైన సమయమని జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, సాహితీవేత్త డాక్టర్ చంద్రశేఖర్‌కంబార తెలిపారు. శుక్రవారం నాయండహళ్లిలో విశ్వకర్మ సేవాప్రతిష్ఠాన ఉపాధ్యక్షుడు జేడీఎస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీఎం. ఉమేశ్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి విశ్వకర్మ సమాజ జాగృతి సమావేశాన్ని చంద్రశేఖర్‌కంబార ప్రారంభించి మాట్లాడారు. విశ్వకర్మసముదాయం కలిసికట్టుగా ఒక వేదికపై ఈ వైభవం చూడటానికి రెండుకళ్లు చాలవన్నారు. కార్యక్రమంలో విశ్వగురు జగద్గురు పీఠ శివసుజ్ఞాన తీర్థస్వామీజీ, ఎమ్మెల్సీ టీఏ.శరవణ, విశ్వకర్మనేతలు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి చిన్నారి మృతి

తుమకూరు: ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి నీటికుంటలో పడి మృతి చెందిన సంఘటన తుమకూరు గ్రామీణ తాలూకాలోని నెలపాల్ వద్ద చోటు చేసుకుంది. సురేష్ అనిత దంపతుల కుమారుడు పునీత్ (5) శుక్రవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటూ సమీపంలోని నీటికుంటలో పడి మృతి చెందాడు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పరిసరాల్లో చూడగా నీటికుంటలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇంట్లో చోరీ

దొడ్డబళ్లాపురం: మాగడి తాలూకా సోలూరు గ్రామం నివాసి హనుమంతరాయప్ప కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగకు ఊరెళ్లాడు. విషయం గమనించిన దుండగులు ఇంటి తాళం పగలగొట్టి రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు దోచుకున్నారు. హనుమంతరాయప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ దగ్ధం

మైసూరు: మంటల్లో లారీ దగ్ధమైన ఘటన కుశాలనగరలో చోటుచేసుకుంది. గుజరీలోడుతో ఉన్న లారీ కోయంబత్తూరు నుంచి మంగళూరు వైపు వెళ్తుండగా ఒక్కసారిగా లారీలో మంటలు అంటుకున్నాయి. గుజరీ సామాను మొత్తం కాలి బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. లారీ మొత్తం కాలి బూడిదైంది.

20 ఏళ్లు ఎమ్మెల్యేగా ఏం చేసావు?

- యోగేశ్వర్‌కు నిఖిల్ కుమారస్వామి ప్రశ్నలు

దొడ్డబళ్లాపురం: 20 ఏళ్లు చన్నపట్టణకు ఎమ్మెల్యేగా ఉన్న నువ్వు ఏం చేసావు, అభివృద్ధి చేసి ఉంటే ఓటమి భయం ఎందుకు అంటూ నిఖిల్‌కుమారస్వామి ఎమ్మెల్సీ సీపీ యోగేశ్వర్‌ను ప్రశ్నించారు. శుక్రవారం చెన్నపట్టణ తాలూకా చిక్కమళూరు గ్రామంలో జరిగిన జేడీఎస్ కార్యకర్తల సమావేశంలో హాజరైన ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడ్డప్పుడే యోగేశ్వర్‌కు చెన్నపట్టణ గుర్తొస్తుందని ఎద్దేవా చేసారు. ఇప్పుడు ఇంటింటికి వెళ్లి మీ కొడుకులాంటి వాడిని అని చెప్పుకుంటున్న యోగేశ్వర్ కరోనా కష్ట కాలంలో ఎక్కడున్నారో అడగాలని ప్రజలను కోరారు. అదే తన తండ్రి కుమారస్వామి కరోనా సమయంలో తాలూకాకు ఎంతో చేసారన్నారు. హుణసూరు ఎన్నికల్లో మిగిలిన చీరలను దుమ్ముదులిపి ఇప్పుడు చెన్నపట్టణలో పంపిణీ చేస్తున్నారన్నారు. నిన్నటి వరకూ 40 శాతం కమీషన్లు దండుకున్న బీజేపీ ప్రభుత్వం జనసంకల్పయాత్ర చేస్తూ మరోసారి 100 శాతం కమీషన్లు మింగడానికి అ. ధికారం ఇవ్వమంటున్నారని విమర్శించారు.

వసతి పాఠశాల భవనం ప్రారంభం



వసతి పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ

మండ్య: మండ్య జిల్లాలో విద్యా రంగంలో మరిన్ని మార్పులు తీసుకుని వచ్చి అభివృద్ధి సాధిస్తామని మండ్య ఎంపీ సుమలత అంబరీశ్ అన్నారు. మండ్య తాలూకా తుంబకెరె గ్రామంలో సంక్షేమ శాఖ, కర్ణాటక వసతి విద్యా సంస్థలు, సంయుక్తంగా నిర్మాణం చేసిన మొరార్జీ దేశాయి వసతి పాఠశాల భవనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి జిల్లాకు మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు.

మత్తు పదార్థాలు ధ్వంసం

మైసూరు: 9 నెలల వ్యవధిలో కొడగు జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 28 కిలోల గంజాయి, ఒక కిలోకు పైగా హసీశ్ ఆయిల్‌ను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. 22 కేసుల్లో 60 మంది నేరస్తులను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను గుజ్జెగౌడనపురలో అధికారులు ధ్వంసం చేశారు.

27న అంబరీశ్ స్మారకం ప్రారంభం

యశవంతపుర: దివంగత నటుడు అంబరీశ్ స్మారకాన్ని ఈ నెల 27 ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తెలిపారు. శుక్రవారం బెంగళూరు అంతర్జాతీయ చిత్రోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేను అభిమానించే నటుడు అంబరీశ్ స్మారకం కంఠీరవ స్టూడియోలో విశేషమైన విన్యాసంతో నిర్మించగా ఈ నెల 27న ప్రారంభించనున్నట్లు తెలిపారు.

బాదామిలో సిద్దు పర్యటన

యశవంతపుర: మాజీ సీఎం సిద్ధరామయ్య వచ్చే ఎన్నికలలో ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది గందరగోళంగా మారింది. అయితే బాదామి నుంచి పోటీ చేయాలని అభిమానుల డిమాండ్ మేరకు ఆయన శుక్రవారం బాదామిలో పర్యటించారు. అభిమాని ఒకరు రక్తంతో సిద్దుకు లేఖ రాసి విజ్ఞప్తి చేశారు. రామదుర్గ సర్కిల్ నుంచి ఏపీఎంసీ వరకు కార్యకర్తలతో కలిసి రోడ్డుషో నిర్వహించారు. గజమాలతో సిద్దును బాదామి ప్రజలు స్వాగతం పలికారు. తాను ఎక్కడ నుంచి పోటీ చేస్తాననే గందరగోళానికి సిద్దరామయ్య బాదామిలో పర్యటించి తెరదించారు. బాదామి నుంచి పోటీ చేస్తే గెలిపిస్తామంటూ అభిమానులు నినాదాలు చేశారు.

పుట్టిన రోజు సేవా కార్యక్రమాలు



బనశంకరి: బీబీఎంపీ మాజీ విపక్షనేత, రాష్ట్ర బీజేపీ వెనుకబడిన వర్గాల ఉపాధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు శుక్రవారం బనశంకరి దేవస్థానంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బసవరాజ్ స్వగృహంలో బీజేపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పౌర కార్మికులతో కలిసి బసవరాజ్ భోజనం చేశారు. అనంతరం అనాథాశ్రమంలో పిల్లలకు భోజనం అందజేశారు. రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ కార్యక్రమంలో పాల్గొని బసవరాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎస్ఆర్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి

హోసూరు: ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించలేదని జీవితంపై విరక్తి చెందిన 15 ఏళ్ల బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన బర్గూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. పోచ్చంపల్లి ప్రాంతానికి చెందిన బాలిక అదే ప్రాంతానికి చెందిన ఓ యువకున్ని ప్రేమించింది. విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు బాలికను బర్గూరు సమీపంలోని బంధువుల ఇంటికి పంపారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాలిక గత 17వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం గమనించిన బంధువులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. బర్గూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

పాఠశాల వంటగది ప్రారంభం

కెలమంగలం: తళి నియోజకవర్గంలోని మల్లసంద్రం గ్రామ పంచాయతీ అశేనత్తం గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల వంటగదిని శుక్రవారం యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. పంచాయతీ అధ్యక్షురాలు సురేఖ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చైర్మన్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వంటగదిని ప్రారంభించారు. పంచాయతీ ఉపాధ్యక్షురాలు మంజుల, యూనియన్ కౌన్సిలర్, రాణి తిమ్మరాయప్ప, పంచాయతీ కార్యదర్శి మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కొబ్బరి మొక్కల పంపిణీ




రైతులకు కొబ్బరి మొక్కలను అందజేస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా వన్నలవాడి గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించిన శిక్షణా శిబిరంలో రైతులకు ఉచిత కొబ్బరి మొక్కలను అందజేశారు. డెప్యూటీ డైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వన్నలవాడి, చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన 40 మంది రైతులు పాల్గొన్నారు. ఈ శిక్షణా శిబిరంలో సేంద్రియ ఎరువుల తయారీ విధానం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ప్రధానమంత్రి పంటల బీమా పథక ఉపయోగాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు అందజేస్తున్న పథకాలు, రాయితీలు తదితర విషయాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖాధికారులు రేణుక, భారతి, మీనా తదితరులు రైతులకు శిక్షణ ఇచ్చారు.

వివాహిత ఆత్మహత్య

క్రిష్ణగిరి: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన బారూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. క్రిష్ణగిరి జిల్లా బారూర్‌కు చెందిన ధర్మన్ భార్య దీపనాయకి (29). ధర్మన్‌కు తాగుడు అలవాటుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గురువారం రాత్రి ఏర్పడిన గొడవల్లో విరక్తి చెందిన దీపనాయకి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. బారూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఘనంగా కోటమారియమ్మ రథోత్సవం



హోసూరు: హోసూరు తాలూకా బాగలూరులో ప్రసిద్ధి పొందిన శ్రీ కోటమారియమ్మ ఆలయ రథోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. శుక్రవారం అమ్మవారిని అభిషేకించి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు రథానికి పూజలు నిర్వహించి రథాన్ని లాగి ప్రారంభించారు. కార్యక్రమంలో హోసూరు, బాగలూరు, బేరికె, కర్ణాటక రాష్ట్రం మాలూరు, సర్జాపుర, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, చల్లని పానీయాలను భక్తులకు అందజేశారు. నేడు దీపారాధన, పల్లకీ ఉత్సవాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రథాన్ని లాగుతున్న భక్తులు →

ఇండియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం



ఇండియన్ బ్యాంక్ శాఖను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దృశ్యం

కెలమంగలం: అంచెట్టి తాలూకా కర్ణాటక సరిహద్దు గ్రామమైన తగ్గట్టిలో ఇండియన్ బ్యాంక్ 45వ శాఖను జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తగ్గట్టి, ఉరిగం, కోట్టైయ్యూరు, మంచుకొండపల్లి, మాడకల్ ప్రాంతాల ప్రజలు సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని అంచెట్టికి వెళ్లవలసి ఉండేదని, నేటి నుంచి ఈ ప్రాంత ప్రజలు తగ్గట్టి గ్రామంలో ప్రారంభించిన ఇండియన్ బ్యాంకులో ఖాతాలు ప్రారంభించి నెట్‌బ్యాంకింగ్ సేవలతో విద్యుత్ బిల్లు తదితర సేవలను ఉన్న చోటు నుంచే చేసుకోవచ్చునని సూచించారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి వసతి, రోడ్ల వసతి, విద్యుత్ సౌకర్యాలను వెంటనే కల్పించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు పళనికుమార్, మహేంద్రన్, ప్రసన్నబాలమురుగన్, రుకేష్, అభిలాష్, రాంకుమార్, బీడీవో నాగరత్నం, తహసీల్దార్ అనిత తదితరులు పాల్గొన్నారు.

2న చలో తిరుచ్చి



ఊరేగింపును ప్రారంభించి మాట్లాడుతున్న తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్

కెలమంగలం: చదువుకున్న యువతకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న తిరుచ్చిలో సీపీఐ అనుబంధ ఏఐవైఎఫ్ నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని తళి ఎమ్మెల్యే కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కెలమంగలంలో ప్రారంభమైన ఊరేగింపును తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువుకున్న పట్టభద్ర యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, పలు పరిశ్రమల్లో పర్మినెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఉద్యోగాలను ఊడించారని, దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగులు జీవనోపాధి కోల్పోయి వీధినపడ్డారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న తిరుచ్చిలో ఏఐవైఎఫ్ పెద్ద ఎత్తున బహిరంగ సభను ఏర్పాటు చేసిందని, ఈ బహిరంగ సభలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐవైఎఫ్ కెలమంగలం పట్టణ కార్యదర్శి గురురాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కే.వి.నాగరాజ్, జయరామన్, పారిశ్రామికవేత్త వరదరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అట్టుణ్ణువ జాతర



ప్రత్యేక అలంకరణలో శ్రీభూమి సిద్దేశ్వర స్వామి



జాతరకు వచ్చిన జనం

- వీర మరణం పొందిన సైనికులకు ఆత్మశాంతి కలగాలని పూజలు

మండ్య: వీర మరణం పొందిన సైనికులకు ఆత్మశాంతి కలగాలని నిర్వహించే శ్రీభూమి సిద్దేశ్వర స్వామి వారి అట్టుణ్ణువ జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చుట్టపక్కల గ్రామాల నుంచి దాదాపు 30 వేల మంది భక్తులు హాజరయ్యారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు జాతర అట్టహాసంగా జరిగింది. భక్తులు భూమిసిద్దేశ్వర స్వామివారిని దర్శించుకోవడంవ కోసం బారులు తీరారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు జలసమాధి

మైసూరు : మైసూరు జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు జల సమాధి అయ్యారు. మైసూరు నగరంలోని మండ్య జిల్లా మళవళ్లి తాలూకా హోనగనహళ్లికి చెందిన గంగాధర్(30) అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి మైసూరులోని మండిమోహల్లాలో నివాసం ఉంటూ ఒక బ్యాంకులో పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి టి.నరసీపురలో ఉన్న త్రివేణి సంగమం వెళ్లి నదిలో స్నానం చేస్తుండగా గంగాధర్ ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందాడు. టి.నరసీపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అదేవిధంగా చామరాజనగర జిల్లా బేగూరు గ్రామానికి చెందిన చంద్రు(28) అనే వ్యక్తి గుండ్లుపేట తాలూకా కొరికెరె గ్రామంలోని చెరువులో పడి మృతి చెందాడు. బేగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా...

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయీబ్రాహ్మణ నాయకులు

సాక్షి, అమరావతి: రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఎంతో గొప్ప నిర్ణయం తీసుకుందని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సి.యానాదయ్య అన్నారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయం రెండో బ్లాక్ వద్ద కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయీ బ్రాహ్మణ (కేశ ఖండనశాల) జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంటుపల్లి రామదాసు, సభ్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేశ ఖండనశాలల్లో విధులు నిర్వహించే నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.20,000 ఆదాయాన్ని వర్తింపజేస్తూ ఇటీవల ఉత్తర్వులిచ్చారని, ఈ మేలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. వెనుకబడిన కులాలు సమాజానికి వెన్నెముకని నిరూపిస్తూ సీఎం జగన్ తమ సామాజిక వర్గానికి న్యాయం చేశారన్నారు. సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపామని, త్వరలో నాయీ బ్రాహ్మణ కృతజ్ఞత సభ నిర్వహిస్తామన్నారు.

ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం

- ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ, ఏపీ లోకాయుక్త, ఏపీ మహిళా కమిషన్ సవరణల బిల్లులకు కూడా..

సాక్షి, అమరావతి: ఏపీ ద్రవ్య వినిమయ బిల్లు–2023కు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. శాసనసభ సమావేశాల చివరి రోజైన శుక్రవారం రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఈ బిల్లును ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే.. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బిల్లు–2023ను పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీ లోకాయుక్త సవరణ బిల్లు–2023ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫున వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏపీ ఉమెన్స్ కమిషన్ సవరణ బిల్లు–2023ను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ప్రవేశపెట్టగా సభ ఆమోదం తెలిపింది.


చంద్రబాబు అబ్బతరం కూడా కాదు

- మళ్లీ సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారు
- ఎవరూ ఆపలేరు.. రాసి పెట్టుకోండి
- సీటు ఇవ్వరని గ్రహించే కొందరు బాబుకు అమ్ముడుపోయారు
- అసెంబ్లీలో మంత్రి జోగి రమేష్

సాక్షి, అమరావతి: చంద్రబాబు కాదు కదా ఆయన అబ్బ వచ్చినా వైఎస్ జగన్‌ను 2024లో ముఖ్యమంత్రి కాకుండా ఆపలేరని మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. శుక్రవారం శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీటు ఇవ్వరని గ్రహించిన వారే చంద్రబాబుకు అమ్ముడుపోయారని విమర్శించారు. సంబరాలు చేసుకుని, కేరింతలు కొట్టడం తప్ప వైఎస్సార్‌సీపీ కంచుకోటను ఇంచు కూడా కదిలించలేకపోయారన్నారు. ఎక్కడో ఏదో ఎన్నిక జరిగితే.. గుర్తు, పార్టీ సింబల్ కూడా లేని ఆ ఎన్నికలో గెలిచి, ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినట్లు భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. గతంలో 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు దొడ్డిదారిన అమ్ముడుపోయినా తొణకని, బెణకని జగన్.. 151 స్థానాల్లో పార్టీని గెలిపించుకున్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు ప్రలోభాలు, మేనేజ్ చేయడం ఇంతకుముందూ చూశామన్నారు. తెలంగాణలో ఓటుకు కోట్లు కేసులో ఎమ్మెల్యేలను ఎలా ప్రలోభపెట్టారో అందరం చూశామని, ఇప్పుడు కూడా అదే చేశారని తెలిపారు. అయినప్పటికీ జగన్ నాయకత్వంలో 2024లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించబోతోందని, మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, రాసి పెట్టుకోండని మంత్రి చెప్పారు.

టీచర్ పోస్టులపై సరైన లెక్కలు లేవు

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



సాక్షి, అమరావతి: నిరుద్యోగులకు అవసరమైన జాబ్ కేలండర్, డీఎస్సీ ప్రకటనపై శాసన మండలిలో తమ ప్రశ్నలకు విద్యా శాఖ మంత్రి తప్పుడు సమాధానాలే చెప్పారుగాని, ప్రభుత్వ నిర్ణయాన్ని మాత్రం ప్రకటించలేదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు చెప్పారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖలో ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు, ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయన్నదానిపై విద్యా శాఖ మంత్రి వద్ద లెక్కలు లేవన్నారు. దీనిపై మండలిలో నిలదీస్తే జూలై, ఆగస్టులో డీఎస్సీ ప్రకటిస్తామని మీడియా ముందు చెబుతున్నారనన్నారు. జూలైలో డీఎస్సీ ప్రకటిస్తే నియామకాలు ఎప్పటికి చేపడతారని ప్రశ్నించారు.

మూడు విడతల్లో రూ. 19,178.17 కోట్లు

78.94 లక్షల మంది 'వైఎస్సార్ ఆసరా' లబ్ధిదారులకు సీఎం జగన్ లేఖలు

- చంద్రబాబు రుణమాఫీ మోసంతో డ్వాక్రా మహిళల కష్టాలు కళ్లారా చూశా
- ఇది మాటల ప్రభుత్వం కాదు.. చేతల్లో చూపిస్తున్నాం
- మూడున్నరేళ్లలో 98.5 శాతం హామీలు అమలు చేశాం

నేడు వైఎస్సార్ ఆసరా మూడో విడత సాయం



సాక్షి, అమరావతి: మూడున్నరేళ్లలోనే 98.5 శాతం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు మాదిరిగా తమది మాటల ప్రభుత్వం కాదని, చెప్పింది చేసి చూపించే చేతల ప్రభుత్వమన్నారు. 2019 ఎన్నికల నాటికి అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల పేరిట ఉండే రుణాల మొత్తాన్ని నాలుగు దఫాల్లో నేరుగా వారి చేతికే అందిస్తానని మాట ఇచ్చి అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. 'వైఎస్సార్ ఆసరా' పథకం ద్వారా మూడో విడత సాయాన్ని శనివారం విడుదల చేయనున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 78.94 లక్షల మంది మహిళా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి జగన్ లేఖలు రాశారు. పది రోజుల పాటు జరిగే 'ఆసరా' పంపిణీ ఉత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని లబ్ధిదారులకు సీఎం లేఖలను నేరుగా అందజేస్తారని అధికారులు తెలిపారు. పొదుపు మహిళలకు ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగతంగా రాసిన లేఖ సారాంశం ఇదీ...

- వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో సంవత్సరం కూడా పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని ఎంతో సంతోషంగా తెలియచేస్తూ అక్క చెల్లెమ్మలందరికి హృదయపూర్వక అభినందనలతో ఈ లేఖ రాస్తున్నా. మేనిఫెస్టో అంటే అంకెల గారడీ కాదు. మేనిఫెస్టోను పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి హామీల అమలుకు క్యాలెండర్‌ను ముందే ప్రకటించి 98.5 శాతం నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం మనది.
- డ్వాక్రా రుణాల మాఫీ పేరుతో గత చంద్రబాబు సర్కారు మోసగించడంతో రుణభారం తడిసి మోపెడై అక్కచెల్లెమ్మలు దయనీయమైన పరిస్థితుల్లో కూరుకుపోయారు. మహిళా సంఘాలు ఛిన్నాభిన్నమై 'ఏ' గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా 'సి', 'డి' గ్రేడ్‌లోకి పడిపోయాయి.
- స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ఇబ్బందులను నా 3,648 కిలోమీటర్ల పాదయాత్రలో చూసి చలించిపోయా. ఎస్ఎల్‌బీసీ తుది జాబితా ప్రకారం ఎన్నికల రోజు వరకు 7.98 లక్షల మహిళా సంఘాలలోని 78.94 లక్షల మంది పొదుపు అక్కచెల్లెమ్మలకు ఉన్న అప్పు నిల్వ రూ.25,571 కోట్లను నాలుగు దఫాలుగా నేరుగా చెల్లించాలని నిర్ణయించి నవరత్నాల పథకంలో చేర్చాం. 2016లో రద్దయిన సున్నావడ్డీ పథకాన్ని కూడా పునరుద్ధరించాం.
- మీ జీవితాల్లో మరిన్ని కాంతులు తీసుకొచ్చి సుస్థిర ఆదాయం, వ్యాపారం, జీవనోపాధి అవకాశాలకు ఈ డబ్బును వినియోగించుకుని ఆర్థికంగా ఎదిగి అక్కచెల్లెమ్మలు లక్షాధికారులు కావాలనే మంచి ఆలోచనతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం.
- అక్కచెల్లెమ్మలను సొంత కాళ్లపై నిలదొక్కుకునేలా ప్రోత్సహిస్తూ జీవనోపాధి మెరుగుపరచుకునేలా గతేడాది అమూల్, హిందూస్తాన్ యూనిలీవర్, ఐటీసీ, ప్రాక్టర్ అండ్ గ్యాంబల్, అలానా లాంటి వ్యాపార దిగ్గజాలతో ఒప్పందాలు చేసుకుని బ్యాంకుల నుంచి తోడ్పాటు అందిస్తున్నాం. ఈ ఏడాది అజియో–రిలయన్స్, గ్రామీణ వికాసకేంద్రం, టీసేజ్, మహీంద్ర–ఖేతీ లాంటి బహుళ జాతి సంస్థలతో ఒప్పందాల ద్వారా వ్యాపార మార్గాలు చూపించి ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలతో సుస్థిర ఆర్థికాభివృద్ధికి బాటలు వేశాం.
- 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ సాధికారతతో ఆంధ్రప్రదేశ్‌లోనే ఆవిర్భవించేలా ప్రోత్సహిస్తున్నాం. మహిళా పక్షపాత ప్రభుత్వంగా అక్క చెల్లెమ్మల జీవితాల్లో ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషి చేస్తున్న మన ప్రభుత్వానికి ఎల్లప్పుడూ మీ అండదండలు ఉండాలని.. మీకు, మీ కుటుంబ సభ్యులందరికీ దేవుడి చల్లని ఆశీస్సులు లభించాలని నిండు మనసుతో కోరుకుంటున్నా.

నేడు ఏలూరు జిల్లాకు సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ఏలూరు జిల్లా దెందులూరులో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి 10.30 గంటలకు దెందులూరు చేరుకుంటారు. 10.50 నుంచి 12.35 గంటల మధ్య దెందులూరులో బహిరంగ సభలో పాల్గొని వైఎస్సార్ ఆసరా ఆర్థిక సాయాన్ని విడుదల చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 1.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.35 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అక్షరాలా పాటిస్తూ ఇప్పటికే మొదటి విడతగా రూ.6,318.76 కోట్లు చెల్లించాం. తద్వారా 78.76 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి చేకూరింది. రెండో విడతగా 78.76 లక్షల మందికి మరో రూ.6,439.52 కోట్లు చెల్లించాం. ఇప్పుడు మళ్లీ అక్కచెల్లెమ్మలకు మరో రూ.6,419.89 కోట్లు మూడో విడతగా అందచేయనున్నాం. తద్వారా మూడు విడతలలో మొత్తం రూ.19,178.17 కోట్ల మేర 78.94 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు ప్రయోజనం చేకూరుతోంది.

అమ్మ కడుపులోని బిడ్డ నుంచి ఆప్యాయంగా ఆశీర్వదించే అవ్వ దాకా ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి తగిన పథకాలను అమలు చేస్తూ మహిళాభివృద్ధి ద్వారానే మన కుటుంబాభివృద్ధి జరుగుతుందని గట్టిగా విశ్వసిస్తున్నాం. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, చేయూత, సున్నా వడ్డీ, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, కళ్యాణమస్తు, ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మల పేరుతో ఇస్తున్నాం. అన్ని నామినేషన్ పోస్టులు, నామినేటెడ్ పనుల్లో మహిళలకు 50 శాతం కేటాయిస్తూ చట్టం చేశాం. వృద్ధాప్య, వితంతు పింఛన్లు, మహిళల రక్షణ కోసం దిశ బిల్లు, దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు లాంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.

ఎలాంటి షరతులు లేవు.. ఎలా ఉపయోగించుకున్నా సరే

అక్కచెల్లెమ్మలకు అందచేస్తున్న ఈ మొత్తాన్ని ఎలా వినియోగించుకుంటారనే అంశంపై ఎలాంటి షరతులు లేవు. మన ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ ఆదాయాలను పెంచుకుని మీరు సంతోషంగా ఉండాలి. మీ కుటుంబ ఆదాయం పెరగటం వల్ల రాష్ట్ర తలసరి ఆదాయం పెరుగుతుంది. తద్వారా రాష్ట్రాభివృద్ధిలో మీరు భాగస్వాములు కాగలుగుతారు. ప్రభుత్వానికి ఎన్ని సమస్యలున్నా భరిస్తూ ఇచ్చిన మాటమేరకు మీ తోబుట్టువుగా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నా. జగనన్న పాలనలో రాజన్న రాజ్యం చూడాలన్న మీ కోరికను నెరవేర్చే దిశగా నా ప్రతి అడుగు వేస్తున్నా. మీ అందరి ఆశీస్సులు నాతోపాటే ఉంటాయన్న ధైర్యంతో ముందుకు సాగుతున్నా.

జగనన్న కాలనీలు ఆధునిక లోగిళ్లు

- రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు
- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- పేదల ఇళ్ల కోసం భూములు కొంటున్నాం: మంత్రి ధర్మాన





సాక్షి, అమరావతి: జగనన్న కాలనీల్లో శాశ్వతప్రాతిపదికన అత్యాధునిక మౌలిక సౌకర్యాలు కల్పించి, ఆధునిక లోగిళ్లుగా తీర్చిదిద్దుతున్నామని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. శుక్రవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి మాట్లాడారు. త్వరలోనే జగనన్న కాలనీలు పూర్తవుతాయని, రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఒక చరిత్ర అని చెప్పారు. 4బీ అప్లికేషన్ జియో ట్యాగ్ విషయంలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల స్థలాల పంపిణీకి చంద్రబాబు అడ్డంకులు సృష్టిస్తున్నారని, చివరికి కోర్టులో కేసులు కూడా వేయించారని తెలిపారు. భూములను కొని మరీ పేదవారికి ఇళ్లు ఇస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. జగనన్న కాలనీల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ వారైనా ఇళ్లు లేని ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ ఇళ్లు కట్టించి ఇస్తున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. వేలాది ఎకరాల భూమి కొనుగోలు చేసి సంతృప్తస్థాయిలో పేదలందరికీ ఇళ్లు ఇవ్వడం ఓ చరిత్ర అని ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి కొనియాడారు. కొన్నిచోట్ల పట్టా కేటాయించిన తర్వాత రద్దవడంపై పరిశీలన జరపాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కోరారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ఇళ్లను అమ్ముకునేవని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. సాంకేతిక సమస్యలతో ఇళ్లు లభించని వారికి వేరే చోట పట్టాలివ్వాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కోరారు. సీఎం జగన్ చేపడుతున్న కార్యక్రమాలు అద్భుతమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చెప్పారు. శ్రీకృష్ణదేవరాయలు తరం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరం అని చరిత్ర చెప్పుకుంటుందని అన్నారు.

టీడీపీ హయాంలో అనారోగ్యశ్రీగా మార్చారు

- మంత్రి రజిని



టీడీపీ హయాంలో ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ... టీడీపీ హయాంలో 107 ప్రొసీజర్లు పెంచితే, ఆరోగ్యశ్రీలో 3,138 ప్రొసీజర్లు పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి ఆరోగ్యశ్రీ స్ఫూర్తిగా నిలిచిందని మంత్రి తెలిపారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- మంత్రి సీదిరి అప్పలరాజు



వేట నిషేధ సమయంలో ప్రతి మత్స్యకారునికి మత్స్యకార భరోసా అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ప్రమాదంలో మరణించిన మత్స్యకారుడు కుటుంబ పెద్ద కాకపోయినప్పటికీ పరిహారం అందిస్తున్నామని చెప్పారు. భీమిలి, చింతపల్లి, రాజయ్యపేట వద్ద ఎఫ్ఎల్‌సీలకు టెండర్ల ప్రక్రియ త్వరలో ప్రారంభిస్తామన్నారు. అవసరమైతే సబ్సిడీ మొత్తాన్ని పెంచుతామన్నారు. మత్స్యకార భరోసా కుటుంబంలో అందిరికీ వర్తింపజేయాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు.

15 రోజుల శిక్షణతో అర్చకత్వం



హిందూ ధర్మ ప్రచారం, రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది 2,900 దేవాలయాలు నిర్మిస్తున్నామని, ధూపదీప నైవేద్యాల కింద రూ.27.47 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ధూపదీప నైవేద్యాల పెండింగ్ బిల్లులు పది రోజుల్లో క్లియర్ చేస్తామన్నారు. దేవాలయానికి సంబంధం ఉన్న ప్రతి కమిటీకి ఏటా రూ.15 కోట్లు ఇస్తున్నామని వెల్లడించారు. దేవాలయాల్లో పని చేసేందుకు ఆసక్తితో ఉన్న వారికి 15 రోజులు శిక్షణ ఇచ్చి అర్చకత్వంలో నియమిస్తామని చెప్పారు. 16 ఏళ్లు నిండిన తరువాత వంశపారంపర్య అర్చకులుగా నియమిస్తామన్నారు. హిందూధర్మ పరిరక్షణకు జగన్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేసిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. చంద్రబాబు కూల్చేసిన ఆలయాలను సీఎం జగన్ పునర్నిర్మిస్తున్నారని తెలిపారు.

సీఎం జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు







ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నూతన ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో నూతన ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, పోతుల సునీత, చంద్రగిరి ఏసురత్నం, వీవీ సూర్యనారాయణ రాజు, బొమ్మి ఇజ్రాయెల్, జయమంగళ వెంకటరమణ, ఎస్.మంగమ్మ కలిశారు. తమకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు సీఎం జగన్‌ను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా కలిశారు.

చివరి రోజూ అదే తీరు

- శాసనసభలో స్పీకర్‌పై టీడీపీ సభ్యుల అనుచిత వ్యాఖ్యలు
- శాసనసభను సంతాప సభతో పోల్చిన అచ్చెన్నాయుడు



పోడియంపైకి వెళ్లి గొడవ చేస్తున్న టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాల చివరిరోజూ తెలుగుదేశం పార్టీ తన అరాచక బుద్ధిని ప్రదర్శించింది. స్పీకర్ తమ్మినేని సీతారామ్ లక్ష్యంగా ఆ పార్టీ సభ్యులు అనుచిత వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ప్రశ్నోత్తరాలు మొదలవగానే వాయిదా తీర్మానానికి టీడీపీ పట్టుపట్టింది. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని స్పీకర్ వారించడంతో టీడీపీ సభ్యులు రెచ్చిపోయారు. తమను దగ్గరుండి కొట్టించడంతోపాటు.. ఎమ్మెల్యేపైనే స్పీకర్ దాడి చేశారంటూ ఆరోపించారు. చివరకు రెడ్‌లైన్ దాటి, సస్పెండై సభ నుంచి వెళ్లిపోయారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీ ప్రారంభమవగా, ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. 'ఆయుష్మాన్ భారత్'పై టీడీపీ సభ్యులే అడిగిన ప్రశ్నలకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని బదులిస్తుండగా వినకుండా తమ స్థానాల నుంచే రన్నింగ్ కామెంట్రీ మొదలుపెట్టారు. జీవో నంబర్1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను వినిపించేందుకు టీడీపీ సభ్యులకు స్పీకర్ మైక్ ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా తమ వాయిదా తీర్మానం తీసుకోవాలంటూ భీష్మించారు. 9.09గంటలకు వెల్‌లోని రెడ్‌లైన్ వరకు వచ్చి స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను సంప్రదించకుండా రెడ్‌లైన్ ఎలా పెడతారని శాసనసభ కార్యదర్శిని టీడీపీ సభ్యుడు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. రెడ్‌లైన్ దాటి సభాపతి పోడియంపైకి దూసుకెళ్లారు. సభా సంప్రదాయాలకు విఘాతం కలిగిస్తున్నారంటూ టీడీపీ సభ్యులపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో ఇచ్చిన రూలింగ్ ప్రకారం రెడ్ లైన్ దాటినందుకు టీడీపీ సభ్యులు కె.అచ్చెన్నాయుడు, డోలా బాలవీరాంజనేయస్వామి, గద్దె రామ్మోహన్ రావు, గొట్టిపాటి రవి, ఏలూరు సాంబశివరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పీజీవీఆర్ నాయుడు (గణబాబు), గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మంతెన రామరాజు, నిమ్మకాయల చినరాజప్ప ఒక రోజు సభ నుంచి ఆటోమేటిక్‌గా సస్పెండ్ అయినట్టు ప్రకటించారు. బయటకు వెళ్లేందుకు టీడీపీ సభ్యులు నిరాకరించడంతో మార్షల్స్‌ను రప్పించారు. అయితే 9.22 గంటలకు నవ్వుకుంటూ.. బయటకు వెళ్లిపోయారు. బయటకు వెళ్తూ అచ్చెన్నాయుడు శాసనసభను సంతాప సభతో పోల్చారు.

ఆ నలుగురు.. ఔట్



సాక్షి, అమరావతి: ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన నలుగురు శాసనసభ్యులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా వ్యవహరించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు చెప్పారు. వారు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారించుకున్నాకే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. బలం లేకపోయినా ప్రలోభపెట్టడం, డబ్బులు ఎరవేయడం చంద్రబాబుకు ఆది నుంచి అలవాటేనన్నారు. అమ్ముడుపోయే వాడుంటే కొనుగోలు చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ అధికారంలో ఉండగా వైఎస్సార్‌సీపీ నుంచి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలను పశువులను కొన్నట్లు కొనుగోలు చేయడంతోపాటు తెలంగాణలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బేరసారాలకు దిగి సాక్ష్యాధారాలతో దొరికిపోయిన చరిత్ర చంద్రబాబుదన్నారు. అదే మాదిరిగా తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పెద్ద ఎత్తున ప్రలోభాలకు గురి చేశారని చెప్పారు. చంద్రబాబు మాదిరిగా ఆఖరి నిమిషం వరకు నాన్చుడు ధోరణి, నమ్మక ద్రోహం సీఎం వైఎస్ జగన్‌కు తెలియదన్నారు. తనతో నడిచే వారి పట్ల నమ్మకంతో ఉండే జగన్ తన పట్ల కూడా వారు అంతే విశ్వాసంతో ఉండాలని భావిస్తారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, ప్రజాదరణలో వెనుకబడిన పార్టీ ఎమ్మెల్యేలను సీఎం జగన్ ముందుగానే పిలిచి వచ్చే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ విషయంలో స్పష్టత ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనూ కొందరిని పిలిచి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించి అత్యంత పారదర్శకంగా వ్యవహరించారని తెలిపారు. చంద్రబాబు దీన్ని అవకాశంగా తీసుకుని బలం లేకపోయినా అభ్యర్థిని పోటీకి పెట్టి ప్రలోభాలకు తెర తీశారన్నారు. ఏ ఎన్నికలూ లేనప్పుడే టీడీపీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, ఒక జనసేన ఎమ్మెల్యే సీఎం జగన్ పాలన నచ్చి స్వచ్ఛందంగా మద్దతు పలికారని గుర్తు చేశారు.

నమ్మక ద్రోహులను ఉపేక్షించలేం

తమకున్న సమాచారం మేరకు టీడీపీ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఒక్కొక్కరికి రూ.10 కోట్ల నుంచి 15 కోట్ల వరకు ఆశచూపి ఓట్లు కొనుగోలు చేశారని సజ్జల వెల్లడించారు. టిక్కెట్ ఇస్తామని కూడా చంద్రబాబు కొందరికి ఆశ చూపి ఉండవచ్చన్నారు. కోటంరెడ్డి, ఆనం, మేకపాటి, శ్రీదేవి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు తమ అంతర్గత విచారణలో ఆధారాలతో రుజువైందన్నారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దృష్టికి తీసుకొచ్చి న అనంతరం ఆ నలుగురిని సస్పెండ్ చేయాలని పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. 'అసంతృప్తివాదులుంటే పిలిచి మాట్లాడి పార్టీ లైన్‌లో నడిచేలా సరిదిద్దుకోవచ్చు. అమ్ముడుపోయి నమ్మక ద్రోహం చేసే వారిని ఉపేక్షించలేం' అని సజ్జల స్పష్టం చేశారు. ద్రోహం చేసే ఇలాంటి చర్యలు రోగ లక్షణమని భావించి సస్పెన్షన్‌పై త్వరగా నిర్ణయం తీసుకున్నామన్నారు. గతంలో 23 మంది ఎమ్మెల్యేలు టీడీపీకి అమ్ముడుపోయినప్పుడూ ఇలాగే వ్యవహరించామని, భవిష్యత్తులోనూ పారదర్శకమైన రాజకీయాలే చేస్తామని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టంచేశారు.

వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు ఎమ్మెల్యేల సస్పెన్షన్



ఆనం రామనారాయణరెడ్డి



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



ఉండవల్లి శ్రీదేవి



మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి (వెంకటగిరి), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి(ఉదయగిరి)లను వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశారు. వీరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందున ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఎమ్మెల్యేలు మేకపాటి, శ్రీదేవి దిష్టిబొమ్మల దహనం



గుంటూరులోని తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు



నెల్లూరు జిల్లా వింజమూరులో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వింజమూరు/తాడికొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి దిష్టిబొమ్మలను శుక్రవారం పార్టీ నేతలు, కార్యకర్తలు దహనం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్లు గువ్వల కృష్ణారెడ్డి, మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా తాడికొండ ఎమ్మెల్యే శ్రీదేవి దిష్టిబొమ్మను నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు దహనం చేశారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన నీచురాలు శ్రీదేవి అని మండిపడ్డారు. ఆమెకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. తుళ్లూరు మండలం వెలగపూడిలో ఎస్సీ సెల్ నాయకులు శృంగారపాటి సందీప్, చలివేంద్రం సురేష్, పలువురు శ్రీదేవి దిష్టిబొమ్మను దహనం చేశారు. గుంటూరులో శ్రీదేవి కార్యాలయం ఎదుట ఆమె ఫ్లెక్సీలు చింపి నిరసన తెలిపారు. తుళ్లూరు మండల అధ్యక్షుడు బుర్రా వెంకటశివారెడ్డి, ఎస్సీ నాయకులు ఆరేపల్లి జోజి, రాజేష్, తురకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఐసీయూలో పేషెంట్లకు సేవ చేసే నర్సులు ఎంతో జాగ్రత్తగా ఉండాలి.
లేకుంటే కొన్ని వ్యాధులు అంటుకునే ప్రమాదం ఉంది.
ఢిల్లీ ఎయిమ్స్‌లో పని చేసే **దివ్య సోజల్**
మూడుసార్లు టి.బి బారిన పడింది.
అయినా సరే రోగుల సేవ మానలేదు.
'నా కర్తవ్యం నుంచి నేను పారిపోను' అంటున్న ఆమెను
ప్రాణాంతక రోగులు మనిషి అనరు. దేవత అంటుంటారు.


దివ్య సోజల్

నర్సు కాదు దేవత

దివ్య సోజల్ ఐసీయూలో ఉందంటే పేషెంట్లకే కాదు తోటి స్టాఫ్‌కు కూడా ఎంతో ధైర్యం. ఐసీయూలో ఉండే పేషెంట్లను చూసుకోవడంలో ఆమెకు ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం ఉన్నాయి. అయితే అవి చాలామందిలో ఉంటాయి. అందరూ ఐసీయూలో ఉండటానికి ఇష్టపడరు. కాని దివ్య సోజల్ మాత్రం తనకు తానుగా ఐసియులో ఉండే పేషెంట్ల సేవను ఎంచుకుంది. 'ప్రాణాపాయంలో ఉన్న వారిని కాపాడుకోవడంలో నాకో సంతృప్తి ఉంది' అంటుంది సోజల్. అయితే ఆ పనిలో ప్రమాదం కూడా ఉంది. అదేమిటంటే అలాంటి రోగులకు సేవ చేసేటప్పుడు కొన్ని వ్యాధులు అంటుకోవచ్చు. సోజల్ మూడుసార్లు అలా టి.బి బారిన పడింది.

కేరళ నర్స్

దివ్య సోజల్‌ది కేరళలోని పత్తానం తిట్ట. చదువులో చురుగ్గా ఉండేది. ముంబైలోని పీడీ హిందూజా కాలేజ్ ఆఫ్ నర్సింగ్ నుంచి జనరల్ నర్సింగ్‌లో డిప్లమా చేసి 2011 నాటికి హిందూజా హాస్పిటల్‌లో ఐసీయూ నర్స్‌గా పని చేయడం మొదలు పెట్టింది. అప్పటికి ఆమె వయసు 23. ఆ సమయంలోనే ఒకరోజు నైట్ డ్యూటీలో ఆమెకు శ్వాసలో ఇబ్బంది ఎదురైంది. ఎక్స్‌రే తీసి చూస్తే ఊపిరితిత్తుల్లో నీరు చేరింది అని తేలింది. పరీక్షలు చేస్తే టి.బి. అని తేలింది. అదే హాస్పిటల్‌లోని వైద్యులు ఆమెకు ఆరు నెలల ట్రీట్‌మెంట్‌లో పెట్టారు. రోజూ నాలుగు రకాల మందులు తీసుకోవాల్సి వచ్చేది. వాటిని తీసుకుంటూ టి.బి. నుంచి బయట పడింది. అయితే వృత్తిని మానేయలేదు. ఐసీయూను వదల్లేదు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో

2012లో బి.ఎస్సీ నర్సింగ్ చేయడానికి ఢిల్లీ ఎయిమ్స్‌కు వచ్చింది దివ్య. ఆ తర్వాత అక్కడే న్యూరోసైన్స్ నర్సింగ్‌లో పి.జి. చేరింది. న్యూరోలాజికల్ ఐసీయూలో పని చేయడానికి నిశ్చయించుకోవడం వల్లే ఆ కోర్సులో చేరింది. ఆ సమయంలో అంటే 2014లో మళ్లీ టి.బి. బారిన పడింది దివ్య. నెల రోజులు హాస్పిటల్‌లో ఉంచారు. నీడిల్‌తో ఫ్లూయిడ్‌ను బయటకు తీయాల్సి వచ్చింది నాలుగైదు సార్లు. మూడు నెలల పాటు రోజూ ఇంజెక్షన్ తీసుకోవాల్సి వచ్చేది. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా నేరుగా రంగంలో దిగి దివ్య ట్రీట్‌మెంట్‌ను పర్యవేక్షించాడు. దివ్య సేవాతత్పరత ఆయనకు తెలియడం వల్లే ఇది జరిగింది. దాంతో రెండోసారి టి.బి నుంచి విజయవంతంగా బయటపడింది దివ్య సోజల్. ఈ దశలో ఎవరైనా సులభమైన పని ఉండే వార్డుల్లో పని చేయడానికి మారిపోతారు. కాని దివ్య మారలేదు. డ్యూటీని కొనసాగించింది.

> **టి.బి రోగులలో స్థయిర్యానికి**
>
> 'నేను ఒకటి నిశ్చయించుకున్నాను. టి.బి రోగుల్లో ధైర్యం నింపాలి. వాళ్లు నన్ను చూసి ధైర్యం తెచ్చుకోవాలి. మూడుసార్లు టి.బి వచ్చినా నేను బయటపడగలిగాను. అందువల్ల ఆ వ్యాధి వచ్చినవారు కుంగిపోవాల్సిన పని లేదు. సరైన మందులు సరిగ్గా తీసుకోవాలి. అంతే కాదు నర్సులు కాని సామాన్య ప్రజలు కాని మంచి తిండి తిని సమయానికి తిని రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి. అప్పుడు అంటువ్యాధుల బారిన పడే ప్రమాదం తగ్గుతుంది. ఇప్పుడు నేను ఆ చైతన్యం కోసం కార్యక్రమాలు చేస్తున్నాను. ప్రచారం చేస్తున్నాను' అంటుంది దివ్య.

ఆహారం సరిగా తినక

ఐసీయూలో ఉద్యోగం అంటే నైట్ డ్యూటీస్ ఉంటాయి. దివ్య సరిగా ఆహారం తినేది కాదు డ్యూటీలో. నిజానికి తినడానికి టైమ్ కూడా ఉండేది కాదు. అది ఆమె రోగ నిరోధక శక్తిని దెబ్బ తీసింది. అప్పటికి దివ్య పెళ్లి చేసుకుంది. జీవితం ఒక మార్గాన పడింది అనుకుంది. కాని 2019లో విదేశాలలో ఉద్యోగానికి అప్లై చేసేందుకు చేయించుకున్న రొటీన్ పరీక్షల్లో మూడోసారి టీబీ బయట పడింది. విషాదం ఏమంటే ఈసారి వచ్చింది డ్రగ్ రెసిస్టెంట్ అంటే మందులకు లొంగని వేరియెంట్. 'ఈ వార్త విన్నప్పుడు చాలా కుంగిపోయాను' అంది దివ్య. 'నేను కేరళలోని మా ఊరికి వచ్చి ట్రీట్‌మెంట్ కొనసాగించాను. లెక్కలేనన్ని మాత్రలు మింగాల్సి వచ్చేది. ఇంజెక్షన్లు వేసుకోవాల్సి వచ్చేది. బరువు తగ్గాను. నాసియా ఉండేది. నా తల్లిదండ్రులు నన్ను జాగ్రత్తగా చూసుకుని కాపాడుకున్నారు' అంటుంది దివ్య.

ఇంత జరిగినా ఆమె ఉద్యోగం మానేసిందా? ఐసీయూను వదిలిపెట్టిందా? ఢిల్లీ ఎయిమ్స్‌కు వెళ్లి చూడండి. ప్రాణాపాయంలో ఉన్న రోగులను అమ్మలా చూసుకుంటూ ఉంటుంది. ఇటువంటి మనిషిని నర్సు అని ఎలా అనగలం? దేవత అని తప్ప.

స్టిక్ యోగా

కుటుంబంలో అందరి బాగు కోసం తపన పడే అమ్మ ఆరోగ్యం గురించి పట్టించుకునేవారు ఎవరు?!
ఈ విషయం గురించి ఆలోచించిన **వరికుప్పల సంధ్య**
'అమ్మ-ఆరోగ్యం' పేరుతో మహిళలకు యోగాసనాలు నేర్పిస్తోంది.
మంచి ఆహారపు అలవాట్లను చెబుతూ 'అమ్మ ఆరోగ్యంగా ఉంటేనే
ఆ కుటుంబం మొత్తం బాగుంటుంది అనే విషయాన్ని అందరికీ
అర్థమయ్యేలా చేస్తోంది.



తెలంగాణలోని మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామవాసి అయిన వరికుప్పల సంధ్య నల్లగొండ పట్టణంలో 'అమ్మ – ఆరోగ్యం' పేరుతో మహిళలకు యోగా నేర్పిస్తోంది. కర్ర సపోర్ట్‌తో యోగా నేర్పించడం సంధ్య ప్రత్యేకత. ఇదే విషయాన్ని సంధ్య దగ్గర ప్రస్తావించినప్పుడు ఆమె పంచుకున్న విషయాలు ఇవి..

''అమ్మ, అమ్మమ్మలు ఆసనాలు వేసే సమయంలో వారి శరీరంలో కొద్దిగా వణుకు వస్తుంది. నిల్చోవడంలోనూ, ఆసనం ముద్రలోనూ ఎక్కువ సేపు బ్యాలెన్స్ చేయలేరు. అందుకే, కర్ర సపోర్ట్‌తో ఆసనాలు నేర్పిస్తున్నాను. 19 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళలు దాదాపు 200 మంది వరకు ప్రతి రోజూ ఇక్కడ యోగసాధన చేస్తున్నారు.

బరువు తగ్గడానికి

మూడేళ్ల క్రితం మాట.. నేను 72 కిలోల బరువు ఉండేదాన్ని. దీంతో పాటు థైరాయిడ్, షుగర్, మైగ్రేన్, కీళ్లనొప్పులు ఉండేవి.



డిప్రెషన్ లాంటిది బాధించేది. 'ఏమీ చేయలేనా?' అనే నిరాసక్తత ఆవరించేది. అలాంటిది ఓ రోజు షాపింగ్‌లో ఉన్నప్పుడు ఒక చిన్న యోగా పుస్తకం కంటపడింది. దీంతో గురువు లేకుండానే యోగాసనాలు సాధన చేశాను. నాపైన నేనే ప్రయోగాలు చేయడం మొదలుపెట్టాను. యోగా, ఆహార నియమాలతో మెల్లగా పద్దెనిమిది కేజీల బరువు తగ్గించుకోగలిగాను. దీంతో నాలో కొత్త ఉత్సాహం మొదలైంది. యోగా స్టాటిస్టిక్స్ బోర్డు (వైసీబీ) నిర్వహించే పరీక్షలను ఆన్‌లైన్‌లో రాసి 'యోగా టీచర్ అండ్ ఎవాల్యుయేటర్' సర్టిఫికెట్ పొందాను.

కాలనీలో మొదలుపెట్టి...

కరోనా సమయంలో మేడపైన యోగాసనాలు వేస్తుండగా ఇరుగుపొరుగు మహిళలు చూసి తమకూ ఆసనాలు నేర్పించాలని కోరారు. అలా.. ఒకరిద్దరితో మొదలై మా కాలనీలో పదిహేను మంది రోజూ వచ్చి యోగసాదన చేసేవారు. వారిలో కొందరు బరువు తగ్గడం, ఆరోగ్యం మెరుగవడంతో మరింత మంది శిక్షణ కోసం రావడం మొదలుపెట్టారు. వారందరికీ ఉచితంగానే శిక్షణ ఇస్తూ వచ్చాను.

నాలుగు బ్యాచ్‌లు

శిక్షణ కోసం వచ్చేవారి సంఖ్యను బట్టి బ్యాచ్‌లుగా చేశాను. రోజూ ఉదయం 4 గంటల నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు యోగా కోసం టైం కేటాయించాను. ఇప్పుడు మొత్తం నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నాను. ప్రతి బ్యాచ్‌కు 40 మందికి పైనే ఉంటారు. అరవై ఏళ్ళ పైబడిన వారు కూడా యోగ సాధన చేస్తున్నవారిలో ఉన్నారు. విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారికి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నాను. ఒకరి ద్వారా మరొకరికి తెలిసి సాధన చేసేవారి సంఖ్య పెరుగుతోంది.

బ్యాలెన్స్ కోసం కర్ర

యోగాసనాలు వేస్తున్నప్పుడు, కొందరు పెద్దవాళ్లు నిలుచుని స్టాండింగ్ ఆసనాలు వేస్తున్నప్పుడు వణుకురావడం, బ్యాలెన్స్ కోల్పోయి పడిపోవడం గమనించాను. దీంతో వెదురు కట్టెను బ్యాలెన్స్ కోసం ఎంచుకున్నాను. నటరాజాసనం, పక్షి ఆసనం, వృక్షాసనం, అర్ధచంద్రాసనం, త్రికోణాసనం, పవనముక్తాసనం, ధనురాసనం, హనుమాసనం, భద్రాసనం.. వంటి ఆసనాలు వేసేటప్పుడు బాడీ స్టిఫ్‌గా ఉండేందుకు పొడవాటి కర్రలు సహాయపడతాయి. కర్ర సాయంతో ఆసనం ముద్రలో కొంతసేపు అలాగే ఉండవచ్చు. దీంతో స్టిక్‌యోగా ఇక్కడకు వచ్చే మహిళలకు బాగా నచ్చింది' అని వివరించారు ఈ యోగా ట్రైనర్.

– బొడ్డు జనార్దన్‌రెడ్డి, సాక్షి, నల్లగొండ

ఫొటోలు : కంది భజరంగ్ ప్రసాద్

> **అనారోగ్యాలు దూరం**
>
> మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి యోగా మంచి పరిష్కారం. అమ్మాయిల్లో రుతుక్రమం, ప్రసవం తరువాత వచ్చే సమస్యల నుంచి యోగా ద్వారా బయటపడవచ్చు. అలాగే, వయసు పైబడినవారు యోగసాధన చేస్తే శరీరం ఫ్లెక్సిబుల్‌గా ఉండి, కీళ్ల నొప్పుల సమస్య దరిచేరదు. యోగాతో పాటు మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.
>
> – వరికుప్పల సంధ్య, యోగా ట్రైనర్

• గెలుపు దారి

ఆట గెలిచింది!

విజయానికి వయసుతో పనిలేదు.
ఇష్టంతో కూడిన కష్టంతోనే అసలైన పని.
నలభై ప్లస్ వయసులో కుమారుడి దగ్గర వీడియో గేమ్స్ ఆడడం నేర్చుకున్న జమ్మూకు చెందిన రీతూ స్లాతియా యూత్‌తో పోటీ పడుతూ ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకుంది...


రీతూ స్లాతియా

రీతూ స్లాతియకు పెద్ద చదువులు చదువుకొని ఉద్యోగం చేయాలనే కల ఉండేది. అయితే పదవ తరగతి పూర్తికాగానే చదువు మాన్పించారు తల్లిదండ్రులు.

'కాలేజీ అక్కడెక్కడో ఉంది. అమ్మాయిని ఒంటరిగా అంతదూరం ఎలా పంపగలం!' అనేవాళ్లు.

కొన్ని సంవత్సరాల తరువాత రీతూకు పెళ్లి అయింది. ఇంటి పనుల్లో పూర్తిగా మునిగిపోయింది.

'ఏమీ చేయలేకపోతున్నానే' అని తనలో అసంతృప్తి ఉండేది.

'ఏం చేయగలను. నేను చదివిన చదువుకు ఉద్యోగం ఎక్కడ వస్తుంది!' అని తనకు తాను సర్ది చెప్పుకునేది.

అయితే రీతూ కొడుకు తరచు మొబైల్‌లో వీడియో గేమ్స్ ఆడుతూ కనిపించేవాడు. ఆ సమయంలో అతడు వేరే ప్రపంచంలో ఉన్నట్లుగా అనిపించేది.

కొడుకు ఆనందాన్ని చూసి తనకు కూడా ఆడాలనిపించింది.

'అడిగితే ఏం అనుకుంటాడో...' అనే సందేహంతో చాలారోజులు అడగలేకపోయింది.

ఒకరోజు మాత్రం 'నేను కూడా ఆడతాను' అని కొడుకుని అడిగింది. చాలా సంతోషంగా ఫీలైన అబ్బాయి 'ఇలా ఆడాలమ్మా' అంటూ వీడియోగేమ్స్ ఆడడం నేర్పించాడు. ఇక అప్పటి నుంచి ఏ కాస్త తీరిక దొరికినా మొబైల్‌లో గేమ్స్ ఆడేది.

ఒక సంవత్సరం తరువాత...

లైవ్‌స్ట్రీమింగ్ గేమ్స్ గురించి తెలుసుకొని స్ట్రీమింగ్ అండ్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ 'రూటర్'లోకి అడుగుపెట్టింది రీతూ. తక్కువ సమయంలోనే ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకొని మంచి ఆదాయాన్ని అర్జించడం ఆరంభించింది. ఆమెకు 'రూటర్'లో 3.5 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు.

పొద్దున పూజ చేసి, వంట పూర్తయిన తరువాత ఎనిమిదింటికల్లా కంప్యూటర్ ముందు కూర్చొని లైవ్ గేమ్‌ప్లేలోకి వెళ్లిపోతుంది రీతూ.

బీజీఎంఐ(బ్యాటిల్ గ్రౌండ్స్ మొబైల్ ఇండియా)తో గేమ్స్‌తో ఆడడం మొదలుపెట్టిన రీతూ ఆ తరువాత ఫాలోవర్స్ బేస్‌ను దృష్టిలో పెట్టుకొని కొత్త కొత్త గేమ్స్‌ను ట్రై చేయడం నేర్చుకుంది.

'నేను వీడియో గేమ్స్‌ను ఆడుతున్న కొత్తలో, చిన్నపిల్లలా ఈ ఆటలు ఏమిటి! అనేవారు. ఇక స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లోకి వచ్చిన తరువాత నన్ను చూసి నవ్వని వారు లేరు. ఇలాంటి పరిస్థితుల్లోనూ నా కుటుంబ సభ్యులు నన్ను ఉత్సాహపరిచారు. వారి ప్రోత్సాహమే నేను ప్రొఫెషనల్ గేమర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది. ఒకప్పుడు నవ్విన వాళ్లే నాకు వచ్చిన పేరును చూసి అభినందిస్తున్నారు' అంటుంది 44 సంవత్సరాల రీతూ స్లాతియా.



కొత్త సంతకం


ఒకప్పుడు గేమింగ్‌లో మహిళలు తక్కువగా ఉండేవారు. అయితే ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ గేమర్స్‌లో 43 శాతం మంది మహిళలే ఉన్నారు. గేమింగ్ పట్ల మహిళలు ఆసక్తి చూపించడం ఒక కోణం అయితే, దానిని ఫుల్-టైమ్ కెరీర్‌గా ఎంచుకోవడం మరో కోణం. 'గేమింగ్ ల్యాండ్ స్కేప్' స్టడీ ప్రకారం గేమింగ్ వల్ల ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు రిలాక్సేషన్ వస్తుందని ఎక్కువ మంది మహిళలు నమ్ముతున్నారు.

మహిళా గేమర్స్ కోసం ప్రత్యేకమైన బ్యానర్స్, సెక్షన్‌లు ఏర్పాటు చేసినట్లు చెబుతున్నాడు రూటర్ ఫౌండర్, సీయివో పీయూష్ కుమార్. ఇతర దేశాలకు చెందిన ఫిమేల్ డెవలపర్స్ నుంచి స్ఫూర్తి పొంది మహిళా గేమర్స్‌ను దృష్టిలో పెట్టుకొని ఎగ్జాయిటింగ్ గేమ్స్, కొత్త ఫార్మట్‌లను మన దేశానికి చెందిన గేమింగ్ కంపెనీలు క్రియేట్ చేస్తున్నాయి.

బ్యూటిప్స్

చర్మకాంతికి మేలైన ప్యాక్స్

- ఆలివ్ ఆయిల్, పెరుగు, తేనె ఈ మూడూ సమపాళ్లలో తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించి 10–15 నిమిషాలు ఉంచాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరచాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మం మృదువుగా అవుతుంది.
- అర టీ స్పూన్ సహజసిద్ధమైన గంధంపొడిలో రోజ్‌వాటర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో శుభ్రపరచాలి. ఈ ఫేస్‌ప్యాక్ వారంలో రెండు సార్లు వేసుకున్నా ముఖంపై మురికి, మచ్చలు తగ్గి చర్మ కాంతి పెరుగుతుంది.
- సహజసిద్ధమైన బ్లీచింగ్‌గా పనిచేసే దోస లేదా కీరను గుజ్జుగా చేయాలి. ఈ గుజ్జు ముఖానికి, మెడకు, చేతులకు రాసి, మృదువుగా రబ్ చేయాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. జిడ్డు చర్మం గలవారు వారానికి ఒకసారి ఈ ప్యాక్ వేసుకుంటే కాంతి పెరుగుతుంది.



ఇంటిప్స్



- వజ్రాలు లేదా ఇతర రాళ్ల ఆభరణాలను శుభ్రం చేయాలంటే, కొద్దిగా వాషింగ్ పౌడర్ కలిపి మరిగించిన నీటిలో పదిహేను నిమిషాలపాటు నానబెట్టాలి. తర్వాత వాటిని బయటకు తీసి శుభ్రమైన వెల్వెట్ క్లాత్‌తో తుడిచేస్తే జిగేల్మని మెరుస్తాయి.
- వాతావరణంలో మార్పుల వల్ల దంతపు వస్తువులు తెల్లదనం పోయి పసుపుగా మారుతుంటాయి. అలాంటప్పుడు వాటిని నిమ్మచెక్కతో రుద్దితే తిరిగి తెల్లగా మిలమిలలాడతాయి.
- ఫర్నీచర్‌కు పట్టిన మరకలు పోయి కొత్తవాటిలా మెరవాలంటే టేబుల్ స్పూన్ వెనిగర్‌లో అంతే మోతాదు ఆలివ్ ఆయిల్ కలిపి తుడిస్తే సరి!
- వెండి వస్తువులు తెల్లగా మెరవాలంటే బూడిదతో కాని బూడిదలో ఉప్పు కలిపి కానీ రుద్దాలి. వైట్ టూత్ పేస్ట్‌తో రుద్దినా మంచి ఫలితం కనిపిస్తుంది.



- ముత్యాల ఆభరణాలను గాలి తగిలేవిధంగా జాగ్రత్త చేయాలి. ఎక్కువ రోజులు గాలి చొరని బీరువాలలో ఉంచితే రంగు మారతాయి. అందువల్ల వాటిని ధరించే ముందు మెత్తటి వస్త్రంతో మెరుగు పెట్టినట్లు సున్నితంగా తుడవాలి.

• చేయూత

ఆత్మబలమే ఆయుధమై


కోల్‌కతాలో జరిగిన వర్క్‌షాప్

కొండంత కష్టం వచ్చినప్పుడు కొండంత దిగులు కంటే... పిడికెడు ధైర్యం కావాలి! ఆ ధైర్యం ఇచ్చే శక్తి ఎంత గొప్పదంటే మనల్ని కొత్త మనుషులుగా మారుస్తుంది!!

పదిహేను సంవత్సరాల వయసులో మానవ అక్రమ రవాణా ముఠా నుంచి రక్షించబడింది కోల్‌కత్తాకు చెందిన పియూ మొండల్. ఆ తరువాత ఆమె ఒక పునరావాస కేంద్రంలో తలదాచుకుంది. అక్కడ తనలాంటి వాళ్లు ఎంతోమంది పరిచయం అయ్యారు. ఒకరి బాధలను ఒకరు పంచుకున్నారు.

'బాధితుల మనసు బాధితులకే తెలుస్తుంది' అనుకున్న పియూకు 'బాధితులందరూ కలిసి ఓ స్వచ్ఛంద సంస్థ ప్రారంభిస్తే ఎలా ఉంటుంది?' అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన ఇండియన్ లీడర్‌షిప్ ఫోరమ్ అగేనెస్ట్ ట్రాఫికింగ్ (ఐఎల్ఎఫ్ఏటీ)గా ఆచరణ రూపం దాల్చింది.

పశ్చిమబెంగాల్‌లోని సుందర్‌బన్ జిల్లా కేంద్రంగా మొదలైన ఈ స్వచ్ఛందసంస్థ మానవ అక్రమ రవాణా బాధితుల్లో ఎంతో ధైర్యాన్ని నింపింది.

'మేమందరం కలిసి ప్రారంభించిన మా సంస్థ' అని పదిమందిలో గర్వంగా చెప్పుకునేలా చేసింది.

పదుల సంఖ్యలో మొదలైన 'ఐఎల్ఎఫ్ఏటీ' ఇప్పుడు 5,000 మంది సభ్యులు ఉన్న బలమైన సైన్యంగా మారింది.

'ఒక కుటుంబంలో అయిదారుగురు సభ్యులు ఉండవచ్చు. మా కుటుంబంలో మాత్రం వేలాది మంది ఉన్నారు' అని సభ్యులు గర్వంగా మురిసిపోతుంటారు.

కేవలం చెప్పుకోవడానికి పరిమితం కాకుండా ఎవరికి ఏ కష్టం వచ్చినా ఒకరికొకరు అండగా నిలుస్తుంటారు.

మన దేశంలో వివిధ రూపాల్లో మానవ అక్రమ రవాణా అనేది పెద్ద సమస్యగా ఉంది. బాధితులను రక్షించే నెపంతో వ్యభిచారకూపంలోకి దింపిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఎవరిని నమ్మాలన్నా భయంగా ఉండేది. ఈ నేపథ్యంలో 'ఐఎల్ఎఫ్ఏటీ' బాధితులకు పెద్ద అండగా నిలబడింది.

పరిస్థితి చేయిదాటి పోయిన తరువాత ఈ సంస్థను ఆశ్రయించేవారు కొందరైతే, ప్రమాదాన్ని ఊహించి సంస్థను ఆశ్రయించే వారు కొందరు.

సభ్యులు ఆర్థికంగా సొంతకాళ్ల మీద నిలబడేలా చేయడంలో 'ఐఎల్ఎఫ్ఏటీ' విజయం సాధించింది. స్త్రీ సాధికారతకు సంబంధించి గ్రామీణప్రాంతాల్లో ఎన్నో వర్క్‌షాప్‌లతో పాటు హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తోంది సంస్థ.

'సాధ్యం అవుతుందా అనే సందేహం వచ్చినప్పుడు ఎన్నో సందేహాలు చుట్టుముట్టాయి. సాధించాల్సిందే...తప్పదు అనుకున్నప్పుడు ఎంతో సంకల్పబలం వచ్చింది. ఆ బలమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది' అంటుంది ఐఎల్ఎఫ్ఏటీ అధ్యక్షురాలు పియూ మొండల్.

> 'సాధ్యం అవుతుందా అనే సందేహం వచ్చినప్పుడు ఎన్నో సందేహాలు చుట్టుముట్టాయి. సాధించాల్సిందే... తప్పదు అనుకున్నప్పుడు ఎంతో సంకల్పబలం వచ్చింది. ఆ బలమే మమ్మల్ని ముందుకు నడిపిస్తోంది
>
> - పియూ మొండల్

ఎవరెవరు ఎక్కువగా తాగాలి?

- ఎక్కువగా ఆకుకూరలు తినని వారు
- మలబద్ధకం ఎక్కువగా ఉన్నవారు
- రక్తపోటుతో బాధపడేవారు
- రక్తసరఫరా వ్యవస్థలో లోపాలు ఉన్నవారు
- కిడ్నీలో రాళ్లు ఉన్నవారు
- ఆర్థరైటిస్ వంటి వ్యాధులు ఉన్నవారు
- గర్భవతులు, పాలిచ్చే తల్లులు
- జీర్ణసమస్యలు ఉన్నవారు మిగతావారితో పోలిస్తే మరిన్ని నీళ్లు తాగాలి.



దగ్గు, జలుబు సహజంగానే ఇలా తగ్గు

గత కొద్దిరోజులుగా వాతావరణంలో వస్తున్న రకరకాల మార్పుల వల్ల దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారు ఎక్కువగా కనిపిస్తున్నారు. చాలామంది మెడికల్ షాప్‌కు వెళ్లి వాళ్లు ఇచ్చిన మందులు తెచ్చుకుని వేసుకుంటూ ఉంటారు. అది చాలా ప్రమాదం. దానివల్ల రకరకాల దుష్ఫలితాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు వైద్యులు. దగ్గు, జలుబుకు సహజమైన చిట్కాలు పాటించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. అవేమిటో తెలుసుకుందాం.

అసలు దగ్గు, జలుబు రాకుండా ఉండాలంటే రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తిన్నట్లయితే తొందరగా ఈ అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బలవర్ధకమైన ఆహారం తీసుకొని శరీరాన్ని బలంగా ఉంచుకుంటే, అసలు ఇవి రాకుండానే ఉంటాయి. జలుబు, దగ్గు వంటి సమస్యల నివారణకు యాంటీబయాటిక్స్ ఉపయోగించటం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

సహజ చిట్కాలు... ● తులసి ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీటిని తాగితే జలుబు, దగ్గు నుండి ఉపశమనం లభిస్తుంది. రోజుకు రెండుసార్లు పసుపు, వేడి పాలను కలిపి తీసుకుంటే కూడా ఉపశమనం దొరుకుతుంది ● మిరియాల కషాయాన్ని తాగినా, లవంగాలు బుగ్గన పెట్టుకుని వాటి రసాన్ని మింగుతున్నా, వేడి వేడి మసాలా టీ తయారు చేసుకొని తాగినా మంచి ఫలితం ఉంటుంది ● చెంచాడు నిమ్మ రసాన్ని, రెండు స్పూన్ల తేనెను వేడినీళ్లలో కలుపుకొని తాగితే ఉపశమనం దొరుకుతుంది ● అల్లాన్ని దంచి కషాయం చేసుకుని తాగినా, అల్లం టీ చేసుకుని తాగినా కూడా రిలీఫ్ ఉంటుంది ● కొద్దిగా పసుపు, ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో పుక్కిట పట్టడం వల్ల గొంతుకు ఉపశమనం దొరుకుతుంది ● కొన్ని తులసి ఆకులు, చిన్న అల్లం ముక్క, కొన్ని వెల్లుల్లి ముక్కలు, టీ స్పూన్ వాము, మెంతులు, పసుపు, నాలుగైదు నల్ల మిరియాలు వేసి నీళ్లు పోసి బాగా మరిగించి కషాయం తయారు చేసుకుని తాగితే మరింత మంచి ఫలితం ఉంటుంది.

వేడినీళ్లకే ఓటేయండి... ● దగ్గు, జలుబుతో బాధపడేవారు శీతల పానీయాల జోలికి వెళ్లకుండా ఉండటం మంచిది. అదేవిధంగా ఫ్రిజ్‌లో నుంచి తీసిన చల్లటి నీళ్లను తాగడానికి బదులు ఎప్పుడు నీళ్లు తాగినా కాస్త వేడిగా ఉన్న నీటిని మాత్రమే తాగడం మంచిది.

ఈ పండ్లు మంచిది... పైనాపిల్, నిమ్మ, కివి వంటి పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కూడా జలుబు, దగ్గు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది.

నీరు సరిగా తాగే తీరు





మీరు మంచినీళ్లు రోజుకు ఎన్ని సార్లు తాగుతారంటే.. దానికి లెక్క ఏముంది, దాహం వేసినప్పుడు తాగుతాం కదా అనుకుంటారు, అంటారు కూడా. ఎండలో కష్టం చేసే వారి సంగతి సరే, రోజు ఏసీ గదుల్లో ఉంటూ ఎంతమంది తగినన్ని నీళ్లు తాగుతున్నారు? కొందరయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. నీళ్లు తాగాలంటే బద్ధకంగా ఫీలయే వారు కొందరు. నిజానికి నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందక పోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. నీళ్లను కూడా పద్ధతి ప్రకారం తాగడం ఎంతో ప్రయోజనకరం. అదెలాగో తెలుసుకుందాం.

మనలో 60 శాతం నీరే ఉంటుంది. ఎందుకంటే, మన శరీరంలోని దాదాపు అన్ని జీవక్రియలూ నీళ్ల వల్లే జరుగుతాయి. అందుకే మనిషి మనుగడకు నీళ్లు చాలా అవసరం. వివిధ ప్రక్రియలలో భాగంగా మన కణాల్లోని నీరు బయటకు వెళ్లిపోవడం వల్ల చర్మం తన బిగుతును కోల్పోతుంది. అప్పుడు గిచ్చినట్లుగా చర్మాన్ని మెలిపెడితే, అది వెంటనే యథాతథ స్థితికి రాకుండా ముడుచుకుపోతుంది. ఇలా చేయడం ద్వారానే మనకు డీ హైడ్రేషన్ పరిస్థితి వచ్చిందా అన్న అంశాన్ని డాక్టర్లు తెలుసుకుంటారు. ఇలా జరిగినప్పుడు... మనం కోల్పోయిన స్రావాలను... నీళ్లు, ఖనిజ లవణాలతో భర్తీ చేయాల్సి ఉంటుంది. అలా భర్తీ చేయడం చాలా అవసరం. లేదంటే అది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చు.

ఎప్పుడెప్పుడు తాగాలి?

ఉదయం నిద్ర లేవగానే ముందుగా నీళ్లు తాగాలి. శరీరంలో నిద్ర సమయంలో లోపించిన ద్రవాల భర్తీకి ఇది ఒక మంచి మార్గం. అంతే కాదు... ఇలా తాగడం వల్ల నిద్రించే సమయంలో మన శరీరంలో పేరుకుపోయిన మాలిన్యాలను కూడా తొలగిస్తాయి. వ్యాయామానికి ముందు, తర్వాత నీళ్లు తాగాలి. అయితే వెంటనే కాకుండా కాస్త వ్యవధి ఇచ్చి తాగాలి. డీహైడ్రేషన్‌కూ, శరీరంలో విషపదార్థాలకూ ఆస్కారం ఇచ్చే కూల్‌డ్రింక్స్‌ను వీలైనంతగా తగ్గించాలి.

నీళ్లు సరిగ్గా తాగకపోతే వచ్చే సమస్యలు ఏంటి?

మీరు కుర్చుని లేవలేక పోతున్నారా... కీళ్లు, కండరాలు నొప్పులతో అవస్థపడుతున్నారా... అయితే మీరు తక్కువ నీళ్లు తాగుతున్నారన్నమాట. ఎందుకంటే.. కీళ్లమధ్యలో ఉండే కార్టిలేజ్ 80 శాతం నీటితో నిర్మితమై ఉంటుంది. మీరు నీళ్లు తక్కువగా తాగినప్పుడు ఈ నొప్పుల వస్తాయి..

నీరు తక్కువగా తాగినప్పుడు తలనొప్పి వేధిస్తుంటుంది. ఆక్సిజన్ తక్కువగా అందడం, మెదడుకి రక్త సరఫరా తక్కువ కావడం వంటివి డీహైడ్రేషన్ ద్వారా కలుగుతాయి. దీంతో తల నొప్పి వస్తుంది.

అలసట, ఎనర్జిటిక్‌గా, యాక్టివ్‌గా లేకపోవటం అనేవి తక్కువ నీరుకు సంబంధించినదే... బ్లడ్ ప్రెజర్ తగ్గిపోతుంది. దీనివల్ల ఆక్సిజన్ సరిగా అందదు. ఇలాంటి లక్షణాలు మీలో కనిపించాయి అంటే.. మీరు శరీరానికి కావాల్సిన మోతాదులో నీళ్లు తాగడం లేదని అర్థం.

వేసవిలో ఇంకాస్త ఎక్కువగా...

మన జీవక్రియలన్నీ సక్రమంగా జరగడానికి ఎప్పుడూ 98.4 డిగ్రీల ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతే కావాలి కదా. అందుకే... చెమట పట్టేలా చేయమని స్వేద గ్రంథులను మెదడు ఆదేశిస్తుంది. చెమట పట్టగానే... బయటి నుంచి వీచే గాలి వల్ల మన చర్మంపైనున్న చెమట ఆవిరి అవుతుంటుంది. ఇలా ఆవిరి కావాలంటే చెమట నీటికి కొంత ఉష్ణోగ్రత అవసరం. అప్పుడా చెమటనీరు మన దేహంలోని లేటెంట్‌హీట్ అనే ఉష్ణాన్ని తీసుకుని ఆవిరై పోతుంది. ఇలా మన దేహంలోంచి కొంత ఉష్ణోగ్రత తొలగగానే ఆ మేరకు ఒళ్లు చల్లబడుతుంది. ఇలా మనం ఎండలోకి వెళ్లగానే చల్లబరిచే ప్రక్రియ అదేపనిగా జరుగుతూ దేహ ఉష్ణోగ్రత స్థిరంగా ఉండేలా మెదడులోని మెకానిజమ్ తన కార్యకలాపాలను నిర్వహిస్తుంది. అంటే మన దేహంలోని ఉష్ణోగ్రత స్థిరంగా ఉండటానికి తగినన్ని నీళ్లు లేవనుకోండి. అప్పుడు చెమట పట్టడానికి అవసరమైన నీరు లేక దేహం చల్లబడే ప్రక్రియ జరగక చర్మం ఎర్రబారిపోతుంది. ఇదే వడదెబ్బ తగలడానికి ముందుగా కనిపించే తొలి లక్షణం. ఇలాంటి సమయాల్లో ఒంట్లోకి తగినన్ని ద్రవాలను భర్తీ చేయాలి. ఇందుకోసం నీళ్లు, ఖనిజ లవణాలను అందించాలి.

ఈ సమస్య తలెత్తకుండా ఉండాలంటే తగినన్ని నీళ్లు తాగాలి.

ఇలా తాగడం మంచిది!

ఒకేసారి ఎక్కువ నీళ్లు తాగకూడదు. గుక్క గుక్కగా తాగుతూ ఉండాలి. నీళ్లు మరీ చల్లగా గాని, మరీ వేడిగా గాని ఉండకూడదు. గది ఉష్ణోగ్రత వద్ద ఉండాలి. ఏదైనా తినడానికి అరగంట ముందు నీళ్లు తాగడం మంచిది. తినేటప్పుడు నీళ్లు తాగకూడదు. ఎందుకంటే నీళ్లతోపాటు గ్యాస్ కూడా లోపలికి వెళ్ల తగినంతగా తినలేరు. పైగా ఆ గ్యాస్ పైకి తన్నుతూ ఉండటం వల్ల తేన్పుల్లా వస్తుంటాయి. అందుకే ఆహారం సాఫీగా లోపలికి వెళ్లడానికి అరగ్లాసు నీళ్లు గుటక వేస్తే చాలు. ఆ తర్వాత మళ్లీ దాహం వేసినప్పుడే నీళ్లు తాగాలి.

● బీరకాయ

సాధారణంగా జ్వరం వచ్చి తగ్గినప్పుడు పథ్యం కూరలా బీరకాయ వండుతుంటారు. బీరకాయలో కొవ్వులు తక్కువగా, నీరు, పీచుపదార్థం ఎక్కువగా ఉండి, పోషకాలు అధికంగా ఉండడంతో పాటు తొందరగా జీర్ణం కావడమే అందుకు కారణం.

నిజానికి బీరకాయను పథ్యం కూరలా కాదు, ఆహారంలో తరచు భాగం చేసుకోవడం ఎంతో మంచిది. ఎందుకంటే, బీరపాదు మొత్తం ఔషధపూరితం అని వైద్యులు అంటున్నారు. సాధారణ, నేతి బీరకాయ- రెండు రకాల కాయల్లోనూ పీచు, విటమిన్-సి, జింక్, ఐరన్, రిబోఫ్లేవిన్, మెగ్నీషియం, థయామిన్... వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెల్యులోజ్ ఎక్కువగా ఉండటంతో ఇది మలబద్ధకాన్నీ మొలలవ్యాధినీ నివారిస్తుంది. ● బీరకాయల్లోని పెప్టైడ్‌లు, ఆల్కలాయిడ్‌లు రక్తంలోనూ మూత్రంలోనూ ఉండే చక్కెర నిల్వల శాతాన్ని తగ్గించేందుకూ తోడ్పడతాయి. మాంగనీసు జీర్ణక్రియా ఎంజైముల ఉత్పత్తిని పెంచడం ద్వారా చక్కెరవ్యాధినీ నియంత్రిస్తుంది. ● రక్తశుద్ధికీ కాలేయ ఆరోగ్యానికీ తోడ్పడుతుంది. దెబ్బతిన్న కాలేయాన్నీ రక్షిస్తుంది. ● కామెర్లు వచ్చినవాళ్లు బీరకాయ రసం తాగడంవల్ల మంచి ఫలితం ఉంటుందనీ దీని వల్ల ఎలాంటి ఇన్ఫెక్షన్లూ రావనీ రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తుందనీ తేలింది. ● అల్సర్లూ మంటలతో బాధపడేవాళ్లకి బీరకాయ మందులా పనిచేస్తుంది. ● బీరకాయలోని విటమిన్-ఎ కంటికండరాల బలహీనత కారణంగా తలెత్తే అంధత్వాన్ని నివారిస్తుందని జాతీయ అంధత్వ నివారణ సంస్థ పేర్కొంటోంది. ఇందులోని విటమిన్ బి5 చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందట. ● బీరకాయల్లోని విటమిన్ బి6 అనీమియాను నివారించగలదనీ తేలింది.

ఇన్ని ప్రయోజనాలున్న బీరకాయను పథ్యంలా కాకుండా తరచు తీసుకోవడమే మంచిది కదా మరి.

పథ్యంలా కాదు... ప్రధానంగా తీసుకోండి



● హెల్త్ టిప్స్



- ముల్లంగిని కూరగా చేసుకుని గానీ, దంచిన రసంగా గానీ తాగాలి. పల్లేరు సమూలంగా కషాయం చేసుకుని తాగితే మూత్ర సంబంధి సమస్యలు తగ్గుతాయి.
- ముద్దగా ఉన్న ఇంగువను నిమ్మరసంతో కలిపి నూరి కొద్దిగా వెచ్చచేసి దూదిని దానిలో ముంచి తడిపి పంటి నొప్పి వున్నచోట పెడితే పంటి నొప్పి తగ్గిపోతుంది.
- వంద గ్రాముల వాము శుభ్రం చేసి ఎర్రగా వేయించి, మెత్తగా పొడిచేసి డబ్బాలో నిల్వ ఉంచుకొని గ్యాస్ట్రబుల్ ఉన్నప్పుడు ఒక చెంచా పొడిని నీళ్ళల్లోగాని, విడిగా గాని తీసుకుంటే ఎక్కువ తేన్పులు రాకుండా ఉంటుంది.
- బిళ్ళగన్నేరు ఆకుల్ని, జామ ఆకుల్ని సమతూకంలో తీసుకుని ముద్దచేసి ఈ ముద్దని ఐదు చెంచాల వంతున ఉదయం సాయంత్రం 3 రోజులు తీసుకుంటే అతిసార వ్యాధి తగ్గుతుంది.

సినిమా

అందుకే ఆ ధైర్యం చేశా!

- కృష్ణవంశీ

"ప్రతి నటుడిలో విభిన్న కోణాలు ఉంటాయి. వాటిని ప్రేక్షకులకు సరికొత్తగా చూపించడం నాకు ఇష్టం. విలన్‌గా చేస్తున్న చలపతిరావు గారిని 'నిన్నే పెళ్లాడతా'లో మంచి తండ్రిగా చూపించాను. బ్రహ్మానందంగారిలోని మరో నటుణ్ణి 'క్షణం క్షణం'లో చూశాను. అందుకే 'రంగ మార్తాండ'లోని చక్రి పాత్రలో ఆయన్ని ఊహించుకునే ధైర్యం చేశా.. ఆయన పాత్ర అద్భుతంగా వచ్చింది'' అన్నారు డైరెక్టర్ కృష్ణవంశీ.



● కృష్ణవంశీ, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో రాహుల్ సిప్లిగంజ్, శివాత్మిక, ఆదర్శ్, అనసూయ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'రంగమార్తాండ'. కాలిపు మధు, ఎస్. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదలైంది. ఈ సందర్భంగా కృష్ణవంశీ మాట్లాడుతూ- ''మరాఠీ చిత్రం 'నటసామ్రాట్' ప్రకాశ్‌రాజ్‌కి బాగా నచ్చింది. నన్నా సినిమా చూసి, స్క్రీన్‌ప్లేలో సాయం చేయమన్నాడు. నాలాంటి రాక్షసుడితోనే కంటతడిపెట్టించిన చిత్రమది. ఆ తర్వాత నాకు తోచిన మార్పులు ప్రకాశ్‌రాజ్‌కి చెబితే.. 'ఈ సినిమాకి నువ్వే దర్శకత్వం వహిస్తే బాగుంటుంది' అనడంతో ఓకే అన్నాను. మనుషులపై నాకు ఇంకా నమ్మకం పోలేదు. ఓ మంచి సినిమా తీస్తే ఆదరిస్తారనే నా నమ్మకాన్ని వారు 'రంగమార్తాండ' ద్వారా నిజం చేశారు. 1250కి పైగా సినిమాలు చేసిన బ్రహ్మానందంగారు ఒక్కో సీన్‌కి పదీ ఇరవై టేకులు చెప్పినా చేసేవారు. ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందంగారి నటన, ఇళయరాజాగారి సంగీతం సినిమాకి హైలైట్. శివాత్మిక, అనసూయ, రాహుల్, ఆదర్శ్ బెస్ట్ ఇచ్చారు. చిరంజీవిగారి వాయిస్ ఓవర్ ప్లస్సయింది'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు బ్రహ్మానందం.

● చిరంజీవి, రష్మిక, నితిన్



నాకు మరింత స్పెషల్

- నితిన్

హిట్ మూవీ 'భీష్మ' (2020) తర్వాత హీరో నితిన్, హీరోయిన్ రష్మికా మందన్నా, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం జరిగింది. నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా ప్రారంభోత్సవంలో దర్శకుడు బాబీ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో చిరంజీవి క్లాప్ ఇచ్చారు. గోపీచంద్ మలినేని గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు స్క్రిప్ట్‌ను అందించారు. ''చిరంజీవిగారు మా 'వీఎన్ఆర్ (వెంకీ, నితిన్, రష్మిక) ట్రయో'ను ఆశీర్వదించడంతో మా సినిమా నాకు మరింత స్పెషల్ అయ్యింది'' అని ట్వీట్ చేశారు నితిన్. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల.

యూత్‌ఫుల్ పార్టీ



● క్రిష్, అభిషేక్

క్రిష్ సిద్ధిపల్లి హీరోగా నటిస్తున్న 'రేవ్ పార్టీ' చిత్రం శుక్రవారం ఆరంభమైంది. బోనగాని ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్ పై రాజు బోనగాని దర్శకత్వం వహిస్తున్నారు. రాజు బోనగాని మాట్లాడుతూ- ''రేవ్ పార్టీలో ఏం జరుగుతుంది? ఈ పార్టీల మూలంగా కొందరు యువత జీవితాల్లో ఎలాంటి మలుపులు చోటు చేసుకుంటాయి? అనే అంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కన్నడంలో చిత్రీకరించాక ఈ సినిమాను మిగతా భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దిలీప్ బండారి.

వేసవిలో మళ్ళీ పెళ్లి



● పవిత్ర, నరేశ్

వీకే నరేష్, పవిత్రా లోకేష్ ముఖ్య తారలుగా దర్శక-నిర్మాత ఎమ్ఎస్ రాజు తెరకెక్కిస్తున్న ద్విభాషా (తెలుగు, కన్నడం) చిత్రం 'మళ్ళీ పెళ్లి'. విజయకృష్ణా మూవీస్‌పై వీకే నరేష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. విజయకృష్ణా మూవీస్ యాభైఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'మళ్ళీ పెళ్లి' సినిమాను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, సినిమాను ఈ వేసవిలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించింది చిత్ర యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎస్ బాల్ రెడ్డి.

బాలీవుడ్ దర్శకుడు ప్రదీప్ సర్కార్ ఇకలేరు



బాలీవుడ్ దర్శకుడు, ఆర్ట్ డైరెక్టర్ ప్రదీప్ సర్కార్ ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కోల్‌కతాలో 1955 ఏప్రిల్ 30న జన్మించారు ప్రదీప్ సర్కార్. సినిమాల్లోకి రాకముందు క్రియేటివ్ డైరెక్టర్, డైరెక్టర్‌గా పలు వాణిజ్య ప్రకటనలు, కొన్ని మ్యూజిక్ వీడియోలు చేశారాయన. సంజయ్ దత్ హీరోగా రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో వచ్చిన 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్' (తెలుగులో చిరంజీవి హీరోగా 'శంకర్‌దాదా ఎమ్‌బీబీఎస్'గా రీమేక్ అయింది)కు ఎడిటర్‌గా వర్క్ చేశారు ప్రదీప్ సర్కార్. ఆ తర్వాత 2005లో 'పరిణీత' (ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్, స్క్రీన్ డైరెక్టర్‌గా కూడా చేశారు)తో దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చారు ప్రదీప్. విద్యాబాలన్, సైఫ్ అలీఖాన్, సంజయ్ దత్, రీమాసేన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. సూపర్ హిట్టయిన ఈ చిత్రానికిగాను 53వ జాతీయ అవార్డుల్లో 'ఇందిరాగాంధీ అవార్డు ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ డైరెక్టర్' అవార్డును పొందారు. ఆ నెక్స్ట్ ఆయన 'లగా చునారీ మే దాగ్', 'మర్దానీ', 'హెలికాప్టర్ ఈలా' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. 'లగా చునారీ మే దాగ్' సినిమాకు రైటర్, ఆర్ట్ డైరెక్టర్‌గా చేశారు. అంతేకాదు..'అరేంజ్డ్ మ్యారేజ్', 'దురంగ' వంటి వెబ్ సిరీస్‌లకూ దర్శకత్వం వహించారు. ప్రదీప్ సర్కార్ మృతి పట్ల పలువురు బాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

నా అంతిమ లక్ష్యం అదే!

- రచయిత శ్రీకాంత్ విస్సా

''రవితేజగారితో ఇది వరకే 'ఖిలాడి' సినిమాకు వర్క్ చేశాను. ఇప్పుడు ఆయన హీరోగా చేసిన ఈ 'రావణాసుర'తో పాటు 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాకూ వర్క్ చేస్తున్నాను. నేను చెప్పే కథలు రవితేజ గారికి నచ్చుతున్నాయి. అందుకే ఆయనతో వెంట వెంటనే అసోసియేట్ కావడం వీలవుతోంది'' అన్నారు రైటర్ శ్రీకాంత్ విస్సా.




రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ చిత్ర రచయిత శ్రీకాంత్ విస్సా మాట్లాడుతూ-''ప్రతి హీరోలో ఓ విలన్ ఉన్నట్లే ప్రతి విలన్‌లో ఓ హీరో ఉంటాడు. 'రావణాసుర' కాన్సెప్ట్ అదే. ఆ రావణాసురుడిలో ఎన్ని షేడ్స్ ఉన్నాయో.. రవితేజగారి పాత్రలోనూ అన్ని ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2', కల్యాణ్ రామ్ 'డెవిల్' చిత్రాలు చేస్తున్నాను. నా అంతిమ లక్ష్యం దర్శకత్వమే'' అన్నారు.

తెలుగు హీరో.. కన్నడ డైరెక్టర్

సినిమా రంగంలో ప్రతిభ ఉంటే చాలు.. భాషాపరమైన హద్దులు బద్దలవుతాయి. టాలెంట్ ఉంటే పిలిచి మరీ అవకాశాలు ఇస్తుంటారు ఆయా హీరోలు, నిర్మాతలు. ఇదే కోవలో తాజాగా ప్రశాంత్ నీల్, హర్ష, నార్తన్ వంటి కన్నడ దర్శకులు తెలుగు స్టార్ హీరోలతో సినిమా చేసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు.. తెలుగు హీరోలతో ఆ కన్నడ దర్శకులు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.



● రామ్‌చరణ్-నార్తన్



● ప్రభాస్-ప్రశాంత్



● గోపీచంద్-హర్ష

● కన్నడలో 'ఉగ్రం' (2014) సినిమాతో డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టారు ప్రశాంత్ నీల్. ఆ తర్వాత నాలుగేళ్లకు యశ్ హీరోగా 'కేజీఎఫ్' (మొదటి భాగం 2018) మూవీతో కన్నడ ఇండస్ట్రీని పాన్ ఇండియా స్థాయికి తీసుకెళ్లారు. ఆ సినిమాకి సీక్వెల్‌గా వచ్చిన 'కేజీఎఫ్' (రెండవ భాగం 2022) చిత్రం కూడా సూపర్ హిట్ కావడంతో భారీ అవకాశాలు ప్రశాంత్ నీల్ డోర్‌ని టచ్ చేశాయి. అందులో భాగంగా పాన్ ఇండియా హీరోగా దూసుకెళుతున్న ప్రభాస్‌తో 'సలార్' మూవీ చేసే గోల్డెన్ చాన్స్ అందిపుచ్చుకున్నారు ప్రశాంత్. 'కేజీఎఫ్' నిర్మాత విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే మరో స్టార్ హీరో ఎన్టీఆర్‌తో సినిమా చేసే చాన్స్ అందుకున్నారు ప్రశాంత్ నీల్. 'సలార్' షూటింగ్ పూర్తి కాగానే ఎన్టీఆర్ సినిమా ప్రీ ప్రొడక్షన్‌ని ఆరంభించనున్నారు ప్రశాంత్ నీల్. కొరటాల శివతో చేస్తున్న సినిమా పూర్తయ్యాక ప్రశాంత్ సినిమా షూటింగ్‌లో అడుగుపెట్టేలా ప్లాన్ చేస్తున్నారట ఎన్టీఆర్.

● కథా బలం, యాక్షన్ సినిమాలతో కన్నడ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు డైరెక్టర్ ఎ. హర్ష. శివరాజ్‌కుమార్‌తో ఇటీవల ఆయన తెరకెక్కించిన 'వేద' సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఆయన తెలుగులో హీరో గోపీచంద్‌తో ఓ సినిమా చేస్తున్నారు. గోపీచంద్ కెరీర్‌లో 31వ చిత్రమిది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ ప్రొడక్షన్స్‌పై కేకే రాధా మోహన్ నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెలలోనే ప్రారంభమైంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతోంది.

● రామ్‌చరణ్ ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో చేస్తున్న చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం తర్వాత 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఓ మూవీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు చరణ్. అదే విధంగా మరో సినిమాని కూడా లైన్‌లో పెట్టారట. 'ముఫ్తీ' (2017) సినిమాతో దర్శకుడిగా కన్నడలో ఘనవిజయం అందుకున్న నార్తన్‌తో రామ్‌చరణ్ సినిమా చేయనున్నారని టాక్. ఇక 'ముఫ్తీ' తర్వాత కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్‌తో నార్తన్ తీసిన 'భైరతి రణగల్' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సినిమా చేస్తున్న సమయంలోనే రామ్‌చరణ్‌కు నార్తన్ ఓ కథ వినిపించగా, నచ్చడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని టాక్. శంకర్‌తో చేస్తున్న సినిమా తర్వాత బుచ్చిబాబు సినిమాని పూర్తి చేశాక నార్తన్ మూవీ చేస్తారట రామ్‌చరణ్.

ప్రశాంత్ నీల్, హర్ష, నార్తన్ మాత్రమే కాదు.. మరికొందరు కన్నడ దర్శకులు తెలుగు హీరోలతో సినిమాలు చేసేందుకు చర్చలు జరుపుతున్నారు.

వినోదం.. సందేశం

యువచంద్ర, శివ కుమార్, కౌటిల్య, సుదర్శన్ రెడ్డి హీరోలుగా ప్రియాంకా శర్మ , నేహా దేశ్ పాండే, హమీద హీరోయిన్లుగా నటించిన చిత్రం 'యమ డ్రామా'. టి. హర్ష చౌదరి దర్శకత్వంలో తోటకూర శివరామ కృష్ణారావు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం టైటిల్ లోగోను ప్రముఖ నటి విజయశాంతి విడుదల చేసి మాట్లాడుతూ- ''నేటి ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని, యూత్‌ఫుల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లుగా దర్శక- నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రం సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''వినోదం, భావోద్వేగాలతో పాటు యువతకు ఓ మంచి సందేశం కూడా ఈ చిత్రంలో ఉంది. సాయికుమార్ యముడి పాత్రలో నటించడం ఈ సినిమాకు ఓ హైలైట్'' అన్నారు టి. హర్షచౌదరి.



● విజయశాంతి, హర్ష

మంచి ప్రేమ కథ

రిష్వి తిమ్మరాజు, విస్మయశ్రీ జంటగా నూతన దర్శకుడు రాజేష్ దొండపాటి తెరకెక్కించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని డైరెక్టర్ శ్రీవాస్ రిలీజ్ చేశారు. ''మా 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్' సినిమా ఓ మంచి ప్రేమ కథగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కామెడీ, రొమాన్స్, యాక్షన్.. ఇలా అన్ని అంశాలు ఈ మూవీలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

● రిష్వి, విస్మయ



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	398	57,527
నిఫ్టీ ▽	132	16,945

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,741	▽ 46
డోజోన్స్	32,075	▽ 29
ఎఫ్‌టీఎస్ఈ 100	7,405	▽ 94
డాక్స్	14,957	▽ 253
షాంఘై	3,266	▽ 21
నికాయ్	27,385	▽ 34

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (24 క్యారెట్)	59,653	△ 567
బంగారం (22 క్యారెట్)	59,414	△ 567
వెండి (కేజీ)	69,756	△ 620

సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను పెంపు

- ఎఫ్అండ్‌వో కాంట్రాక్టులకు వర్తింపు
- ఎంఎఫ్ పెట్టుబడులపైనా పన్ను దెబ్బ
- డెట్ ఫండ్స్ పెట్టుబడులపై ప్రభావం



న్యూఢిల్లీ: ప్రభుత్వం ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్‌వో) విభాగంలో సెక్యూరిటీ లావాదేవీలపై పన్ను(ఎస్‌టీటీ) పెంచింది. దీంతోపాటు రుణ సెక్యూరిటీల(డెట్) మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపైనా స్వల్పకాలిక పన్నుకు తెరతీసింది. శుక్రవారం ఎస్‌టీటీసహా 64 సవరణలతో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023 ఫైనాన్స్ బిల్లు ఆమోదం పొందింది. వెరసి పన్ను సవరణలతోకూడిన 2023 ఫైనాన్స్ బిల్లు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. దీని ప్రకారం ఆప్షన్స్‌లో 0.05 శాతం నుంచి 0.0625 శాతానికి, ఫ్యూచర్ కాంట్రాక్టులలో 0.01 శాతం నుంచి 0.0125 శాతానికి ఎస్‌టీటీ పెరగనుంది. తద్వారా ప్రభుత్వ ఆదాయం బలపడటంతోపాటు.. ట్రేడింగ్ వ్యయాలు పెరగనుండటంతో మితిమీరిన లావాదేవీలకు చెక్ పడనున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల భారీ సంఖ్యలో రిటైల్ ఇన్వెస్టర్లు ఈ విభాగంలో నష్టపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ చర్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. ఆప్షన్స్‌లో తొలుత 0.017 శాతం నుంచి 0.021 శాతానికి ఎస్‌టీటీ పెరగనున్నట్లు వెలువడిన వార్తలు టైపింగ్ పొరపాటుగా ఆర్థిక శాఖ వివరణ ఇవ్వడం గమనార్హం!

డెట్ ఎంఎఫ్‌లపైనా..

తాజా బిల్లు ప్రకారం డెట్ ఎంఎఫ్ ఆస్తులలో 35 శాతానికి మించి ఈక్విటీలలో ఇన్వెస్ట్ చేయవలసి ఉంటుంది. అంతకంటే తక్కువగా ఈక్విటీలకు మళ్లించే ఎంఎఫ్‌లు స్వల్పకాలిక పెట్టుబడి లాభాల(క్యాపిటల్ గెయిన్) పన్ను చెల్లించవలసి వస్తుంది. తాజా నిబంధనల ప్రకారం డెట్ ఎంఎఫ్‌లు చేపట్టే 35 శాతంలోపు ఈక్విటీ పెట్టుబడులపై శ్లాబులకు అనుగుణంగా పన్ను చెల్లించవలసి వస్తుంది. ప్రస్తుత సవరణలతో మార్కెట్ ఆధారిత డిబెంచర్, అధిక శాతం నిధులను రుణ సెక్యూరిటీలలో ఇన్వెస్ట్ చేసే ఎంఎఫ్ మధ్య సారూప్యతకు తెరలేవనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇలాంటి ఎంఎఫ్‌లకు ప్రస్తుతం ఇండెక్సేషన్ లబ్ధితో కలిపి 20 శాతం దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్(ఎల్‌టీసీజీ) ట్యాక్స్ వర్తిస్తోంది.

ఆశ్చర్యకరం

ఎల్‌టీసీజీ సవరణలతోకూడిన 2023 ఫైనాన్స్ బిల్లు ఆశ్చర్యకరమని ఎంఎఫ్ పరిశ్రమ అసోసియేషన్(యాంఫీ) చైర్మన్, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ చీఫ్ ఎ.బాలసుబ్రమణ్యన్ పేర్కొన్నారు. తాజా మార్పులకు పరిశ్రమ సన్నద్ధం కావలసి ఉన్నట్లు తెలియజేశారు. కార్పొరేట్ బాండ్ల మార్కెట్ అభివృద్ధి ఎజెండాను బిల్లు దెబ్బతీసే వీలున్నట్లు పలువురు అసెట్ మేనేజర్లు అభిప్రాయపడ్డారు. పీఎస్‌యూ దిగ్గజాలు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లేదా నాబార్డ్ జారీ చేసే సెక్యూరిటీలకు డెట్ మ్యూచువల్ ఫండ్స్ అతిపెద్ద సబ్‌స్క్రయిబర్లన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సవరణలపై సమీక్షను చేపట్టవలసి ఉన్నట్లు యాంఫీ వైస్‌చైర్‌పర్సన్, ఎడిల్‌వీస్ ఏఎంసీ హెడ్ రాధికా గుప్తా పేర్కొన్నారు. దేశీయంగా ఫైనాన్షియలైజేషన్ ఇప్పుడిప్పుడే బలపడుతున్నదని, వైబ్రెంట్ కార్పొరేట్ బాండ్ల మార్కెట్‌కు పటిష్ట డెట్ ఫండ్ వ్యవస్థ అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. డెట్ ఎంఎఫ్‌లలో పెట్టుబడులకు దీర్ఘకాలిక నిధులు తగ్గిపోతే బాండ్ల జారీ సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించవలసి వస్తుందని బాలసుబ్రమణ్యన్ వివరించారు. తాజా బిల్లు కారణంగా రిటైల్ ఇన్వెస్టర్లకు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆకర్షణీయంగా కనిపిస్తాయని మరికొంతమంది నిపుణులు అంచనా వేశారు. కాగా.. మార్కెట్లు అనిశ్చితిలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్‌టీటీ పెంపు సరికాదని పారిశ్రామిక సమాఖ్య పీహెచ్‌డీసీసీఐ పేర్కొంది. ఇది మార్కెట్ సెంటిమెంటు, లావాదేవీల పరిమాణంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పీహెచ్‌డీసీసీఐ ప్రెసిడెంట్ సాకేత్ దాల్మియా అభిప్రాయపడ్డారు. ఎఫ్అండ్‌వో కాంట్రాక్టుల విక్రయంపై ఎస్‌టీటీ పెంపుపై ఆర్థిక శాఖ స్పష్టతను ఇవ్వవలసి ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

అదనపు లావాదేవీ చార్జీలు రద్దు

ఏప్రిల్ 1 నుంచి ఎన్ఎస్ఈ అమలు

ఈక్విటీ నగదు, డెరివేటివ్స్ విభాగాలలో విధిస్తున్న అదనపు లావాదేవీల చార్జీలను ఏప్రిల్ 1 నుంచి రద్దు చేస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా వెల్లడించింది. 2021 జనవరి 1 నుంచి 6 శాతం పెంపును అమలు చేస్తోంది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఎన్ఎస్ఈ తాజాగా తెలియజేసింది. ఎన్ఎస్ఈ ఇన్వెస్టర్ రక్షణ నిధి ట్రస్ట్(ఐపీఎఫ్‌టీ) మూలధనాన్ని(కార్పస్) పెంచేందుకు ఈ చార్జీలలో కొంత భాగాన్ని వినియోగిస్తోంది. రెండేళ్ల క్రితం బ్రోకర్ వైఫల్యాల కారణంగా మార్కెట్లలో సంకట పరిస్థితులు తలెత్తడంతో 6 శాతం చార్జీలను ఎన్ఎస్ఈ విధించింది.

ట్యాక్స్‌పేయర్లకు కొంత ఊరట..

న్యూఢిల్లీ: ఆదాయం రూ. 7 లక్షలకన్నా స్వల్పంగా ఎక్కువుండి, కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునేవారికి కొంత ఊరటనిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ. 7 లక్షల పరిమితిని దాటిన మొత్తానికి మాత్రమే పన్ను విధించేలా ఆర్థిక బిల్లును సవరించింది. కేంద్ర ఆర్థిక శాఖ వివరణ ప్రకారం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త పన్ను విధానం ప్రకారం రూ. 7 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం ఉండదు. కానీ రూ. 7,00,100 ఉంటే మాత్రం రూ. 25,010 మేర పన్ను కట్టాల్సిరానుంది. అంటే రూ. 100 ఆదాయానికి రూ. 25,010 పన్ను భారం పడనుంది. ఈ నేపథ్యంలో పరిమితికన్నా ఆదాయం కాస్త ఎక్కువ ఉంటే, దానికి మించి పన్ను భారం ఉండరాదంటూ స్వల్ప ఊరటను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, ఎంత మేర అధిక ఆదాయానికి ఇది వర్తిస్తుందనేది ప్రభుత్వం నిర్దిష్టంగా వివరించలేదు. సుమారు రూ. 7,27,700 వరకు ఆదాయం ఉన్న వారికి దీనితో ప్రయోజనం ఉండగలదని నాంగియా ఆండర్సన్ పార్ట్‌నర్ సందీప్ ఝున్‌ఝున్‌వాలా తెలిపారు.



ఆకాశ ఎయిర్‌లో వెయ్యి కొలువులు

కంపెనీ సీఈవో వినయ్ దూబే వెల్లడి



న్యూఢిల్లీ: కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి సుమారు 1,000 మంది ఉద్యోగులను తీసుకోవాలని ఆకాశ ఎయిర్ భావిస్తోంది. తద్వారా మొత్తం సిబ్బంది సంఖ్యను 3,000కు పెంచుకోనుంది. దాదాపు ఏడు నెలల క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన ఆకాశ ఎయిర్ ఈ ఏడాది ఆఖరు నాటికి అంతర్జాతీయ రూట్లలోనూ సర్వీసులు మొదలుపెట్టాలని యోచిస్తోంది. కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో వినయ్ దూబే ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయ సేవలకు సంబంధించి అనువైన దేశాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి 'మూడు అంకెల స్థాయిలో' విమానాల కోసం ఆర్డరు ఇవ్వనున్నట్లు దూబే వివరించారు. ఆకాశ ఎయిర్ 72 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల కోసం ఆర్డరు ఇచ్చింది. ప్రస్తుతం కంపెనీ దగ్గర 19 విమానాలు ఉండగా .. వచ్చే ఆర్థిక సంవత్సరం మరో తొమ్మిది అందుబాటులోకి రానున్నాయి. ఏప్రిల్‌లో వచ్చే విమానంతో కలిపి ఎయిర్‌క్రాఫ్ట్‌ల సంఖ్య 20కి చేరుతుంది. తద్వారా విదేశాలకు సర్వీసులు ప్రారంభించేందుకు అర్హత లభిస్తుంది. తమకు ఇప్పుడు అదనపు విమానాలు లేకపోయినప్పటికీ ముందుగానే సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాల్సి వస్తుందని, వారికి శిక్షణనివ్వాల్సి ఉంటుందని దూబే తెలిపారు. ప్రస్తుతం తాము రోజుకు 110 ఫ్లయిట్స్ నడుపుతున్నామని.. ఈ వేసవి సీజన్ ఆఖరు నాటికి వీటిని 150కి పెంచుకుంటామని ఆయన చెప్పారు.

డాయిష్ బ్యాంక్ 14% డౌన్

ఫ్రాంక్‌ఫర్ట్: అంతర్జాతీయంగా బ్యాంకింగ్ వ్యవస్థ సంక్షోభంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ షేర్లపైనా ప్రభావం పడింది. బ్యాంకు షేర్లు శుక్రవారం ఒక దశలో 14 శాతం క్షీణించాయి. ఆ తర్వాత కొంత కోలుకుని సుమారు 9 శాతం క్షీణతతో 8.52 యూరోల వద్ద ట్రేడయ్యాయి. బాండ్లను బీమా చేసేందుకయ్యే వ్యయాలు పెరిగిపోవడం డాయిష్ బ్యాంక్ పరిస్థితిపై ఆందోళనకు కారణమైనట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇటీవల స్విస్ బ్యాంక్ క్రెడిట్ సూసీ పతనానికి ముందు కూడా ఇలాంటి పరిణామమే చోటు చేసుకోవడం గమనార్హం. అయితే డాయిష్ బ్యాంక్ మరో క్రెడిట్ సూసీ కావచ్చన్న ఆందోళనలను జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ షోల్జ్ తోసిపుచ్చారు. బ్యాంక్ పటిష్టంగానే ఉందని స్పష్టం చేశారు.



సూచీలకు పన్ను పోటు

- సెన్సెక్స్ నష్టం 398 పాయింట్లు
- 17 వేల దిగువకు నిఫ్టీ



ముంబై: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్ కాంట్రాక్టులపై కేంద్రం సెక్యూరిటీ లావాదేవీల పన్ను 25 శాతం (0.05% నుంచి 0.0625 శాతానికి)పెంపుతో స్టాక్ సూచీలు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగంలో భయాలు దావానలంలా వ్యాప్తి చెందుతుండటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచింది. అలాగే డాలర్ రికవరీతో రూపాయి క్షీణత, విదేశీ ఇన్వెస్టర్ల వరుస అమ్మకాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 398 పాయింట్లు నష్టపోయి 57,527 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు క్షీణించి 17 వేల దిగువన 16,945 వద్ద నిలిచింది. ఉదయం సెషన్‌లో లాభాలతో కదలాడిన సూచీలు మిడ్ సెషన్ ముందు బలహీనపడ్డాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 57,423 – 58,066 పరిధిలో కదలాడింది. నిఫ్టీ 16,917–17,109 రేంజ్‌లో ట్రేడైంది. ఆ తర్వాత కొద్దిసేపు లాభనష్టాల మధ్య ట్రేడైన సూచీలు ఆఖర్లో అమ్మకాలు పోటెత్తడంతో వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంక్స్, మెటల్, మీడియా, రియల్టీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఒకటిన్నర శాతం నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1720 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2556 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు క్షీణించి 82.40 వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్ రంగ సంక్షోభంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ఏఎంసీ షేర్ల పతనం..

తాజా ఫైనాన్స్ బిల్లుతో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ)ల ఈక్విటీ పెట్టుబడులపై స్వల్పకాలిక పెట్టుబడి లాభాల పన్ను వర్తించనుండటంతో ఇన్వెస్టర్లు ఆందోళనలకు లోనయ్యారు. ప్రధానంగా యూటీఐ 4.7 శాతం, ఆదిత్య బిర్లా 4.4 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ 4.2 శాతం చొప్పున పతనమయ్యాయి. ఈ బాటలో ఇతర ఏఎంసీలు శ్రీరామ్ 3.2 శాతం, నిప్పన్ లైఫ్ ఇండియా 1.3 శాతం చొప్పున క్షీణించాయి.



నేడు నీతూ, స్వీటీ 'పసిడి' పంచ్ పోరు

ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నేడు ఇద్దరు భారత బాక్సర్లు నీతూ (48 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు) పసిడి పతకాల కోసం పోటీపడనున్నారు. నేటి ఫైనల్స్‌లో లుత్సయ్‌ఖాన్ (మంగోలియా)తో నీతూ... లీనా వాంగ్ (చైనా)తో స్వీటీ తలపడతారు. హరియాణాకు చెందిన 22 ఏళ్ల నీతూ 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకం నెగ్గింది. 2017, 2018 ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకాలను సొంతం చేసుకుంది. సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నీతూ తొలిసారి ఫైనల్‌కు చేరింది. హరియాణాకే చెందిన 30 ఏళ్ల స్వీటీ రెండోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. 2014లో రజత పతకం నెగ్గిన స్వీటీ ఈసారైనా తన పసిడి కలను సాకారం చేసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఆదివారం జరిగే ఫైనల్స్‌లో నిఖత్ జరీన్ (50 కేజీలు), లవ్లీనా (75 కేజీలు) పోటీపడతారు.



రుద్రాంక్ష్‌కు కాంస్యం



భోపాల్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌లో వరుసగా మూడో రోజూ భారత్ ఖాతాలో పతకం చేరింది. శుక్రవారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో రుద్రాంక్ష్ పాటిల్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్లు పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో రుద్రాంక్ష్ 262.3 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. క్వాలిఫయింగ్‌లో రుద్రాంక్ష్ 631 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో, భారత్‌కే చెందిన హృదయ్ హజారికా 630.4 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత పొందారు. ర్యాంకింగ్ రౌండ్‌లో హృదయ్ 208.7 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచాడు.

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ



బాసెల్: స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 12-21, 21-17, 28-26తో ఫాంగ్ చియా లీ-ఫాంగ్ జెన్ లీ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో భారత స్టార్, డిఫెండింగ్ చాంపియన్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 15-21, 21-12, 18-21తో పుత్రి కుసుమ వర్ధిని (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది.

సలీమా టేటేకు 'ఆసియా హాకీ' అవార్డు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు మిడ్‌ఫీల్డర్ సలీమా టేటేకు ఆసియా హాకీ సమాఖ్య (ఏహెచ్ఎఫ్) అవార్డు లభించింది. 2022 సంవత్సరానికి జార్ఖండ్‌కు చెందిన 22 ఏళ్ల సలీమా టేటే 'ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకుంది. కొరియాలో జరిగిన ఏహెచ్ఎఫ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో సలీమాకు ఈ అవార్డు ప్రదానం చేశారు. 2016లో జాతీయ సీనియర్ జట్టు తరఫున అరంగేట్రం చేసిన సలీమా గత ఏడాది మస్కట్‌లో జరిగిన ఆసియా కప్ టోర్నీలో 'రైజింగ్ ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కించుకుంది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత జట్టులోనూ సభ్యురాలిగా ఉంది.

సివర్ జోరు... వాంగ్ హోరు

- డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ముంబై ఇండియన్స్
- ఎలిమినేటర్ మ్యాచ్‌లో యూపీపై గెలుపు
- సివర్ మెరుపులు
- ఇసీ వాంగ్ 'హ్యాట్రిక్'
- ఆదివారం ఫైనల్లో ఢిల్లీతో ముంబై 'ఢీ'


సివర్


ఇసీ వాంగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో ఆరంభ అంచనాలను నిజం చేస్తూ ముంబై ఇండియన్స్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. లీగ్ దశ చివర్లో కాస్త తడబడినా... తమ స్థాయిని ప్రదర్శిస్తూ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం శుక్రవారం జరిగిన 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌పై 72 పరుగులతో ఏకపక్ష విజయాన్ని అందుకుంది. బ్యాటింగ్‌లో నాట్ సివర్ బ్రంట్ చెలరేగగా, బౌలింగ్ ఇసీ వాంగ్ లీగ్‌లో తొలి 'హ్యాట్రిక్'తో సత్తా చాటింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. నాట్ సివర్ (38 బంతుల్లో 72 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు హాఫ్ సెంచరీ సాధించగా... అమేలియా కెర్ (19 బంతుల్లో 29; 5 ఫోర్లు) చివర్లో దూకుడుగా ఆడింది. అనంతరం యూపీ 17.4 ఓవర్లలో 110 పరుగులకే కుప్పకూలింది. కిరణ్ నవ్‌గిరే (27 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. కెప్టెన్ అలీసా హీలీ పుట్టిన రోజునాడు ఓటమిని ఎదుర్కొన్న యూపీ టోర్నీని మూడో స్థానంతో ముగించగా... ఆదివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ముంబై తలపడుతుంది.

సివర్ దూకుడు...

ముంబై ఇన్నింగ్స్ మొత్తంలో నాట్ సివర్ ఆట చుక్కానిలా నిలిచింది. వరుసగా నాలుగు కీలక భాగస్వామ్యాలతో ఆమె జట్టుకు భారీ స్కోరును అందించడంలో సఫలమైంది. తొలి బంతికే ఫోర్‌తో యస్తిక భాటియా (18 బంతుల్లో 21; 4 ఫోర్లు) ఆటను మొదలు పెట్టింది. ఆ తర్వాత కొన్ని చక్కటి షాట్లు ఆడిన తర్వాత యస్తికను అంజలి శర్వాణి వెనక్కి పంపించింది. ఆ తర్వాత హేలీ మాథ్యూస్ (26 బంతుల్లో 26; 2 ఫోర్లు, 1 సిక్స్) జత కలిసింది. హేలీ తనదైన శైలిలో ధాటిగా ఆడలేక విఫలం కాగా, ఎకెల్‌స్టోన్ చక్కటి బంతికి హర్మన్‌ప్రీత్ (14) అవుటైంది. అయితే మరో ఎండ్‌లో మాత్రం సివర్ తన జోరు కొనసాగించింది. పార్శవి ఓవర్లో వరుసగా 4, 6, 4 కొట్టిన ఆమె 26 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. చివరి 2 ఓవర్లలో ముంబై 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు రాబట్టడం విశేషం.

టపటపా...

కిరణ్ నవ్‌గిరే ఇన్నింగ్స్ మినహా యూపీ ఆటలో చెప్పుకోవడానికి ఏమీ లేకపోయింది. ఇషాక్ ఓవర్లో కిరణ్ 3 ఫోర్లు, 1 సిక్స్ బాదడమే హైలైట్. కీలక ప్లేయర్లు అలీసా హీలీ (11), తాలియా మెక్‌గ్రాత్ (7), గ్రేస్ హారిస్ (14) విఫలం కావడం జట్టును దెబ్బ తీసింది. 56/4తో కష్టాల్లో నిలిచి కోలుకునే ప్రయత్నం చేస్తున్న దశలో ఇసీ వాంగ్ ఇన్నింగ్స్ 13వ ఓవర్‌లో వరుస మూడు బంతుల్లో నవ్‌గిరే, సిమ్రన్ షేక్, సోఫీ ఎకెల్‌స్టోన్‌లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' సాధించింది. వాంగ్ దెబ్బకు యూపీ ఓటమి లాంఛనమే అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (సి) నవ్‌గిరే (బి) అంజలి 21; హేలీ మాథ్యూస్ (సి) నవ్‌గిరే (బి) పార్శవి 26; నాట్ సివర్ (నాటౌట్) 72; హర్మన్‌ప్రీత్ (బి) ఎకెల్‌స్టోన్ 14; అమేలియా కెర్ (సి) అంజలి (బి) ఎకెల్‌స్టోన్ 29; పూజ వస్త్రకర్ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1-31, 2-69, 3-104, 4-164. **బౌలింగ్:** హారిస్ 3-0-20-0, అంజలి 3-0-17-1, రాజేశ్వరి 4-0-36-0, ఎకెల్‌స్టోన్ 4-0-39-2, దీప్తి శర్మ 4-0-39-0, పార్శవి చోప్రా 2-0-25-1.

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: హీలీ (సి) హర్మన్ (బి) వాంగ్ 11; శ్వేత (సి) మాథ్యూస్ (బి) ఇషాక్ 1; తాలియా (రనౌట్) 7; నవ్‌గిరే (సి) సివర్ (బి) వాంగ్ 43; హారిస్ (సి) వాంగ్ (బి) సివర్ 14; దీప్తి శర్మ (సి) కలిత (బి) మాథ్యూస్ 16; సిమ్రన్ (బి) వాంగ్ 0; ఎకెల్‌స్టోన్ (బి) వాంగ్ 0; అంజలి (బి) కలిత 5; రాజేశ్వరి (ఎల్బీ) (బి) ఇషాక్ 5; పార్శవి (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (17.4 ఓవర్లలో ఆలౌట్) 110. వికెట్ల పతనం:** 1-8, 2-12, 3-21, 4-56, 5-84, 6-84, 7-84, 8-94, 9-104, 10-110. **బౌలింగ్:** నాట్ సివర్ 3-0-21-1, సైకా ఇషాక్ 2.4-1-24-2, వాంగ్ 4-0-15-4, అమేలియా 3-0-25-0, మాథ్యూస్ 3-0-21-1, అమన్‌జోత్ 1-0-2-0, కలిత 1-0-2-1.

రొనాల్డో రికార్డు...

అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాల్ ప్లేయర్‌గా పోర్చుగల్ కెప్టెన్ ఘనత



లిస్బన్: విఖ్యాత ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో తన పేరిట మరో రికార్డును లిఖించుకున్నాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా 38 ఏళ్ల రొనాల్డో గుర్తింపు పొందాడు. యూరో-2024 క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా లిక్టెన్‌స్టయిన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రొనాల్డో బరిలోకి దిగాడు. పోర్చుగల్ తరఫున రొనాల్డో కెరీర్‌లో ఇది 197వ మ్యాచ్. తద్వారా 196 మ్యాచ్‌లతో కువైట్ ప్లేయర్ బదర్ అల్ ముతావా పేరిట ఉన్న రికార్డును రొనాల్డో బద్దలు కొట్టాడు. 2003 నుంచి పోర్చుగల్ జట్టుకు ఆడుతున్న రొనాల్డో వరుసగా ఐదు ప్రపంచకప్‌లలో గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా ఘనత వహించాడు. లిక్టెన్‌స్టయిన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 4-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. రొనాల్డో (51వ, 63వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేశాడు. దాంతో జాతీయ జట్టు తరఫున రొనాల్డో చేసిన గోల్స్ సంఖ్య 120కు చేరుకుంది. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ చేసిన రికార్డు... అత్యధికంగా 10 హ్యాట్రిక్‌లు నమోదు చేసిన రికార్డు కూడా రొనాల్డో పేరిటే ఉన్నాయి.

1961 తర్వాత ఇటలీలో ఇంగ్లండ్ గెలుపు


హ్యారీ కేన్

యూరో-2024 క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా నేపుల్స్‌లో ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. 1961 తర్వాత ఇటలీ జట్టును వారి సొంతగడ్డపైనే ఇంగ్లండ్ ఓడించడం గమనార్హం. ఇంగ్లండ్ తరఫున రైస్ (13వ ని.లో), కెప్టెన్ హ్యారీ కేన్ (44వ ని.లో)... ఇటలీ తరఫున రెటుగుయ్ (56వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్ ద్వారా హ్యారీ కేన్ ఇంగ్లండ్ తరఫున అత్యధిక అంతర్జాతీయ గోల్స్ చేసిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. 53 గోల్స్‌తో వేన్ రూనీ పేరిట ఉన్న రికార్డును 54వ గోల్‌తో హ్యారీ కేన్ సవరించాడు.

మెస్సీ ఖాతాలో 800వ గోల్...

బ్యూనస్ ఎయిర్స్‌లో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా 2-0తో పనామా జట్టును ఓడించింది. గత ఏడాది డిసెంబర్‌లో ఖతర్‌లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్ తర్వాత మెస్సీ ఆడిన మ్యాచ్ ఇదే కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో మెస్సీ 88వ నిమిషంలో గోల్ చేశాడు. దాంతో ప్రొఫెషనల్ కెరీర్‌లో 800 గోల్స్ సాధించిన రెండో ప్లేయర్‌గా మెస్సీ గుర్తింపు పొందాడు. 830 గోల్స్‌తో క్రిస్టియానో రొనాల్డో అగ్రస్థానంలో ఉన్నాడు.



నేటి నుంచి మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ

తొలి రౌండ్‌లో హంపితో హారిక 'ఢీ'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ 2022-2023లో భాగంగా మూడో టోర్నీ భారత్ వేదికగా నేడు మొదలుకానుంది. న్యూఢిల్లీలో ఏప్రిల్ 5 వరకు జరిగే ఈ టోర్నీలో 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లు జరుగుతాయి. భారత్ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక పోటీపడుతున్నారు. శనివారం జరిగే తొలి రౌండ్ గేమ్‌లో వీరిద్దరు ముఖాముఖిగా తలపడతారు. ఫిబ్రవరిలో మ్యూనిక్‌లో జరిగిన రెండో టోర్నీలో హంపి రెండో స్థానంలో, హారిక నాలుగో స్థానంలో నిలిచారు.

క్లుప్తంగా...

3 తీర్మానాలకు ఆమోదం

సాక్షి, అమరావతి: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా శుక్రవారం మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో రెండు ప్రభుత్వ తీర్మానాలు కాగా మరొకటి సభ్యులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియచేస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, వాల్మీకి, బోయలను ఎస్టీల జాబితాలో చేర్చేలా రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రూపొందించిన తీర్మానాలను సభ ఆమోదించింది.

బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లో చేర్చడం గొప్పవిషయం

- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రులు
- అసెంబ్లీలో తీర్మానంపై మంత్రి గుమ్మనూరు హర్షం

సాక్షి, అమరావతి: బోయ, వాల్మీకి కులాలను ఎస్టీల్లోను, దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలోను చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో శుక్రవారం రెండు తీర్మానాలను ఆమోదించడంపై రాష్ట్ర మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్, కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, అనంతపురం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వాల్మీకి మంగమ్మ, కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి గుమ్మనూరు జయరాం విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాల తరబడి కలగా మిగిలిన ఈ రెండు ప్రధాన డిమాండ్లను పెద్ద మనసుతో అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ అసెంబ్లీలో తీర్మానం చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో వాల్మీకులు 13 పూర్వ జిల్లాలకుగాను 5 జిల్లాల్లో ఎస్టీలుగాను, 8 జిల్లాల్లో బీసీలుగా ఉన్నారని చెప్పారు. దాదాపు 70 ఏళ్లుగా ఉన్న వాల్మీకుల సమస్యను గుర్తించి ఆదుకున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. వైఎస్ రాజారెడ్డి నుంచి వైఎస్సార్, వైఎస్ జగన్ వరకు వాల్మీకులకు అండగా నిలిచారని కొనియాడారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీపై సర్వత్రా హర్షం

సాక్షి, అమరావతి: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ విషయమై అసెంబ్లీలో శుక్రవారం ఏకగ్రీవ తీర్మానం ప్రవేశపెట్టడంపై సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితతో కలిసి సీఎం వైఎస్ జగన్‌ను సత్కరించినట్టు వరప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ పాస్టర్ జీవన్‌కుమార్ కూడా సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి దళిత క్రైస్తవుడికి ఎస్సీ హోదా కల్పించేలా కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానం చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని దళిత క్రైస్తవ సమాజం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతుందని పేర్కొన్నారు.

మళ్లీ గెలిస్తే టీడీపీ కార్యకర్తల్ని బాగు చేస్తా

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మంత్రిని నియమిస్తా
- నవంబర్, డిసెంబర్‌లో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు


సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో గెలిస్తే కష్టపడిన కార్యకర్తలను వెతుక్కుంటూ పార్టీయే వాళ్ల వద్దకు వస్తుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు భరోసా ఇచ్చారు. అప్పుడు పైరవీలు ఉండవన్నారు. రాష్ట్రాన్ని బాగు చేయడంతోపాటు కార్యకర్తలను కూడా బాగు చేస్తానని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ జోన్-3 జిల్లాల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. అంతకుముందు ఒక ఫంక్షన్ హాలులో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశాల్లో చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీ బలపడిందని.. కాబట్టి సీఎం జగన్ నవంబర్ లేదా డిసెంబర్‌లో ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ముందస్తు ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నాయకులకు చెప్పారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని, అధికారంలోకి వచ్చాక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మంత్రిని నియమిస్తానని తెలిపారు. ఇక టీడీపీ అన్‌స్టాపబుల్ అని, గేరు మార్చి స్పీడు పెంచుతామన్నారు. సైకిల్‌పై దూసుకెళ్తామని, అడ్డు వస్తే తొక్కుకుని వెళ్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీచింది చిన్న గాలేనని, భవిష్యత్తులో టీడీపీ సునామీ వస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ గెలవడం దేవుడి స్క్రిప్టేనని తెలిపారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి టీడీపీకి అర్హతే లేదన్నారని, ఇప్పుడు 23 ఓట్లతో టీడీపీ గెలిచిందని గుర్తు చేశారు. రాష్ట్రం జగన్ చేతిలో ఉండటం ప్రజల దౌర్భాగ్యమన్నారు.

మాది మానవీయ బడ్జెట్

అక్క చెల్లెమ్మలు, రైతు పక్షపాత బడ్జెట్ ● గ్రామ స్వరాజ్యం, సామాజిక న్యాయం బడ్జెట్

సంక్షేమ కేలండర్ కచ్చితంగా అమలు ● శాసనసభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి :తమ ప్రభుత్వానిది సమాజంలో అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధిని అందించే మానవీయ బడ్జెట్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 'ఇది అక్క చెల్లెమ్మలు, రైతన్నల పక్షపాత బడ్జెట్.. గ్రామ స్వరాజ్య బడ్జెట్.. మన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సామాజిక న్యాయ బడ్జెట్' అని చెప్పారు. శుక్రవారం శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చలో మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా రూపొందించి అమలు చేస్తున్నట్టుగానే 2023-24లోనూ మానవీయ బడ్జెట్‌ను అందించామన్నారు. కచ్చితంగా సంక్షేమ కేలండర్‌ను ప్రకటించి ఆ మేరకు అన్ని వర్గాల లబ్ధిదారులకు ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. తాము ఖురాన్, బైబిల్, భగవద్గీతగా భావిస్తున్న మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీకి గత నాలుగేళ్లుగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ, ఆ పనులు పూర్తి చేస్తూ వచ్చామని తెలిపారు. గత నాలుగు బడ్జెట్‌లలోనూ ఇదే మానవత్వం కనిపించిందన్నారు.



టీడీపీ హయాంలో భూ కబ్జాలపై విచారణ జరపాలి

- శాసనసభలో సుదీర్ఘంగా సాగిన జీరో అవర్
- నియోజకవర్గాల సమస్యలపై స్పందించిన 46 మంది సభ్యులు
- ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి విడిపించి, పేదలకు ఇవ్వాలని వినతి



సాక్షి, అమరావతి: శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం 'జీరో'అవర్ సుదీర్ఘంగా సాగింది. రెండున్నర గంటలకు పైగా 46 మంది శాసన సభ్యులు వారి నియోజకవర్గాల సమస్యలపై మాట్లాడారు. జీరో అవర్‌ను ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి నడిపించారు. తెలుగుదేశం పార్టీ పాలనలో జరిగిన భూకబ్జాలపై విచారణ జరపాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. చంద్రబాబు, లోకేశ్ వారి పర్యటనల్లో అధికార పక్ష నాయకులపై భూ కబ్జా ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. టీడీపీ హయాం నుంచి ఎంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందో సమగ్ర విచారణ చేయించాలి కోరారు. దీనిపై ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి స్పందిస్తూ.. 'నేను ఇప్పుడు చైర్‌లో కూర్చున్నా. లేకుంటే శాసన సభ్యుడినే కదా. రెండు నెలల కిందట చంద్రబాబు విజయనగరంలో నాపైనా ఆరోపణలు చేశారు. ఏ భూములైతే ఆక్రమించానని ఆరోపిస్తున్నారో.. ఆ భూముల్లో చంద్రబాబు కూర్చుని ఆందోళన చేస్తే ప్రజలకు బాగా అర్థమవుతుందని చెప్పాను. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఆరోపణలపై విచారణకు ఆదేశించమని ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణల నుంచి విడిపించి అర్హులైన పేదలకు ఇవ్వాలని సభ్యులు విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను త్వరితంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

లోకేశ్ కబ్జా ఆరోపణలపై విచారణ చేయించాలి: ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరులో టీడీపీ నేత లోకేశ్ చేసిన ఆరోపణలపై విచారణ జరిపించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని తాను, మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆక్రమించుకున్నామని లోకేశ్ ఆరోపించారన్నారు. గతంలో తమ నియోజకవర్గం ఎమ్మెల్యే అయిన మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఎన్ని ఎకరాలు కబ్జాకు గురైంది, 2014-19 మధ్య ఎంత భూమి మింగేశారు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎంత కబ్జాకు గురైందో సీఐడీ, విజిలెన్స్ ద్వారా విచారణ జరిపించి వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు. తాను ఏనాడూ ప్రభుత్వ భూముల విషయంలో జోక్యం చేసుకోలేదని చెప్పారు.

పేజ్‌కు భూ కేటాయింపులపై వాస్తవాలు నిగ్గు తేల్చాలి

టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ పరిశ్రమల శాఖ మంత్రిగా ఉండగా పేజ్ ఇండస్ట్రీకి 28 ఎకరాలు కారు చౌకగా ఎకరం రూ.10 లక్షలకు కేటాయించడంపై విచారణ జరపాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్కడ ఎకరం రూ.4 కోట్లు ఉంటుందని, రూ.110 కోట్ల విలువైన స్థలాన్ని రూ.2.80 కోట్లకే రిజిస్టర్ చేశారని చెప్పారు. మూడేళ్ల తర్వాత భూమిని విక్రయించుకోవచ్చని జీవో కూడా ఇచ్చారన్నారు. 2016లో భూమి ఇస్తే 2019 వరకు ఆసంస్థ కార్యకలాపాలు ప్రారంభించలేదన్నారు. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరారు. టీడీపీ హయాంలో రామగిరిలో రూ.1000 కోట్ల విలువైన గ్రానైట్‌ను ఎటువంటి రాయల్టీలు చెల్లించకుండా తరలించారని అన్నారు. ఆన్‌లైన్ విధానంలో భూయాజమాన్య మార్పులు చేసే వెసులుబాటుతో అనంతపురం రూరల్, రాప్తాడు నియోజకవర్గంలో వందల కోట్లు విలువ చేసే భూముల్లో బినామీల పేర్లతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేశారని, ఇలాంటి దోపిడీల్లో ప్రభుత్వం వాస్తవాలను నిగ్గుతేల్చాలని కోరారు.

బుడగ జంగాలకు కుల ధ్రువీకరణ చేపట్టాలి

సరైన గుర్తింపు లేని బుడగ జంగాలకు కుల ధ్రువీకరణ చేపట్టి ప్రభుత్వ పథకాలు అందించాలని కొందరు సభ్యులు కోరారు. దీనిపై రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. ఇది రాష్ట్ర పరిధిలోని అంశం కాదని.. కేంద్ర కేబినెట్ ఆమోదంతో పార్లమెంట్ చట్ట సవరణ ద్వారా చేయాల్సి ఉంటుందన్నారు. బుడగ జంగాలు ఏ వర్గంలోకి వెళ్లాలనుకుంటున్నారో సంబంధిత కమిషన్‌కు విజ్ఞప్తి చేయాలని సూచించారు.

ఆరోగ్యశ్రీ ట్రస్టులో ఉద్యోగుల హెల్త్ స్కీం కంట్రిబ్యూషన్

ఉద్యోగ సంఘాల ప్రతిపాదనకు అంగీకారం

- పీఆర్సీ పెండింగ్ అంశాలు త్వరలో పరిష్కారం
- దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం జిల్లాకో ఆస్పత్రి కేటాయింపు
- నెలాఖరులోగా సీపీఎస్ కంట్రిబ్యూషన్ రూ.1,554 కోట్లు చెల్లింపు
- సీఎస్ హామీలను వివరించిన ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకట్రామిరెడ్డి

సాక్షి, అమరావతి : ఉద్యోగ సంఘాల ప్రతిపాదన మేరకు ప్రభుత్వ ఉద్యోగులు చెల్లిస్తున్న హెల్త్ స్కీం కంట్రిబ్యూషన్ సొమ్మును ఆర్థిక శాఖ వద్ద కాకుండా ఆరోగ్యశ్రీ ట్రస్టు వద్ద ఉంచనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎస్ సమావేశమయ్యారు. పీఆర్సీకి సంబంధించిన పెండింగ్ అంశాలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు హెల్త్ స్కీం గురించి వివరించారు. ఈ నెల 31తో ముగిసే ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువును మరో ఏడాది పొడిగించాలన్న ఉద్యోగ సంఘాల వినతిపై స్పందిస్తూ ఆ ఫైలు ఆర్థిక శాఖ వద్ద ఉందని తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన వివిధ బిల్లులపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, కార్యదర్శి కె.సత్యనారాయణ వివరించారు. ఇప్పటివరకూ చెల్లించిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఎస్ఎల్ఎస్, టీఏ గురించి వివరించారు. ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ కె. వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హెల్త్ స్కీం బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు : వెంకట్రామిరెడ్డి

ఉద్యోగుల హెల్త్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం కోసం ఉద్యోగుల కంట్రిబ్యూషన్, ప్రభుత్వ కంట్రిబ్యూషన్ కలిపి ఈహెచ్ఎస్ ట్రస్టుకు (ఆరోగ్యశ్రీ ట్రస్టు) బదిలీ చేసి బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తామని సీఎస్ హామీ ఇచ్చినట్లు ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. సర్జరీల కోసం ఇచ్చే ప్రిఆథరైజేషన్‌కు దరఖాస్తు చేసిన 12 గంటల లోపు అనుమతి ఇస్తామని చెప్పారన్నారు. హెల్త్ స్కీమ్‌లో సమస్యల పరిష్కారానికి 104 టోల్ ఫ్రీ నంబరులో మూడో (ఆప్షన్) నంబర్‌ను కేటాయించి, గంటలోపు ఫిర్యాదులు పరిష్కరిస్తామని చెప్పినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న ఉద్యోగులకు ఓపీ సేవలు, మందుల కోసం ప్రతి జిల్లాలో ఒక ఆస్పత్రిని కేటాయిస్తామని చెప్పారన్నారు. ఉద్యోగుల బిల్లులు రూ.3 వేల కోట్లను ఈ నెలాఖరుకు చెల్లిస్తామని గత సమావేశంలో చెప్పిన మాట ప్రకారం ఇప్పటివరకు రూ. 2,660 కోట్లు చెల్లించినట్లు తెలిపారని వివరించారు. జీపీఎఫ్ కింద రూ.1,510 కోట్లు, ఏపీజీఎల్ఐ కింద రూ.425 కోట్లు, ఎంఆర్ రూ.55 కోట్లు, ఈహెచ్ఎస్ రూ.108 కోట్లు, గ్రాట్యుటీ రూ.250 కోట్లు, టీఏ రూ.135 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. సీపీఎస్‌కు సంబంధించి ఉద్యోగులు, ప్రభుత్వ కంట్రిబ్యూషన్ మొత్తం రూ.1,554 కోట్లను ఈ నెలాఖరులోపు చెల్లిస్తామన్నారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీ అంశాన్ని సీఎం అంగీకరించారని, త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎస్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీఎంతో మాట్లాడి వీలైనంత త్వరగా పెండింగ్ డీఏ ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

రిటైరయ్యే వారిని గౌరవంగా పంపుదాం

- టీడీపీ సభ్యులకు మండలి చైర్మన్ ప్రతిపాదన
- తిరస్కరించి వాయిదా తీర్మానంపై చర్చకు పట్టు
- ప్రశ్నోత్తరాల మధ్యలోనే బయటకు వెళ్లిన టీడీపీ సభ్యులు

సాక్షి, అమరావతి : శాసన మండలిలో రిటైర్ అవుతున్న సభ్యులను గౌరవంగా సాగనంపాలన్న మండలి చైర్మన్ చేసిన ప్రతిపాదనను కూడా తెలుగుదేశం పార్టీ సభ్యులు తిరస్కరించి, వారి దుర్నీతిని చాటుకున్నారు. వాయిదా తీర్మానంపై పట్టుబట్టి, కొద్దిసేపు రచ్చ చేసి, ప్రశ్నోత్తరాలు జరుగుతుండగానే సభ నుంచి వెళ్లిపోయారు. మండలి సమావేశాల చివరిరోజైన శుక్రవారం సభ ప్రారంభం కాగానే టీడీపీ సభ్యులు వాయిదా తీర్మానం కోసం పట్టుబట్టారు. 'ఈ రోజు ఎలాంటి గొడవలు లేకుండా సభలో చర్చలు జరిపి, తాజాగా రిటైర్ అవుతున్న సభ్యులను గౌరవంగా పంపిద్దాం' అని మండలి చైర్మన్ మోషేన్ రాజు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను టీడీపీ సభ్యులు తిరస్కరించారు. పోడియం ముందు నిలబడి నినాదాలతో ఆందోళన కొనసాగించారు. టీడీపీ ఎమ్మెల్సీలు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్టు చైర్మన్ ప్రకటించిన తర్వాత కూడా దానిపై చర్చ జరగాల్సిందేనని నినాదాలు చేశారు. ప్రశ్నోత్తరాల అనంతరం మాట్లాడే అవకాశం ఇస్తానని టీడీపీ సభ్యులకు చైర్మన్ సూచించగా.. తమ స్థానాల్లో కూర్చోవడానికి ప్రయత్నించిన టీడీపీ సభ్యులు.. అంతలోనే హఠాత్తుగా మూకుమ్మడిగా బయటకు వెళ్లిపోయారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

కుంకుమపువ్వు కృత్రిమ సాగుకు ప్రోత్సాహం

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: కృత్రిమ వాతావరణంలో కుంకుమపువ్వు సాగును ప్రోత్సహించే దిశగా తమ శాఖ చర్యలు తీసుకుందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం వ్యవసాయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన విద్యార్థిని ఒకరు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో తన ఇంట్లోనే హ్యూమిడిఫైర్స్ సాయంతో సెమి హైడ్రోపోనిక్స్ పరిస్థితులు సృష్టించి కుంకుమపువ్వు సాగుచేస్తున్నట్లు రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. జమ్మూ, కశ్మీర్‌లోని పంపోర్, పుల్వామా, బుద్గాం, శ్రీనగర్ ప్రాంతాల్లో కుంకుమపువ్వు సాగుకు అనువైన వాతావరణ పరిస్థితులు ఉన్నందున అక్కడ వాణిజ్యస్థాయిలో ఈ పంట సాగుచేస్తున్నట్లు తెలిపారు.

సమశీతోష్ణ వాతావరణం, నీరు నిల్వని వదులైన భూమి కుంకుమపువ్వు సాగుకు అనువైన పరిస్థితులు కల్పిస్తాయన్నారు. భూమిలో పీహెచ్ విలువ 6.3 నుంచి 8.3 వరకు ఉండాలని, వాతావరణం ఎండాకాలంలో 23 నుంచి 27 డిగ్రీల సెంటీగ్రేడ్ మధ్య శీతాకాలంలో మైనస్ 15 డిగ్రీల నుంచి మైనస్ 20 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు తగ్గకుండా ఉంటే నాణ్యమైన కుంకుమపువ్వు దిగుబడి సాధించవచ్చని వివరించారు. కృత్రిమ వాతావరణంలో నిరూపితమైన టెక్నాలజీని వినియోగించి కుంకుమపువ్వుతో సహా ఎలాంటి పంటలు సాగుచేయడానికైనా ఉద్యానవన పంటల సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్) ద్వారా తమ శాఖ మద్దతు ఇస్తుందని మంత్రి తెలిపారు.

ఆహార భద్రత మిషన్‌లో చిరుధాన్యాలకు ప్రోత్సాహం

చిరుధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో వాటిని ప్రజాపంపిణీ వ్యవస్థలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత మిషన్ కింద సబ్-మిషన్ ఏర్పాటు చేసిందని ఆహార, ప్రజాపంపిణీశాఖ సహాయమంత్రి సాధ్వి నిరంజన్‌జ్యోతి తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. గత ఐదేళ్లలో దేశంలో 814.17 లక్షల మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలు ఉత్పత్తి అయినట్లు చెప్పారు. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆహార ధాన్యాల ఉత్పత్తి అంచనా ప్రకారం 2022-23లో దేశంలో 159.09 లక్షల మెట్రిక్ టన్నుల చిరుధాన్యాలతో సహా మొత్తం 3,235.54 లక్షల మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయినట్లు తెలిపారు.

టెండర్లపై మూల్యాంకనం

200 వందేభారత్ రైళ్ల నిర్మాణం కోసం రైల్‌వికాస్ నిగమ్ (న్యూఢిల్లీ)తో కలిపి రష్యాకు చెందిన జేఎస్‌సీ మెట్రోవాగన్‌మాష్ సంస్థ, జాయింట్ స్టాక్ కంపెనీ లోకోమోటివ్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ (రష్యా) దాఖలు చేసిన టెండర్లను మూల్యాంకనం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమాధానమిచ్చారు.

నాలుగేళ్లలో 1,019 స్టార్టప్‌లు

ఆంధ్రప్రదేశ్‌లో 2020 నుంచి 2023 ఫిబ్రవరి వరకు 1,019 స్టార్టప్‌లను డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ, ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) గుర్తించిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి సోమ్‌ప్రకాశ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు జవాబిచ్చారు.

లోక్‌సభ

ఏపీ నుంచి 29 ప్రతిపాదనలు వచ్చాయి

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి తమ శాఖకు 29 కొత్త ప్రతిపాదనలు వచ్చాయని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ మంత్రి సర్బానంద సోనోవాల్ చెప్పారు. తమ శాఖ పాక్షికంగా నాలుగు ప్రాజెక్టులకు నిధులు సమకూర్చిందని లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. భావనపాడు ఓడరేవు అభివృద్ధికి సంబంధించిన 10 ప్రతిపాదిత ప్రాజెక్టులు, రామాయపట్నం ఓడరేవు, మచిలీపట్నం ఓడరేవులకు గతిశక్తిలో భాగంగా నిధుల అవకాశాలు అన్వేషించాలని ఏపీ ప్రభుత్వం కోరిందని చెప్పారు. మిగిలిన 15 ప్రాజెక్టులపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇతర విభాగాలతో సంప్రదింపులు చేస్తున్నాయన్నారు. సాగరమాల పథకంలో భాగంగా ఏపీలో రూ.2,505 కోట్లతో 14 ప్రాజెక్టులు చేపట్టామని, వీటిలో రూ.741 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, రూ.1,764 కోట్ల విలువైన తొమ్మిది ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఆర్‌వో-ఆర్‌వో, పాసింజర్ జెట్టీలు, ఫిషింగ్ హార్బర్లు, పోర్టు ఆధునికీకరణ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు రూ.450 కోట్లు అనుమతించి రూ.198 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

సీసీఐకు రూ.1.34 లక్షలు

ఆంధ్రప్రదేశ్‌లో 50 మంది సామర్థ్యం కలిగిన చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ)కు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా 2022-23లో రూ.1.34 లక్షలు సాయం అందించాలని నిర్ణయించినట్లు కేంద్ర మహిళ, శిశు అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరానీ తెలిపారు. 2017-18 నుంచి 2021-22 వరకు పలు సీసీఐలకు సుమారు రూ.70 లక్షలు విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ బి.వి.సత్యవతి ప్రశ్నకు జవాబిచ్చారు.

11 ఆయుష్ మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు

ఆంధ్రప్రదేశ్‌లో 11 ఆయుష్ మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు ఉన్నాయని కేంద్ర ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ వైఎస్సార్‌సీపీ ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

మండలి నిరవధిక వాయిదా

8 రోజుల సమావేశంలో 27 బిల్లులకు ఆమోదం

సాక్షి, అమరావతి: శుక్రవారం శాసనమండలి సమావేశాలు ముగిశాక మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. శుక్రవారం ద్రవ్య వినిమయ బిల్లుతో పాటు 12 బిల్లులకు ఆమోదం తెలిపిన మండలి మొత్తం 8 రోజుల సమావేశంలో 27 బిల్లులను ఆమోదించింది. 8 రోజుల సమావేశంలో సభ్యులు 28 గంటల 57 నిమిషాలు మాట్లాడినట్లు చైర్మన్ ప్రకటించారు. మొత్తం 66 స్టార్ ప్రశ్నలకు సమాధానాలివ్వగా.. 23 స్టార్ ప్రశ్నలను టేబుల్ చేశారు. మార్చి 24వ తేదీ నాటికి సభలో వైఎస్సార్‌సీపీ సభ్యులు 25, టీడీపీ 14, బీజేపీ 1, పీడీఎఫ్ 5, స్వతంత్రులు 3 నామినేటెడ్ 8, రెండు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

పదవీ విరమణ చేయనున్న 21 మందికి సన్మానం

శాసన మండలి నుంచి త్వరలో పదవీ విరమణ చేయనున్న 21 మంది సభ్యులకు వారికి తన ఛాంబర్‌లో సన్మానం చేయనున్నట్లు చైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు. ఈ సందర్భంగా సభలో ఉన్న పదవీ విరమణ చేయనున్న సభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు. బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ మండలిలో జరిగిన అర్థవంతమైన చర్చల ద్వారా మరింత పరిణతి చెందానని, రెండు కమిటీల్లో పనిచేసే అవకాశం లభించడం అదృష్టమన్నారు. వాకాటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ 12 ఏళ్ల ఎమ్మెల్సీ కాలం త్వరలో ముగియనుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను సభ దృష్టికి తీసుకురావడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. గత ప్రొసీడింగ్స్‌కు భిన్నంగా పదవీ విరమణ చేస్తున్న వారికి చాంబర్‌లో సన్మానం ఏర్పాటు చేయడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ యడవల్లి శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ కరోనా వంటి కష్టకాలాన్ని తట్టుకుని ఈ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల రెడ్డి మాట్లాడుతూ షరీఫ్ చైర్మన్‌గా ఉన్న సమయంలో సభలో ఒక దురదృష్టకరమైన ఘటన చోటుచేసుకుందని, అటువంటివి పునరావృతం కాకుండా చైర్మన్ నడుచుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ రెండేళ్లు ప్రతిపక్షంగా, అధికారపక్షంలో ప్రభుత్వ విప్ హోదాలో పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న సభ్యుల సమయంలో గత ప్రొసీడింగ్స్‌ను అనుసరిస్తే బాగుండేదంటూ ప్రస్తు త విధానంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ సభ్యుల కోరిక మేరకే ఈ చర్చను చేపట్టామని, చాలా మంది సభ్యులు తమ అభిప్రాయాలను గౌరవంగా వెల్లడించారన్నారు. త్వరలోనే పదవీ విరమణ చేస్తున్న సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. మండలి వాయిదా అనంతరం అందుబాటులో ఉన్న పదవీ విరమణ చేస్తున్న సభ్యులను చైర్మన్ మోషేన్‌రాజు, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు.

శాసనసభ నిరవధిక వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసనసభ 15వ సమావేశాలు ముగిశాయి. శుక్రవారం సభను స్పీకర్ తమ్మినేని సీతారాం నిరవధిక వాయిదా వేశారు. మార్చి 15 నుంచి 8 రోజుల్లో 43.12 గంటల పాటు శాసనసభ జరిగిందని వివరించారు. మొత్తం 100 ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పగా, 27 బిల్లులు ఆమోదం పొందాయని తెలిపారు. ఈ సభలో ప్రభుత్వం 3 తీర్మానాలు చేయడంతో పాటు రెండు స్వల్పకాలిక చర్చలు జరిగాయని వివరించారు.

'చంద్రబాబు అంత నీచుడు ఎవరూ లేరు'



సాక్షి, అమరావతి: రాజకీయాల్లో చంద్రబాబు అంత దుర్మార్గుడు, నీచుడు, వెన్నుపోటుదారుడు మరొకరు లేరని, మళ్లీ పుట్టబోరని తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. శుక్రవారం ఆమె గుంటూరు జిల్లా తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నమ్మిన వారిని నట్టేట ముంచే మనస్తత్వం ఉన్నవాడని, విశ్వాస ఘాతకుడని మండిపడ్డారు. రాజకీయాల్లో నీతిని పాతరేసిన నీచుడన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'మళ్లీ బ్రీఫ్డ్ మీ' అనే తన నైజాన్ని మరోసారి చాటుకున్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు లాంటి సిగ్గుమాలిన రాజకీయ నాయకుడు దేశంలో ఎవరూ లేరని విమర్శించారు. ప్రజలు ఇలాంటి దుర్మార్గుడిని, వెన్నుపోటుదారుడిని రాజకీయాల్లో లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో చంద్రబాబు ఒక బ్రోకర్ అవతారంలో ఉంటే, ఆయన కొడుకు లోకేశ్ రాజకీయ జోకర్‌గా మిగిలాడన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943